www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఐటీ హబ్‌గా విశాఖ
నేటి నుండే కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభం
#ChooseSpeedChooseAP
రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

శుక్రవారం | 12-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 276

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్ష, తిథి: అష్టమి మ.2:57 తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తర తె. 5:50 తదుపరి హస్త, వర్జ్యం: ఉ.11:42-1:25, దుర్ముహూర్తం: ఉ.8:51-9:35, మ.12:30-1:14, అమృతఘడియలు: రా.10:03-11:47, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:39, సూర్యాస్తమయం: 5:38

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టీసీఎస్, ఇన్ఫీ, విప్రో, కాగ్నిజెంట్‌తో మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మక భాగస్వామ్యం

నాలుగు ఐటీ సంస్థలకు కో పైలట్ ద్వారా ఏజెంటిక్ ఏఐ సేవలు

బెంగళూరు: భారత్‌లో ఏజెంటిక్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సేవల వినియోగాన్ని మరింత పెంచేందుకు ఐటీ దిగ్గజ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాలను కుదుర్చుకున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న నాదెళ్ల.. గురువారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ భాగస్వామ్యాల్లో భాగంగా ఒక్కో ఐటీ కంపెనీకి 50,000 చొప్పున నాలుగింటికీ మొత్తం 2 లక్షల కో పైలట్ లైసెన్సులను మైక్రోసాఫ్ట్ అందించనుంది. ఈ ఐటీ కంపెనీల ఉద్యోగులు మైక్రోసాఫ్ట్ ఆఫీస్ సహా ఇతర ఉత్పత్తుల ద్వారా మరింత వేగంగా, తెలివిగా పనిచేసేందుకు తోడ్పడుతుంది. తత్ఫలితంగా కంపెనీ ఉత్పాదకత పెరిగేందుకు ఇది దోహదపడనుందని సత్య నాదెళ్ల అన్నారు.



మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

వచ్చే జూన్‌కల్లా హైదరాబాద్ క్లౌడ్ రీజియన్ ఆరంభం

డిజిటల్ మౌలిక సదుపాయాల కోసం భారీ స్థాయి పెట్టుబడుల ద్వారా భారత్‌లో ఏఐ ఆవరణ వ్యవస్థను విస్తరించే విషయంలో మైక్రోసాఫ్ట్ మరింత నిబద్ధతతో ఉందని సత్య నాదెళ్ల అన్నారు. దేశంలో కంపెనీ క్లౌడ్ సేవలను మరింత విస్తరించనున్నామని, ఇప్పటికే పుణె, చెన్నై, ముంబైలో డేటా సెంటర్లను కలిగి ఉన్నామని, వచ్చే ఏడాది ప్రథమార్ధం చివరికల్లా హైదరాబాద్‌లోనూ క్లౌడ్ రీజియన్‌ను (డేటా సెంటర్) ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా డేటా సెంటర్లను నిర్వహిస్తోంది.

2 కోట్ల మందికి ఏఐ శిక్షణ

భారత్‌లో 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ అందించనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ఏఐ ఆధారిత ఇంఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ టూల్స్ ద్వారా రూపు దిద్దుకున్న ఆర్థిక వ్యవస్థ కోసం భారత కార్మిక శక్తిని సిద్ధం చేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఒక వైపు భారత్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు సహా డిజిటల్ మౌలిక వసతులను భారీగా విస్తరిస్తున్నామని, మరోవైపు ఏఐ నైపుణ్య శిక్షణను కొనసాగించనున్నట్లు ఆయన చెప్పారు. 2030 నాటికి భారత ఏఐ రంగంలో తమ కంపెనీ 1,750 కోట్ల డాలర్ల (రూ.1.58 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రధాని మోదీతో మంగళవారం సమావేశమైన అనంతరం నాదెళ్ల ప్రకటించారు. ఆసియాలో కంపెనీకిదే అతిపెద్ద పెట్టుబడి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,200 ▼	1,19,350 ▼	2,09,000 ▲
విజయవాడ	1,33,000 ▲	1,24,000 ▲	1,94,300 ▲
విశాఖపట్నం	1,32,840 ▲	1,19,250 ▼	2,09,000 ▲
రాజమండ్రి	1,30,200 ▲	1,19,350 ▲	1,92,000 ▲
ప్రొద్దుటూరు	1,28,400 ▲	1,18,130 ▲	1,87,000 ▲
ముంబై	1,28,596 ▲	1,17,794 ▲	1,88,281 ▲

ఈక్విటీల్లోకి పెన్షన్ ఫండ్స్

పీఎఫ్ఆర్‌డీఏ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: పెన్షన్ ఫండ్స్ (పీఎఫ్) పెట్టుబడుల విస్తరణకు మార్గం సుగమమైంది. ఈ పెన్షన్ ఫండ్స్.. ఈక్విటీ షేర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఆమోదం తెలిపింది. అయితే ఈ పెట్టుబడులు తమ మొత్తం నిధుల్లో 25 శాతం మించకూడదని స్పష్టం చేసింది. అది కూడా నిఫ్టీ 250 జాబితాలోని కంపెనీల షేర్లలో మాత్రమే పెట్టుబడులు పెట్టాలని కోరింది. ఈక్విటీ షేర్లతో పాటు గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లు సెబీ నియంత్రణలోని ఇన్విట్స్, రీట్స్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (క్యాటగిరి-1, క్యాటగిరి-2)లో మదుపు చేసేందుకు పీఎఫ్ఆర్‌డీఏ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పెన్షన్ ఫండ్స్‌లో మదుపు చేసే ఇన్వెస్టర్లకు మరింత మెరుగైన రాబడులు అందించేందుకు ఈ చర్య దోహదపడుతుందని భావిస్తున్నారు.

నామినేషన్ ప్రక్రియ వాయిదా

మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు, డీమ్యాట్ ఖాతాలకు నామినీల ప్రక్రియ మూడో దశను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వాయిదా వేసింది. నిజానికి ఈ నెల 15 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాలి. అయితే తమ సిస్టమ్స్ అప్‌డేట్ చేసేందుకు మరింత సమయం కావాలని మ్యూచువల్ ఫండ్స్, డిపాజిటరీలు, డీమ్యాట్ కంపెనీలు చెప్పడంతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎప్పటి నుంచి ఈ ప్రక్రియ మళ్లీ చేపట్టాలో త్వరలోనే తెలియజేస్తామని తెలిపింది.

పడిపోయే..!



సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి భారత కరెన్సీ మారకం విలువ

రూ.90.32 స్థాయి వద్ద ముగిసిన డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు

ఒక్కరోజే 38 పైసల పతనం

ముంబై: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి జారుకుంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం ఒక దశలో 54 పైసలు క్షీణించి రూ.90.48 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. మళ్లీ కాస్త కోలుకున్నప్పటికీ, చివర్లో 38 పైసల నష్టంతో రూ.90.32 వద్ద స్థిరపడింది. ఇది సరికొత్త కనిష్ఠ ముగింపు కూడా.

కారణాలివీ..: అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంలో జాప్యం ఇందుకు ప్రధాన కారణం. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారుకు వచ్చే మార్చి వరకు సమయం పట్టవచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ బ్లూంబర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆయన వ్యాఖ్యలు మన కరెన్సీపై ఒత్తిడిని మరింత పెంచాయి. మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు నిరవధికంగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, భారత్‌పై మెక్సికో సుంకాల విధింపు కూడా రూపాయిని కిందికి జార్చాయి. ఫెడ్ రేట్లు తగ్గిన నేపథ్యంలో డాలర్ కాస్త బలహీనపడటం, ముడి చమురు ధరల తగ్గుదలతో పాటు మన ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో పయనించడం కరెన్సీకి కొంత మద్దతుగా నిలిచాయి.

రూపాయిపై ముమ్ముందూ ఒత్తిడి

దేశీయ కరెన్సీపై ఒత్తిడి ముమ్మందు కొనసాగనుందని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు ముమ్మందు రూ.90.10-90.75 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు కాని పక్షంలో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.92కు చేరుకోవచ్చని ఫారెక్స్ విశ్లేషకులు అంటున్నారు.

3 రోజుల తర్వాత లాభాల్లోకి..

ముంబై: వరుసగా మూడు రోజుల పాటు నష్టాల్లో కొనసాగిన దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. సెన్సెక్స్ 426.86 పాయింట్ల వృద్ధితో 84,818.13 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 140.55 పాయింట్లు బలపడి 25,898.55 వద్ద ముగిసింది. అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించడంతోపాటు వాహనం, లోహ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 రాణించాయి.

సరికొత్త రికార్డు గరిష్ఠానికి వెండి

రూ.1.94 లక్షలు దాటిన కిలో ధర

న్యూఢిల్లీ: వెండి ధరలు వేగంగా ఎగబాకుతున్నాయి. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర గురువారం రూ.2,400 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,94,400కు చేరుకుంది. అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ మరింత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి వరుసగా మూడో రోజూ పెరిగి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 63 డాలర్లకు చేరింది. సరఫరా కొరతతో పాటు రూపాయి క్షీణత దేశీయంగా వీటి ధరలను మరింత ఎగదోశాయి. కాగా, పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90 పెరిగి రూ.1,32,490గా నమోదైంది.

హైదరాబాద్‌లో నాక్సియాన్ ఎనర్జీ ప్లాంట్

రూ.200 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సోడియం-అయాన్ బ్యాటరీల తయారీలో ఉన్న హైదరాబాద్ సంస్థ నాక్సియాన్ ఎనర్జీ ఇండియా తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ సమీపంలో రూ.200 కోట్ల పెట్టుబడితో కొత్త ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ సీఈఓ అభిషేక్ రెడ్డి వెల్లడించారు. గురువారం నాడిక్కడ మార్కెట్లోకి సోడియం-అయాన్ ఆధారిత ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త ప్లాంటు వచ్చే ఏడాది చివరికల్లా అదుబాటులోకి రానుందన్నారు. ఈ ప్లాంట్ ద్వారా కొత్తగా 100 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆయన తెలిపారు. కంపెనీ ఇప్పటికే తమిళనాడులోని కోయంబత్తూరు వద్ద సోడియం అయాన్ బ్యాటరీల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం వాణిజ్య, గృహావసరాలకు తగ్గట్టుగా 3.5 కేడబ్ల్యూ, 5 కేడబ్ల్యూ, 10 కేడబ్ల్యూ సామర్థ్యాల్లో ఎనర్జీ స్టోరేజీ యూనిట్లను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. డీజిల్ జెనరేటర్లు, సంప్రదాయ లెడ్ యాసిడ్ బ్యాటరీలకు తమ సోడియం ఆయాన్ బ్యాటరీలు చక్కటి ప్రత్యామ్నాయమని అభిషేక్ తెలిపారు. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ స్టోరేజీ బ్యాటరీలు లెడ్ యాసిడ్ బ్యాటరీలతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్ల ఎక్కువ కాలం మన్నుతాయన్నారు.

జనవరి 21-25 తేదీల్లో ఐఎంటీ ఎక్స్‌పో

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇండియన్ మెషిన్ టూల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ).. జనవరి 21-25 తేదీల్లో బెంగళూరులో ఐఎంటీఎక్స్ ఫార్మింగ్ 2026 సదస్సును నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఆసియాలోనే అతిపెద్ద మెటల్ ఫార్మింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ సదస్సు ఇదని గురువారం నాడిక్కడ ఐఎంటీఎంఏ ప్రెసిడెంట్ మోహిని కేల్కర్ తెలిపారు. ఈ సదస్సులో 22 దేశాలకు చెందిన 600 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారని ఆమె చెప్పారు. మేకిన్ ఇండియా, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ)తో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు ఈ రంగ అభివృద్ధికి ఊతంగా నిలవనున్నాయని కేల్కర్ పేర్కొన్నారు.

2024-25లో మెటల్ కటింగ్, ఫార్మింగ్ రంగంలో ఉత్పత్తి విలువ రూ.14,510 కోట్లుగా ఉండగా వినియోగం రూ.30,741 కోట్లుగా ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇవి వరుసగా 10 శాతం, 18 శాతం వృద్ధితో రూ.14,655 కోట్లు, రూ.35,705 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు లోకేశ్ మెషిన్స్ ఎండీ, ఐఎంటీఎంఏ మాజీ ప్రెసిడెంట్ ఎం లోకేశ్వర్ రావు తెలిపారు.

ఐస్ప్రౌట్ రూ.60 కోట్ల నిధుల సమీకరణ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కో-వర్కింగ్ ఆఫీస్ సొల్యూషన్స్ సంస్థ ఐస్ప్రౌట్.. టాటా క్యాపిటల్ నుంచి రూ.60 కోట్ల నిధులు సమీకరించింది. టియర్-1,2 నగరాల్లో వ్యాపార కార్యకలాపాల విస్తరణకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఐస్ప్రౌట్.. దేశవ్యాప్తంగా 25 కోవర్కింగ్ సెంటర్లను నిర్వహిస్తోంది.

సైయెంట్ చేతికి అబుదాబీ కంపెనీ

గ్లోబల్ ఇంటలిజెంట్ ఇంజనీరింగ్ సేవల కంపెనీ సైయెంట్.. అబుదాబీ కేంద్రంగా పనిచేసే అబుదాబీ అండ్ గల్ఫ్ కంప్యూటర్స్ (ఏడీజీసీఈ) సంస్థను కొనుగోలు చేసింది. ఏడీజీసీఈ సంస్థ పశ్చిమాసియాలోని కంపెనీలకు టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సేవలు అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	675
వరంగల్	653	గోదావరి	655
చిత్తూరు	663	విశాఖపట్నం	645
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	117
కర్నూలు	119	నెల్లూరు	122
విశాఖపట్నం	121	అనంతపురం	122
గోదావరి	120		

వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం



రేపు హైదరాబాద్‌కు

లియోనెల్ మెస్సీ విశ్వవిఖ్యాత ఫుట్‌బాలరే కాదు.. అత్యంత ధనవంతుడైన అథ్లెట్లలో ఒకడు..! తన ఆట వెనుక వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని కూడా నిర్మించుకొన్నాడు. మెస్సీ నికర ఆస్తుల విలువ రూ. 7,665 కోట్లుగా లెక్కిస్తుంటే.. అందులో సింహభాగం అతడు నడుపుతున్న వ్యాపార సంస్థల నుంచి వస్తున్నదే..! లగ్జరీ హోటళ్లు, దుస్తుల బ్రాండ్‌లు, మీడియా కంపెనీలు, రియల్ ఎస్టేట్‌లో లియోనెల్ భారీగా పెట్టుబడులు పెట్టాడు. వీటితోపాటు ఇంటర్ మయామి తరపున ఆడేందుకు భారీ కాంట్రాక్ట్ కుదుర్చుకొన్నాడు. అంతేకాకుండా పలు కంపెనీల బ్రాండ్‌లకు ప్రచారకర్తగా కూడా ఆర్జిస్తున్నాడు.



ఎంఐఎం హోటళ్లు..: ఇబిజా, మలోర్కా, సిట్గేజ్, బకీరా, అండోరాల్లో ఎంఐఎం హోటళ్ల చైన్‌ను మెస్సీ కలిగి ఉన్నాడు. మెజెస్టిక్ హోటల్ గ్రూప్ వీటిని నిర్వహణను చూసుకొంటోంది. అందమైన బీచ్‌లు, కొండ ప్రాంతాల్లోనే ఈ హోటళ్లు ఎక్కువగా ఉంటాయి.

ద మెస్సీ స్టోర్..: 2019లో బార్సిలోనాలో స్పోర్ట్స్ వేర్, లైఫ్‌స్టైల్ దుస్తుల స్టోర్‌ను మెస్సీ ఆరంభించాడు. ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారు.

మాస్ ప్లస్..: 2024, జూన్‌లో 'మాస్+' పేరుతో మెస్సీ తన సొంత ఎనర్జీ డ్రింక్ బ్రాండ్‌ను విడుదల చేశాడు. అమెరికా మార్కెట్‌లో ఈ డ్రింక్ విక్రయాలు జోరుగానే ఉన్నాయి.

రోజారియో మీడియా కంపెనీ..: 2022లో ఈ మీడియా కంపెనీని మెస్సీ ఏర్పాటు చేశాడు. ఫ్యామిలీ, స్పోర్ట్స్ షోలతోపాటు ఓటీటీ కంటెంట్‌ను కూడా ఈ కంపెనీ నిర్మిస్తోంది. అర్జెంటీనా నిర్మాతలు, హాలీవుడ్ స్టూడియోలతో కలసి ఈ కంపెనీ పనిచేస్తోంది. అంతేకాకుండా 'ఎల్ క్లబ్ డి లా మిలనెసా' హోటల్ గ్రూప్‌లో కూడా మెస్సీ పెట్టుబడులు పెట్టాడు. 2022లో 'ప్లే టైమ్ స్పోర్ట్స్' పేరుతో టెక్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థను కూడా ప్రారంభించాడు.

మెస్సీ టూర్ షెడ్యూల్

డిసెంబరు 13 కోల్‌కతా: ఉ. 9.30 నుంచి 10.30 వరకు-మీట్ అండ్ గ్రీట్ ● ఉ. 10.30 నుంచి 11.15 వరకు-వర్చువల్‌గా మెస్సీ విగ్రహావిష్కరణ ● మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు-ఫ్రెండ్లీ మ్యాచ్, సన్మాన కార్యక్రమం, అతిథులతో పరిచయం

హైదరాబాద్‌లో: సా. 4.30 నుంచి-ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మీట్ అండ్ గ్రీట్ ● రాత్రి 7 గంటలకు-ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ● సంగీత విభావరి



డిసెంబరు 14 ముంబై: మ. 3.30 నుంచి- సీసీఐలో జరిగే పడేల్ కప్‌లో పాల్గొనడం ● 4 గంటల నుంచి-సెలెబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్ ● 5 గం. నుంచి-వాంఖడే స్టేడియంలో పలు కార్యక్రమాలతోపాటు ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్

డిసెంబరు 15- న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాదపూర్వక భేటీ ● మధ్యాహ్నం 1.30 నుంచి-అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే పలు కార్యక్రమాలతోపాటు మెనిర్వా అకాడమీ ఆటగాళ్లకు సన్మానం

టీ20 ప్రపంచకప్ టిక్కెట్ రూ.100కే..

అమ్మకాలు షురూ



టిక్కెట్ల విక్రయాలను ప్రారంభిస్తున్న సూర్యకుమార్, రవిశాస్త్రి

దుబాయ్: భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న టీ20 వరల్డ్‌కప్ ఫేజ్-1 టిక్కెట్ల అమ్మకాలు గురువారం సాయంత్రం ఆరంభమయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ మెగా ఈవెంట్ జరుగనుంది. అయితే ఈసారి మరింతగా ప్రేక్షకులకు చేరువయ్యేందుకు ఎంపిక చేసిన జట్ల మ్యాచ్‌లకు కనీస ధరను కేవలం రూ.100గా నిర్ణయించామని ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా తెలిపారు. ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 20 జట్లు నాలుగు గ్రూపుల్లో పోటీపడబోతున్నాయి. భారత్-యూఎస్ఏ మధ్య ఆరంభ మ్యాచ్ జరుగనుంది. వరల్డ్‌కప్ టిక్కెట్లు బుక్‌మైషోలో అందుబాటులో ఉన్నాయి.

ఆధిక్యంలో న్యూజిలాండ్

విండీస్‌తో రెండో టెస్టు

వెల్లింగ్టన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్‌కు 73 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. గురువారం రెండో రోజు ఆటలో కివీస్ తొలి ఇన్నింగ్స్‌ను 278/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఫీల్డింగ్‌లో గాయపడిన టిక్నర్ బ్యాటింగ్‌కు దిగలేదు. ఓపెనర్ కాన్వే (60), మిచెల్ హేయ్ (61) అర్ధసెంచరీలు సాధించారు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి విండీస్ 32/2 స్కోరుతో ఉంది. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేసింది.

డికాక్ దంచేశాడు..

46 బంతుల్లో 90 రన్స్ | దక్షిణాఫ్రికా ఘనవిజయం | తిలక్ పోరాటం వృథా | రెండో టీ20


డికాక్ (90)

ముల్లన్‌పూర్: భారత్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఘనంగా పుంజుకుంది. తొలి మ్యాచ్‌లో 74 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు గురువారం జరిగిన రెండో టీ20లో తడాఖా చూపింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (46 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 90) తన పేలవ ఫామ్‌కు చెక్ పెడుతూ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో 51 పరుగుల తేడాతో నెగ్గిన సౌతాఫ్రికా సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ఆదివారం మూడో టీ20 జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఫెరీరా (16 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 30 నాటౌట్), మిల్లర్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 20 నాటౌట్) ఆఖర్లో మెరుపు వేగంతో ఆడారు. మార్క్రమ్ (29) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్ వరుణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 19.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ (34 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 62) ఒక్కడే రాణించాడు. బార్ట్‌మన్‌కు నాలుగు.. యాన్సెన్, ఎన్‌గిడి, సిపమ్లాలకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్వింటన్ డికాక్ నిలిచాడు.


తిలక్ వర్మ (62)

తిలక్ పోరాడినా..: మంచు ప్రభావం అధికంగా ఉండడంతో భారత బ్యాటర్లు కూడా చెలరేగుతారని ఆశించినా.. సఫారీ బౌలర్లు వారికి ముకుతాడు వేశారు. తొలి ఓవర్ నుంచే వికెట్ల పతనం సాగడంతో ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేకపోయింది. తిలక్ వర్మ ఒక్కడే పోరాటం సాగించాడు. గిల్ (0), అభిషేక్ (17), సూర్యకుమార్ (5) పవర్ ప్లేలోనే వెనుదిరగడం దెబ్బతీసింది. వన్‌డౌన్‌లో అక్షర్ (21) బరిలోకి దిగినా ఫలితం లేకపోయింది. హార్దిక్ (20)తో కలిసి ఐదో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. అయితే గెలిచే అవకాశం లేకపోయినా.. నాలుగు పరుగుల వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు నేలకూలడం గమనార్హం.

ఆది నుంచే దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఆరంభం నుంచే రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. డికాక్ ఆరంభంలో అర్ష్‌దీప్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో అదరగొట్టాడు. వరుణ్ వెంటనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (8)ను బౌల్డ్ చేశాడు. 26 బంతుల్లోనే డికాక్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కెప్టెన్ మార్క్రమ్ వరుణ్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదినా అతడికే చిక్కడంతో రెండో వికెట్‌కు 47 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. హార్దిక్ ఓవర్‌లో 4,6తో 90కి చేరిన డికాక్ సెంచరీ ఖాయమనిపించినా.. వరుణ్ ఓవర్‌లో రనౌటయ్యాడు. ఆ వెంటనే బ్రెవిస్ (14)ను అక్షర్ అవుట్ చేసినప్పటికీ.. మిల్లర్, ఫెరీరా జోడీ ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. ఆఖరి ఓవర్‌లో ఫెరీరా రెండు సిక్సర్లతో 18 రన్స్ అందించి స్కోరును 200+ దాటించాడు. ఐదో వికెట్‌కు ఈ జోడీ 23 బంతుల్లోనే అజేయంగా 53 పరుగులు చేసింది.

1 అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఓవర్‌లో ఎక్కువ బంతులు (13) వేసిన బౌలర్‌గా నవీనుల్ హక్ (అఫ్ఘాన్)తో సమంగా నిలిచిన అర్ష్‌దీప్.

2 ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏకంగా 16 వైడ్లు వేశారు. గతంలో విండీస్‌పై ఇన్నే వేయగా.. శ్రీలంకపై అత్యధికంగా 17 వైడ్లు వేశారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: డికాక్ (రనౌట్) 90, హెన్‌డ్రిక్స్ (బి) వరుణ్ 8, మార్క్రమ్ (సి) అక్షర్ (బి) వరుణ్ 29, బ్రెవిస్ (సి) తిలక్ (బి) అక్షర్ 14, ఫెరీరా (నాటౌట్) 30, మిల్లర్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 20 ఓవర్లలో 213/4. వికెట్ల పతనం:** 1-38, 2-121, 3-156, 4-160; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-54-0, బుమ్రా 4-0-45-0, వరుణ్ 4-0-29-2, అక్షర్ 3-0-27-1, హార్దిక్ 3-0-34-0, దూబే 2-0-18-0.

భారత్: అభిషేక్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 17, గిల్ (సి) హెన్‌డ్రిక్స్ (బి) ఎన్‌గిడి 0, అక్షర్ (సి) హెన్‌డ్రిక్స్ (బి) బార్ట్‌మన్ 21, సూర్యకుమార్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 5, తిలక్ (సి) మార్క్రమ్ (బి) ఎన్‌గిడి 62, హార్దిక్ (సి) బ్రెవిస్ (బి) సిపమ్లా 20, జితేశ్ (సి) బార్ట్‌మన్ (బి) సిపమ్లా 27, దూబే (బి) బార్ట్‌మన్ 1, అర్ష్‌దీప్ (సి) మిల్లర్ (బి) బార్ట్‌మన్ 4, వరుణ్ (సి) మార్క్రమ్ (బి) బార్ట్‌మన్ 0, బుమ్రా (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.1 ఓవర్లలో 162 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-32, 4-67, 5-118, 6-157, 7-158, 8-162, 9-162, 10-162; **బౌలింగ్:** ఎన్‌గిడి 3.1-0-26-2, యాన్సెన్ 4-0-25-2, సిపమ్లా 4-0-46-2, ఫెరీరా 1-0-14-0, బార్ట్‌మన్ 4-0-24-4, లిండే 3-0-23-0.

ఒక్క ఓవర్.. 7 వైడ్లు

పేసర్ అర్ష్‌దీప్ పేలవ బౌలింగ్‌తో నిరాశపర్చాడు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో ఏకంగా ఏడు వైడ్లు విసిరాడు. తొలి బంతిని డికాక్ సిక్సర్‌గా మలచగా, ఇక వరుసగా ఏడు బంతుల్లో ఆరు వైడ్లు వేయడంతో కోచ్ గంభీర్ షాక్ అయ్యాడు. ఆ తర్వాత కూడా మరో బంతిని వైడ్‌గా వేయడంతో మొత్తం 13 బంతుల్లో ఈ ఓవర్‌ను ముగించి 18 రన్స్ సమర్పించుకున్నాడు.

యువీ, హర్మన్ పేరిట స్టాండ్స్

మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌లకు అరుదైన గౌరవం దక్కింది. గురువారం రెండో టీ20కి ముందు మహరాజా యదువీంద్ర సింగ్ స్టేడియంలోని స్టాండ్స్‌కు వీరిద్దరి పేర్లను పెట్టారు.

వైభవ్, ఆయుష్‌పైనే దృష్టి!



● యూఏఈతో భారత్ ఢీ నేడు
● అండర్-19 ఆసియాకప్
● ఉ. 10.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

దుబాయ్: వచ్చే ఏడాది జరిగే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని అండర్-19 ఆసియా కప్‌లో జట్టులోని లోపాలను సరిద్దుకోవాలని యువ భారత జట్టు భావిస్తోంది. వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియాకప్‌లో కొత్తతరం ఆటగాళ్లు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు పాకిస్థాన్, యూఏఈ, మలేసియా జట్లున్నాయి. గ్రూప్-బిలో అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక టీమ్‌లు ఆడనున్నాయి. శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో యూఏఈతో ఆడనున్న భారత్.. ఆదివారం పాక్‌తో, మంగళవారం మలేసియాతో తలపడనుంది. అయితే, ఇటీవలి టోర్నీలో పాక్ ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ టోర్నీలో కూడా అలాగే వ్యవహరిస్తారా? అనేది మరోసారి చర్చనీయాంశంగా మారింది.

బరిలో సింధు, లక్ష్యసేన్

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తలపడే భారత జట్లను గురువారం ప్రకటించారు. పీవీ సింధు, లక్ష్యసేన్ మహిళలు, పురుషుల సింగిల్స్‌లో, మేటి ద్వయం సాత్విక్/చిరాగ్ డబుల్స్‌లో కీలక భూమిక పోషించనున్నారు. వచ్చే ఫిబ్రవరి 3 నుంచి 8 వరకు చైనాలోని క్వింగ్‌డావోలో చాంపియన్‌షిప్ జరగనుంది. మహిళల విభాగంలో భారత జట్టు డిఫెండింగ్ చాంపియన్ కావడం విశేషం.

మహిళల జట్టు: సింధు, ఉన్నతి హుడా, తన్వీశర్మ, రక్షిత, మాళవిక, ట్రీసా, గాయత్రీ గోపీచంద్, ప్రియా కొంజెంగ్‌బామ్, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టో; **పురుషుల జట్టు:** లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, తరుణ్, సాత్విక్, చిరాగ్, పృథ్వీ కృష్ణమూర్తి రాయ్, సాయిప్రతీక్, హరిహరన్.

'హజారే'లో కోహ్లీ

ఢిల్లీ ప్రాబబుల్స్‌లో చోటు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విరాట్ కోహ్లీ 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగనున్నాడు. ఈమేరకు గురువారం ప్రకటించిన ఢిల్లీ ప్రాబబుల్స్‌లో విరాట్‌తోపాటు కీపర్ రిషభ్ పంత్‌నూ ఎంపిక చేశారు. 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడాలని భావిస్తున్న కోహ్లీ..విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొనడం ద్వారా 50 ఓవర్ల ఫార్మాట్‌లో ప్రస్తుత తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాలని భావిస్తున్నాడు. 37 ఏళ్ల విరాట్ 2010లో చివరిసారి విజయ్ హజారేలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. ఢిల్లీ తమ తొలి మ్యాచ్‌ని ఆంధ్రతో ఆడనుంది.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 12-12-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ




సుబ్రమణ్యం

11

అప్పట్లో ఛైర్మన్‌దే హవా..

అందుకే ఆయనకు చెప్పా

మూడో రోజు సిట్ విచారణలో మాజీ జీఎం సుబ్రమణ్యం

నేటితో ముగియనున్న కల్తీ నెయ్యి కేసు నిందితుల కస్టడీ

తూర్పు తీరం.. ఐటీ సంబరం


కాపులుప్పాడలో కాగ్నిజెంట్‌కు కేటాయించిన స్థలం

800 మంది ఉద్యోగులతో తాత్కాలిక డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

కాపులుప్పాడలో శాశ్వత క్యాంపస్‌కు భూమిపూజ

2029 నాటికి పూర్తి కమర్షియల్ ఆపరేషన్లు

దశల వారీగా 8 వేల మందికి ఉద్యోగాలు

మరో 7 కంపెనీలకూ శంకుస్థాపనలు

సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ రాక

నేడు విశాఖలో కాగ్నిజెంట్ 'తొలి అడుగు'

విశాఖపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పు తీరంలోని విశాఖ నగరంలో ఐటీ సంబరం నెలకొంది. పెద్ద కంపెనీలు ఒక్కొక్కటిగా వైజాగ్‌వైపు అడుగులు వేస్తున్నాయి. దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ విశాఖపట్నంలో కార్యకలాపాలకు శుక్రవారం శ్రీకారం చుడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ హబ్‌గా ఎదుగుతున్న విశాఖపట్నంలో రుషికొండ ఐటీ పార్కు హిల్-2పై మూడు అంతస్థుల మహతి భవనాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభిస్తోంది. 800 మంది పనిచేసే ఈ కార్యాలయాన్ని

మిగతా 10వ పేజీలో...


cognizant

ఆధునిక పరిశోధనల హబ్‌గా

మన క్వాంటమ్ వ్యాలీ

విద్య, వైద్యం, ఔషధాల తయారీకి ఏక్యూసీసీ పనిచేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష



వివిధ దేశాల క్వాంటమ్ పరిశోధకులు, పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ

ఔషధాలు, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలకు

గ్లోబల్ క్వాంటమ్ బయో ఫాండ్రీ ఏర్పాటుకు సిద్ధం

అమరావతిలో దేశంలోనే తొలి బయోమెడికల్ ఎకో సిస్టం

సీఎం చంద్రబాబుకు తెలిపిన శాస్త్రవేత్తల బృందం

10

వెనక్కి కాదు.. ముందుకే!

వచ్చే సమావేశాల్లోనే 'అమరావతి బిల్లు'!

ఇప్పటికే కేంద్ర న్యాయ శాఖ ఆమోదం

ప్రస్తుతం హోం శాఖ పరిశీలనలో.. ప్రభుత్వ వర్గాల వెల్లడి

అమరావతిని జగన్ అడ్డుకోలేరు: పెమ్మసాని

అమరావతి/న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని 'అమరావతి'కి చట్టబద్ధమైన, కట్టుదిట్టమైన రక్షణ కల్పించే ప్రక్రియ తుది దశకు చేరుకుందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్రం అమరావతి బిల్లును వెనక్కి పంపిందని, ఒకరకంగా ఇది చంద్రబాబుకు 'షాక్' అని జగన్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. అమరావతికి కేంద్రమే రక్షణ కల్పించే బిల్లు ఇప్పటికే కేంద్ర న్యాయశాఖ ఆమోదం

మిగతా 11వ పేజీలో...

ఏపీలో కూటమి భేష్

చంద్రబాబుతో పూర్తి సమన్వయం

ఆయనతో కలిసి పనిచేయడం మంచి పరిణామం

రాష్ట్రానికి పెట్టుబడులు అధికంగా వస్తున్నాయి

రాష్ట్ర బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పనితీరు బాగుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పనిచేయడం మంచి పరిణామమని అన్నారు. తాము పూర్తి సమన్వయంతో వెళ్తున్నామని చెప్పారు. గురువారం ఏపీ, తెలంగాణ, అండమాన్‌కు చెందిన బీజేపీ ఎంపీలకు



మిగతా 11వ పేజీలో...



థాంక్యూ డిప్యూటీ సీఎం

గ్రామాలకు రోడ్లు మంజూరు చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు చెబుతున్న మంత్రులు కందుల, డోలా, అనిత, అనగాని, కేశవ్, నిమ్మల, సవిత, నారాయణ, నాదెండ్ల

₹20 వేల కోట్లు

పెట్టుబడి ప్రతిపాదనలకు క్యాబినెట్ ఓకే

లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి

క్వాంటమ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మరో రూ.1,421 కోట్ల పెట్టుబడి

బీసీలకు రూఫ్‌టాప్ సోలార్‌కు 20 వేల అదనపు సబ్సిడీ

163 కోట్లతో లోక్‌భవన్ నిర్మాణం

ఎల్-1కు అప్పగింతకు అంగీకారం

డీఏ ఉత్తర్వులకు ఆమోదముద్ర

క్రికెటర్ శ్రీచరణికి 2.5 కోట్ల నగదు


వెయ్యి గజాల స్థలం, గ్రూప్1 ఉద్యోగం

4 పర్యాటక హోటళ్లకు పచ్చజెండా

మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంకో రూ.20,267 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వీటిలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులతో 14 ప్రాజెక్టుల స్థాపనకు ఆమోదముద్ర వేసింది. వీటి ద్వారా లక్షకుపైగా ఉద్యోగాలు లభించే అవకాశముంది. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మరో రూ.1,421 కోట్ల పెట్టుబడులకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం అమరావతి సచివాలయంలో క్యాబినెట్ సమావేశమైంది. మొత్తం 44 అంశాలకు ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర సమాచార-పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి

మిగతా 10వ పేజీలో...



ప్రతి అంశాన్నీ నేనే పర్యవేక్షించాలా? మంత్రులు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. అప్పటికీ కాకుంటే నా దృష్టికి తీసుకురావాలి.

-చంద్రబాబు

అన్నీ నేనే చూడాలా?

మంత్రులూ చొరవ తీసుకోవాలి: ముఖ్యమంత్రి

పరిశ్రమలకు భూకేటాయింపులు, రెవెన్యూ సమస్యలపై స్పందించండి

రుషికొండపై నిర్ణయం ఇంత ఆలస్యమా?.. సబ్ కమిటీపై అసహనం

సూర్యఘర్‌తో సంబంధం లేకుండా చేనేతలకు విద్యుత్ రాయితీలు

ఇళ్ల నిర్మాణాలు చేపట్టని జగనన్న కాలనీలపై సమగ్రంగా అధ్యయనం

ఇళ్లు కట్టుకోవడానికి ఇష్టపడని వారి స్థలాలు ఇతరులకివ్వొచ్చా?: సీఎం

3 శాఖలు కలిసి టూరిజం ప్రాజెక్టులు చేపట్టాలి: డిప్యూటీ సీఎం సూచన



6

లేడీ డాన్ అరుణపై పీడీ యాక్ట్

నెల్లూరు నుంచి కడప సెంట్రల్ జైలుకు

గత ప్రభుత్వంలో అనేక నేరాలు

రౌడీషీటర్ శ్రీకాంత్ 'పెరోల్'పై రచ్చ

'ఆంధ్రజ్యోతి' కథనాలతో వెలుగులోకి

బాధితుల నుంచి వరుసగా ఫిర్యాదులు

వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు

ఇదివరకే రౌడీషీట్ ఓపెన్


మాచర్ల కోర్టు వద్ద పిన్నెల్లి సోదరులు

6

పిన్నెల్లి సోదరులకు రిమాండ్

జంట హత్యల కేసులో

మాచర్ల కోర్టులో లొంగుబాటు

నెల్లూరు జైలుకు తరలించిన పోలీసులు

వైసీపీ హయాంలో మాచర్లలో అరాచకం

11 కేసుల్లో బెయిల్ తెచ్చుకోగలిగిన బ్రదర్స్

జంట హత్యల కేసులో మాత్రం చిక్కారు

సుప్రీంకోర్టు ఆదేశాలతో కోర్టుకు సరెండర్

పెండింగ్ పెద్దన్న

ఫైళ్ల పరిష్కారంలో రెవెన్యూ నత్తనడక



అత్యవసర ప్రభుత్వ శాఖల్లో ఇదీ ఒకటి

కానీ, కింది నుంచి పై దాకా పెండింగే

ఈ-ఆఫీస్‌లో 3,154 ఫైళ్ల పార్కింగ్

ఒక్కోఫైల్ చూడటానికే 21 రోజులు

వచ్చి కలిస్తేనే వాటిని పరిశీలిస్తారా?

ఇక రెవెన్యూలో ప్రక్షాళన ఎలా సాధ్యం?

అత్యవసర శాఖల్లోనూ భారీగా పెండింగ్


రెవెన్యూశాఖ... రాష్ట్రంలో సాగు భూములు, స్థిర, చరాస్తులు ఉన్న ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న అత్యవసర శాఖ ఇది. కానీ రెవెన్యూ పనులు ఏవీ వేగంగా ముందుకు సాగడం లేదు. అన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారం విషయంలో ప్రభుత్వానికి ఒక నివేదిక అందగా, రెవెన్యూశాఖలో కింది నుంచి పై వరకు నత్తకు నడకలు నేర్పుతున్నారంటూ అందులో తేల్చారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పెండింగ్‌లో రెవెన్యూ శాఖ ఏకంగా పెద్దన్నలా తయారైంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలో రెవెన్యూ పరిష్కరించిన ఫైళ్లు, పెండింగ్‌లో ఉంచిన వాటి వివరాలు, ఇంకా సగటున ఒక్కో ఫైలు చూసేందుకు తీసుకుంటున్న సమయం చూస్తే విస్తుపోవాల్సిందే. జిల్లా కలెక్టర్, భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ), సర్వే డైరెక్టరేట్, ఇంకా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ విభాగాధిపతుల నుంచి వచ్చే ఫైల్స్‌ను చూడటానికి సెక్షన్ అధికారి నుంచి అదనపు కార్యదర్శి వరకు సగటున 21 రోజుల 20:56 గంటల సమయం తీసుకుంటున్నారు. సచివాలయంలో పనిచేసే అధికారులు తమ లాగిన్‌కు వచ్చే ఈ-ఆఫీస్ ఫైల్‌ను తెరచి

మిగతా 11వ పేజీలో...

ఫైలు కదలాలంటే పైసలివ్వాల్సిందే!



6

వామ్మో.. రవాణా మంత్రి పేషీ

సీఎం చెప్పినా ముడుపులు ఇవ్వాల్సిందే

ప్రతి పనికీ ఎంతో కొంత చెల్లించాలి

రవాణా శాఖలో లక్షల్లో.. ఆర్టీసీలో వేలల్లో

శాఖను పట్టించుకోని మంత్రి రాంప్రసాద్

ఏడాదిన్నరలో ఒక్కసారే రవాణాపై సమీక్ష

ఆర్టీసీ వైపు కన్నెత్తి కూడా చూడని వైనం

ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రికి చివరి ర్యాంకు

పేషీలో ఇద్దరు అధికారుల చక్రం.. వాటాలు

ఈ-ఫైలు ఒకరు చూస్తే.. ఓటీపీ మరొకరికి

కమిషనరేట్, 'ఆర్టీసీ'లో బహిరంగ వ్యాఖ్యలు



ట్రంప్‌తో ప్రధాని మోదీ

ఫోన్ సంభాషణ

ద్వైపాక్షిక బంధం పురోగతిపై సమీక్ష

భారత్-అమెరికా 'కాంపాక్ట్' అమలుపై చర్చ

స్నేహపూర్వకంగా సంభాషణ జరిగిందని ప్రధాని వెల్లడి

9

అమెరికా రాజకీయాల్లో

మోదీ-పుతిన్ సెల్ఫీ కలకలం

చేజేతులా భారత్‌ను రష్యాకు దగ్గర చేస్తున్నారు

ఇలా అయితే మీకు నోబెల్ రాదు..

ట్రంప్‌పై ఓ చట్టసభ్యురాలి వ్యాఖ్య



6

ఫైబర్‌నెట్ కేసులో.. గౌతంరెడ్డికి చుక్కెదురు

ఆయన పిటిషన్‌కు విచారణార్హత లేదు

బెజవాడ ఏసీబీ కోర్టు తీర్పు

వ్యాజ్యాన్ని కొట్టివేసిన న్యాయాధికారి



11

ఇక 'పరకామణి'పై సమగ్ర దర్యాప్తు!

హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగనున్న సీఐడీ

కేసు రాజీ వెనుక సూత్రధారులెవరో తేలే అవకాశం

రవికుమార్ ఆస్తుల లావాదేవీలు ఇక బహిర్గతం

ఆస్తులు రాయించుకున్నవారూ వెలుగులోకి

రష్యా నుంచి చమురు దిగుమతులు

పైపైకి!

అమెరికా ఆంక్షలను లెక్కచేయని భారత్

ఈ నెలలో రోజుకు సగటున 18.5 లక్షల బ్యారెళ్లు

జూన్ తర్వాత ఇదే అత్యధికం.. వెల్లడించిన కెప్లర్ నివేదిక

9



ప్రయాణికులకు రూ.10 వేల వోచర్లు

విమానాల రద్దుతో ఇబ్బందిపడ్డ వారికి ఇస్తామన్న ఇండిగో

ఏడాదిలోగా ఎప్పుడైనా వాడుకోవచ్చని స్పష్టీకరణ

డీజీసీఏ ఎదుట హాజరైన సంస్థ సీఈవో, ఉన్నతాధికారులు

9

మళ్లీ నేడు రావాలని సూచించిన డీజీసీఏ అధికారులు

ఇండిగో ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షణ కమిటీ పరిశీలన

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పురోగమిస్తున్న పేదరికం!

ఈ భూగోళంమీద ఉన్న సగం జనాభాకు చెందిన మొత్తం సంపదను మూడొట్లు ఒక ఫుట్‌బాల్ స్టేడియంలో పట్టేంత మంది కుబేరుల వద్ద పోగుబడిఉందని ఒక్కమాటలో విషయాన్ని సులువుగా విప్పిచెప్పింది 'ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదిక–2026'. పరిశోధన, అధ్యయనం, విశ్లేషణలతో పాటు, అర్థమయ్యేరీతిలో అసమానతలకు కారణాలను తెలియచెప్పడంలోనూ, పరిష్కారమార్గాలను సూచించడంలోనూ వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ కృషి గుర్తింపు ఉంది. అపరకుబేరులున్న పేదదేశంగా గత నివేదికలో భారతదేశాన్ని అభివర్ణించిన ఈ సంస్థ ఈ సరికొత్త నివేదికలో, నానాటికీ మరింత హెచ్చుతున్న ఆదాయ అసమానతలతో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందనీ, మిలియనీర్లు బిలియనీర్లుగా మారుతూంటే, పేదలు నిరుపేదలుగా తిరోగమిస్తున్నారని హెచ్చరించింది.


దేశంలో పదిశాతం సంపన్నుల దగ్గర 65శాతం సంపద ఉంది. ఇందులోనూ ఒకశాతం శ్రీమంతుల ఖజానాలోనే సరిగ్గా 40శాతం సంపద పోగుపడివుంది. జాతీయ ఆదాయంలో ఆ పదిశాతం మంది వాటా దాదాపు 58శాతం, అడుగున ఉన్న యాభైశాతం జనానిదీ పదిహేనుశాతమే. గత నివేదికతో పోల్చితే కుబేరుల వాటా ఒక శాతం పెరిగినట్టు లెక్క. ఈ దేశంలో సామాన్యుల తలసరి ఆదాయం లక్ష రూపాయలలోపు, కుబేరుల తలసరి దాదాపు కోటిన్నర. సర్వసాధారణంగా దేశం అభివృద్ధి చెందుతున్నప్పుడు సామాన్యుడి ఆదాయం పెరుగుతుంది, అంతరాలూ కొంత తగ్గుతాయి. కానీ, గత పదేళ్లలో పేద ధనిక తేడా తగ్గకపోగా కస్తంత పెరిగింది కూడా. ఆదాయ అసమానతలలో భారత్ అగ్రస్థానంలో ఉండటంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా అసమానతలు పెరగడం మరో అంశం. అట్టడుగున ఉన్న యాభైశాతం మంది మొత్తం సంపదకు మూడురెట్లు సంపద 0.001శాతం మంది ధనికుల చేతుల్లో ఉంది. అధికారం, అన్ని అధికారాలు ఉన్నవాళ్ళు జాతీయ ఆదాయంలో అధికవాటాలు కొల్లగొట్టడం తప్ప, పన్నురూపేణా ఖజానాకు సమకూరుస్తున్నది చాలా తక్కువ. ఒక మధ్యతరగతి వృత్తినిపుణుడు విధిగా పన్నులద్వారా అధికమొత్తాలు చెల్లిస్తూంటే, ఒక బిలియనీర్ తనకు అనుకూలంగా రూపొందిన విధానాలతో దాదాపు పన్నుకట్టనవసరం లేని స్థాయిని అనుభవిస్తున్నాడు. టాక్స్ జస్టిస్ లేకపోవడమే కాదు, విద్య, ఆరోగ్యం ఇత్యాది రంగాలమీద ప్రభుత్వం పరిమితంగా ఖర్చుచేయల్సిన దుస్థితి దీనివల్ల ఏర్పడిందని నివేదిక చెబుతోంది. ఇటీవలి జీ20 సదస్సు సందర్భంలో విడుదలైన నివేదిక కూడా 23 ఏళ్లలో కొత్తగా సృష్టించిన సంపదలో 41శాతం అగ్రగామి ఒకశాతం ప్రపంచ కుబేరుల చేతుల్లోకి పోయి, దిగువన ఉన్న యాభైశాతానికి ఒకశాతమే దక్కిందని వివరించింది. ఇదేకాలంలో, భారత కుబేరుల్లో పైస్థాయి ఒకశాతం మంది సంపద విలువ 62శాతానికి పెరిగితే, చైనాలో అది 54శాతంగా ఉంది. అసమానతలు ఇదే వేగంతో హెచ్చితే, ప్రజాస్వామ్యానికి చేటు తప్పదని కూడా ఆ సందర్భంలో హెచ్చరికలు విన్నాం.

మొన్న జూలైలో కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వం మీద 'మేధా మోసం' అంటూ ఒక విమర్శ చేసింది. ఆదాయ సమానత్వంలో అమెరికా, చైనా సహా అన్ని దేశాలను వెనక్కునెట్టేసి భారతదేశం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచిందని ప్రపంచబ్యాంకు నివేదిక చెబుతున్నట్టుగా, భారత 'గిని సూచీ' స్కోరు 25.5ను ఆధారంగా పీఐబీ ఒక కథనం అందించింది. 2011–23 మధ్యకాలంలో పదిహేడుకోట్లమంది భారతీయులు కటిక దారిద్ర్యం నుంచి బయటపడ్డారనీ, దేశంలో పేదరికం రేటు పదహారుసుంచి రెండుకు పడిపోయిందని, జన్‌ధన్ యోజనసుంచి, ఆధార్ ఆధారిత ప్రత్యక్ష నగదుబదిలీ సేవలవరకూ, ఆయుష్మాన్ భారత్ నుంచి గరీబ్ కల్యాణ్ అన్నయోజనవరకూ ఎన్నో కార్యక్రమాలు, పథకాలు ఈ దేశంలో దారిద్ర్యాన్ని దునుమాడి, ఆదాయసమానత్వాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషించాయంటూ ఈ కథనం విశ్లేషించింది. జాతీయ ప్రాంతీయ మీడియా దీనిని యథాతథంగా ప్రచురించడమే కాదు, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందుతున్నాయనడానికి ఈ నివేదిక నిదర్శనమంటూ కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖలు భుజాలు చరుచుకున్నాయి. అయితే, కేంద్రప్రభుత్వం ఈ నివేదికలోని మనదేశ వినియోగాధారిత గినీ సూచీని, ఇతరదేశాల్లోని ఆదాయ సూచీతో తప్పుడు పద్ధతుల్లో సరిపోల్చి ప్రజలను మోసం చేసిందని, ఆదాయ సమానత్వంలో మనది నాలుగు కాదు, 176వ స్థానమని కాంగ్రెస్ అప్పట్లో విమర్శించింది. ప్రపంచస్థాయి నివేదికలను తప్పుబట్టడం, తిరస్కరించడం, లేదా తమకు అనుకూలంగా తప్పుడు విశ్లేషణలు చేయడం కాక, తగిన విధానాలతో సమస్యను ఎదుర్కోవడం అవసరం. అతివేగంగా ఎదుగుతూ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉన్న భారతదేశంలో కోట్లాదిమంది కనీస అవసరాలు తీరకపోవడం అన్యాయమే కాదు, గౌరవాన్నీ ఇవ్వదు.

కార్మికలోకానికి శాపం.. ఈ కమ్యూనిస్టులు!

కమ్యూనిస్టులు కార్మికుల పేరుతో రాజకీయ లాభాల కోసం బంద్‌లు, ఆందోళనలకు పిలుపునిస్తారు. ఈ రోజు బంద్‌లో పాల్గొన్న కార్మికుడు రేపు ఆకలితో అలమటిస్తాడు. వారిని ఆకలితో మాడ్చే కమ్యూనిస్టులు కార్మికుల శత్రువు కాదా? అని అంబేడ్కర్ స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో వ్యాఖ్యానించారు. డెబ్బై ఏళ్ల దాటినా కమ్యూనిస్టులు ఏమీ మారలేదు. కొత్తగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ పట్ల వారి వ్యతిరేకతే దీనికి ఋజువు. మారుతున్న కాలంతో పాటు మారుతున్న ఉపాధి రంగాల్లో కార్మికులకు మేలు చేసేందుకు కేంద్రం పాత చట్టాలను తొలగించి వాటి స్థానంలో కొత్త లేబర్ కోడ్స్‌ను తెచ్చింది. కమ్యూనిస్టులు మంచిని చూడకుండా, అవి కార్మికుల వ్యతిరేకం అని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు.

ఇప్పటివరకూ ఉన్న 29 కార్మిక చట్టాలు ప్రధానంగా 1940 నుంచి 1990 మధ్య కాలంలో వచ్చాయి. అంటే బ్రిటిష్ కాలం చివరి రోజుల నుంచి స్వాతంత్ర్యం తర్వాత మొదటి 40–45 ఏళ్లలో తయారయ్యాయి. మినిమమ్ వేజెస్ యాక్ట్, ఫ్యాక్టరీస్ యాక్ట్, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలు 1948–1952 మధ్యే వచ్చాయి. ఆ కాలంలో భారత్ ఇంకా పారిశ్రామికీకరణ మొదటి దశలో ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ ఆధారితం. ఈ చట్టాలు వర్తించే పరిశ్రమలు నూలు మిల్లులు, జూట్ మిల్లులు, బొగ్గు–ఇనుము గనులు, రైల్వే, టీ, కాఫీ, రబ్బరు తోటలు, బీడీ పరిశ్రమ, ఇనుము–ఉక్కు కర్మాగారాలు, పోర్ట్ & డాక్ యార్డులు. ఇప్పుడు ఈ తరహా పరిశ్రమలు ప్రభావం సన్నగిల్లింది. టెక్స్‌టైల్స్ మిల్లులు మూతపడ్డాయి, గనులు ఆటోమేషన్‌లోకి వెళ్లాయి. కొత్త రంగాలు ఐటీ, గిగ్ ఎకానమీ, ఈ–కామర్స్, డెలివరీ సర్వీసెస్ వచ్చాయి. పాత చట్టాలు ఇప్పటి కార్మికులకు సరిపడకపోవడంతో, కేంద్రం నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు తీసుకొచ్చింది.



కొత్త లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమనీ, కార్పొరేట్లకు మేలు చేస్తాయనీ కమ్యూనిస్టులు ప్రచారం చేస్తున్నారు. లేబర్ కోడ్స్‌లో ప్రతిదానికీ లేని అర్థాన్ని వెతుక్కుని తప్పుడు ప్రచారాలు చేస్తూ కార్మికులను తమ గుప్పిట్లో ఉంచుకుని వారి జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నారు.

కొత్త లేబర్ కోడ్‌లు సరళంగా, ఒకే చట్టంలో అన్నీ ఉన్నాయి. వేజెస్ కోడ్ ద్వారా కార్మికుల వేతనాలు, మినిమమ్ పే, బోనస్‌లు నిర్ణయిస్తారు. మినిమమ్ వేతనం జాతీయ స్థాయిలో నిర్ణయిస్తారు. రాష్ట్రాలు తమ పరిస్థితుల ప్రకారం మార్చవచ్చు. కాబట్టి పేద కార్మికులకు మంచి పే వస్తుంది. వేతనాల్లో అలవెన్స్‌లు పెంచి, బేసిక్ పే మెరుగుపరచడం వల్ల పీఎఫ్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు పెరుగుతాయి. బోనస్ 8.33శాతం నుంచి పెంచారు. కార్మికుల చేతికి వచ్చే డబ్బు పెరుగుతుంది. వివాదాలు త్వరగా పరిష్కరించడానికి ఒకే లేబర్ కోర్ట్ ఏర్పాటు అవుతుంది. పాత చట్టాల్లో 5–6 కోర్టులు ఉండటం వల్ల కేసులు ఆలస్యమయ్యాయి; ఇప్పుడు 3–6 నెలల్లో పరిష్కారమవుతాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా శాశ్వత కార్మికుల్లా గ్రాట్యుటీ, పీఎఫ్ ఇవ్వాలి. ఇది 90శాతం అసంఘటిత రంగ కార్మికులకు మేలు చేస్తుంది. ఇప్పుడు యువత ఎక్కువగా గిగ్ వర్కర్లుగా ఉన్నారు. ఈ లేబర్ కోడ్స్ ద్వారా ఉబర్, జొమాటో డ్రైవర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు మొదటిసారి భద్రత లభిస్తుంది. ఇన్సూరెన్స్, మెడికల్, పెన్షన్ హామీ ఇస్తున్నారు. 90శాతం అన్‌ఆర్గనైజ్డ్ కార్మికులు కవర్ అవుతారు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ పెరిగి, రూ.21,000 వేతనం వరకు కవర్ అవుతాయి. మెడికల్ సహాయం, మ్యాటర్నిటీ బెనిఫిట్‌లు లభిస్తాయి. చిన్న ఫ్యాక్టరీలు అంటే పదిమంది ఉద్యోగులు, కార్మికులు ఉన్న కంపెనీలు కూడా సేఫ్టీ చెక్‌లు చేయాలి. ఇది మహిళలు, చిన్న కార్మికులకు రక్షణ ఇస్తుంది. మ్యాటర్నిటీ లీవ్ 26 వారాలకు పెంచారు. వారానికి 48 గంటలు పనిలో మార్పు లేదు. ఓవర్ టైమ్‌కు అదనపు చెల్లింపులు చేయాలి. పాత 29 చట్టాలు గందరగోళంగా ఉండటం వల్ల కార్మికులు ప్రయోజనాలు పొందలేదు. ఇప్పుడు ఈ కొత్త నాలుగు చట్టాల్లో అన్నీ స్పష్టంగా ఉన్నాయి.

కానీ కమ్యూనిస్టులు ఈ చట్టాలు కార్మిక వ్యతిరేకమనీ, కార్పొరేట్లకు మేలు చేస్తాయనీ ప్రచారం చేస్తున్నారు. లేబర్ కోడ్స్‌లో ప్రతిదానికీ లేని అర్థాన్ని వెతుక్కుని తప్పుడు ప్రచారాలు చేస్తూ కార్మికులను తమ గ్రిప్‌లో ఉంచుకుని వారి జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నారు. వారంలో పని గంటలు పెంచినట్లుగా ప్రచారం చేస్తున్నారు. వారానికి 48గంటల పని విషయంలో ఎలాంటి మార్పు లేకపోగా, కార్మికులు అదనపు పని చేసుకుని అదనంగా సంపాయించుకునే అవకాశాన్ని కల్పించారు. దీన్ని కూడా తప్పుగా అన్వయిస్తున్నారు. కంపెనీలు బాగుంటేనే కార్మికులు బాగుంటారన్న విషయాన్ని కమ్యూనిస్టులు అంగీకరించడం లేదు. అసలు లేబర్ కోడ్స్‌పై అభ్యంతరాలేమిటో కమ్యూనిస్టులకే స్పష్టత లేదు. 'కార్పొరేట్లకు మేలు', 'కార్మిక హక్కులకు పాతర'... ఇలా పడికట్టు పదాలతో ఎప్పట్లాగే రాజకీయం చేస్తున్నారు.

లేబర్ కోడ్స్ ద్వారా ప్రధానమంత్రి మోదీ కార్మికవర్గానికి సరికొత్త శక్తిని ఇస్తున్నారు. ఈ మార్పులు కేవలం చట్టాలు కాదు; భారత శ్రామిక శక్తిని ఆత్మవిశ్వాసంతో మరింత శక్తివంతంగా తీసుకెళ్లే విజన్. కొత్త లేబర్ కోడ్స్ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరగడమే గాక, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. శ్రామిక శక్తి ఆధారిత అభివృద్ధి అనే లక్ష్యాన్ని చేరుకునే దిశలో ఇది ఒక సుస్థిరమైన అడుగు.

కమ్యూనిస్టులు కార్మికుల హక్కుల పోరాటం అంటారు కానీ పరిశ్రమల నాశనమే విధానంగా పనిచేస్తారు. పశ్చిమ బెంగాల్ 1960 నాటికి పారిశ్రామికంగా దేశంలో రెండో స్థానంలో ఉండేది, కానీ ట్రేడ్ యూనియన్ మిలిటెన్సీ వల్ల పరిశ్రమలు మూతపడి పారిశ్రామికీకరణ ఆగిపోయి 2000 నాటికి పదవ స్థానానికి పడిపోయింది. ఇండస్ట్రియల్ ఔట్‌పుట్ షేర్ 24శాతం నుంచి 3.7శాతానికి తగ్గింది. దీనివల్ల నష్టపోయింది ఎవరు?

కమ్యూనిస్టులు కార్మికులను ఓటుబ్యాంకుగా చూస్తారు, చేసుకుంటారు. ఎప్పటికప్పుడు వారిని రెచ్చగొట్టి ఉద్యమాలకు ప్రేరేపించి గుప్పిట్లో ఉంచుకుంటారు. వారికి మంచి జరిగే చట్టాలు వచ్చి బాగుపడితే తమకు ఇక పుట్టగతులు ఉండవని నిత్యం రెచ్చగొడతారు. ఇలాంటి వారికి ఇక కార్మికులు, ప్రజలు అవకాశం ఇవ్వరు. సరైన సమయంలో సరైన బుద్ధి చెబుతారు.

● ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు

ఇంటా బయటా ఉత్తమ పౌరులు

నేను అనేక సంవత్సరాలుగా రాస్తున్న ఈ కాలమ్‌లో నా కుటుంబం గురించి ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఇప్పుడు అందుకు ఒక మినహాయింపునిస్తున్నాను. మా అమ్మగారు గతవారం మరణించారు. మా నాన్నగారు చనిపోయిన పన్నెండు సంవత్సరాలకు ఆమె శాశ్వతంగా కన్నుమూశారు. ఇరువురూ విస్తృతంగా ప్రసిద్ధులు కారు. అయితే ఆదర్శప్రాయులు అయిన తల్లిదండ్రులు. ఆ ఆదర్శప్రాయతలో గుర్తుచేసుకోవల్సిన కొన్ని ఇతర విషయాలు ఉన్నాయి. మొహమాటంలేని స్వోత్కర్షలకు పోకుండా, వట్టి మాటలు కట్టి పెట్టి గట్టి మేలు తలపెట్టడం ద్వారా తమ దేశభక్తిని వ్యక్తం చేసిన తరానికి చెందిన విద్యావంతులు నా జననీజనకులు. ఇక్కడ వారి గురించి నేను రాస్తున్న ఉదాత్త విషయాలను పాఠకులు తమకు సంబంధ బాంధవ్యాలు ఉన్న వ్యక్తుల– తల్లిదండ్రులు, పిన తండ్రులు, మేనమామలు, మేనత్తలు, ఉపాధ్యాయులు, డాక్టర్లు– జీవిత విశేషాలలోను గుర్తించగలరు.

మా నాన్న సుబ్రమణియం రామదాస్ గుహ 1924లో ఊటీలో జన్మించారు. ఇరవైమూడు సంవత్సరాల తరువాత ఆయన తన కన్న ఊరును సందర్శించినప్పుడు అక్కడ పరిచయమైన విశాలాక్షి నారాయణమూర్తి అనే ఒక యువతితో ప్రేమలో పడ్డారు. రామదాస్ గుహ ఆ కాలంలో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పిహెచ్.డి తుదిదశలో ఉన్నారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త జి.ఎన్.రామచంద్రన్ ఆయన సహచర పరిశోధక విద్యార్థులలో ఒకరు. ఆయన కోరుకుంటే బ్రిటిష్, యూరోపియన్ లేదా అమెరికా విశ్వవిద్యాలయాలలో ఎక్కడైనా పోస్ట్ డాక్టొరల్ స్కాలర్‌షిప్ తప్పక లభించి ఉండేది. అయితే ఆయన హృదయం అంతా ఊటీలో మొసులెత్తిన ప్రేమతో నిండిపోయి ఉంది. ఆ భావోద్వేగం ఆయనను ప్రతిష్ఠాత్మక విదేశీ విశ్వవిద్యాలయంలో పరిశోధనకు కాకుండా డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ)లో కొలువుకు నడిపించింది. విశాలాక్షి తండ్రి ఆ సంస్థలో ఉద్యోగి. మా నాన్న 1948లో ఎఫ్ఆర్ఐలో చేరారు. మూడు సంవత్సరాల అనంతరం మా అమ్మను వివాహం చేసుకున్నారు.

మా నాన్న ప్రభుత్వోద్యోగుల కుటుంబానికి చెందిన వారు. ఆయన సోదరుడు ఒకరు భారత వాయుసేనలో ఉన్నారు. ఒక సోదరి ఆర్మీ నర్సింగ్ సర్వీస్‌లో ఉన్నారు. ఒక బాబాయి ఆయన మాదిరిగానే శాస్త్రవేత్త. అలాగే బావమరిది కూడా. ప్రజా హితానికి తోడ్పడే పరిశోధనలకు అంకితమైనవారు. మా నాన్నగారు భారత ప్రభుత్వం గురించి మాట్లాడుతున్నప్పుడు ఆయన మాటల్లో గౌరవభావం ప్రతిధ్వనిస్తూ ఉండేది. చిత్తశుద్ధి ఉన్న గౌరవమది. ప్రభుత్వ ఆస్తులను ఎటువంటి పరిస్థితులలోను వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోకూడదనేది ఆయన సునిశ్చిత విశ్వాసం. ఆయన తన ఉద్యోగ జీవితమంతా ఈ విశ్వాసానికి కట్టుబడి ఉన్నారు. ఎఫ్ఆర్ఐ కల్పించిన కారు సదుపాయాన్ని ఆయన వాడుకోలేదు. ప్రతి రోజూ సైకిల్‌పైనే ప్రయోగశాలకు వెళ్లి, తిరిగి సైకిల్ మీదే ఇంటికి తిరిగివచ్చేవారు.

ప్రభుత్వోద్యోగ విధులను నిబద్ధతతో నిజాయితీగా నిర్వర్తించే మా నాన్న, సామాజిక సంకుచితత్వాలను నిరసించేవారు. ఆ కాలంలో ఇతర ప్రభుత్వ పరిశోధనా సంస్థలలో వలే ఎఫ్ఆర్ఐలో కూడా శాస్త్రవేత్తల విభాగంలో బ్రాహ్మణుల ప్రాబల్యముండేది. వారి కుమారులు తమ వంశావళి గురించి ఘనంగా చాటుకునేవారు. తాము, తమ తండ్రులు ఏటా తమ యజ్ఞోపవీతాలను ఎలా మార్చుకునేది సగర్వంగా చెబుతుండేవారు. మా నాన్నగారు జంధ్యం ధరించేవారు కాదు. నన్నూ ఆ ఆచారాన్ని పాటించేందుకు ప్రోత్సహించలేదు. కులపరమైన హెచ్చుతగ్గులను ఆయన ఏవగించుకునేవారు. కుటుంబ నేపథ్యమే ఆయనలో ఆ తిరస్కార వైఖరిని సృష్టించింది. ఆయన తండ్రి సోదరుడు ఆర్.గోపాలస్వామి అయ్యర్ (1878–1943) సాంఘిక సంస్కర్త. మైసూరు సంస్థానంలో అంటరానితనం అనాచార బాధితులకు ఆ దౌష్ట్యం నుంచి విముక్తి కలిగించేందుకు ఆయన చాలా పాటుపడ్డారు.


AKBAR

మా అమ్మగారు మరింత సదాచార బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చారు. ఆమె కళాశాల విద్యాభ్యాసం మద్రాసు, ఢిల్లీ నగరాల్లో జరిగింది. డెహ్రాడూన్‌లో సమస్త కుల మతాల వారికి ప్రవేశార్హత ఉన్న ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. తోటి వ్యక్తి విలువను ఆదాయం, సామాజిక హోదా ప్రాతిపదికన అంచనా వేసేందుకు ఆమె పూర్తి విముఖత చూపేవారు. ఈ కాలమిస్ట్ వలే కాకుండా నా తల్లిదండ్రులు తమ లౌకికవాద విశ్వాసాలను ఎన్నడూ బహిరంగంగా చాటేవారు కాదు. అవి వారి ప్రవర్తనలో సువ్యక్తమవుతుండేవి. డెహ్రాడూన్‌లో వారు అత్యంత సన్నిహితంగా ఉన్న మూడు కుటుంబాలు సిక్కు, కాయస్థ, తమిళ్ క్రైస్తవులవి. సంపన్న బ్రాహ్మణ కుటుంబాలు వంట మనిషిని నియమించుకునేవారు. తాము తీసుకునే ఆహారం శుచిగా, శుద్ధంగా ఉండాలనే భావనతో తమ శాఖకు చెందిన పురుషుడిని మాత్రమే వంటవాడుగా ఏర్పాటు చేసుకునేవారు. వంట మనిషిని పెట్టుకునే తాహతు ఉన్న నా తల్లి దండ్రులు, నాకు తెలిసిన తరువాత నియమించుకున్న వంటవాళ్లు ఇరువురూ బ్రాహ్మణేతరులే. ఆ ఇరువురూ గఢ్వాల్ హిమాలయ ప్రాంతాలకు చెందిన వారు. తదనంతర కాలంలో కుల పట్టింపులను మరింతగా అధిగమించి ఒక ముస్లిమ్‌ను తమ వంటవాడుగా నా తల్లిదండ్రులు నియమించుకున్నారు.


■ రామచంద్ర గుహ

మా నాన్నగారి పర్యవేక్షణలో పిహెచ్.డి తీసుకున్న వారిలో మొదటి వ్యక్తి వి.ఎన్.ముఖర్జీ. ఆగ్రా విశ్వవిద్యాలయం ముఖర్జీకి డాక్టరేట్ పట్టా ప్రదానం చేసేందుకు అంగీకరించిందని తెలియగానే ఆయనను మరుసటి ఉదయం ఇంటికి రమ్మని మా నాన్న ఆహ్వానించారు. ముఖర్జీ మా ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ నొక్కగానే నా సోదరి వాణి, నేనూ (అప్పటికి మా వయసు వరుసగా పన్నెండు, పది సంవత్సరాలు) తలుపులు తెరిచి మా నాన్నగారు పురిగొల్పిన విధంగా 'గుడ్ మార్నింగ్, డాక్టర్ ముఖర్జీ' అని గౌరవపూర్వకంగా స్వాగతం పలికాము. అంతకు ముందురోజు సాయంత్రం వరకు కేవలం 'ముఖర్జీ'గా మాత్రమే ఉన్న వి.ఎన్.ముఖర్జీ మా సంబోధనతో చాలా ఆనందభరితుడు అయ్యారు.

పాఠశాల ఉపాధ్యాయురాలిగా మా అమ్మగారు, నాన్నగారి కంటే చాలా ఎక్కువ మంది జీవితాలను ప్రభావితం చేశారు. డెహ్రాడూన్ కంటోన్మెంట్‌లోని కేంబ్రియాన్ హాల్ అనే పాఠశాలలో ఆమె రెండు దశాబ్దాల పాటు హిందీ, ఇంగ్లీష్, ఎకనామిక్స్, జాగ్రఫీ బోధించారు. కులం, వర్గం, మతం ప్రాతిపదికన గానీ, అంతకంటే ముఖ్యంగా అభ్యసన సామర్థ్యాల ఆధారంగా గానీ ఆమె తన విద్యార్థుల పట్ల ఎటువంటి తరతమ భావం చూపేందుకు అంగీకరించేవారు కాదు. పాఠశాల విద్యాభ్యాసం ముగిసిన తరువాత కూడా ఎంతో మంది విద్యార్థులు పండుగలు, కొత్త సంవత్సరం సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతుండేవారు. ప్రతి ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఆమెకు ఆ రోజంతా ఫోన్ కాల్స్ వస్తుండేవి. తమ యాభైలు, అరవైలలో ఉన్న పలువురు మాజీ విద్యార్థులు వ్యక్తిగతంగా వచ్చి పూలగుత్తులతో శుభాకాంక్షలు తెలిపేవారు. 'మేడమ్ గుహ' గురించి గౌరవాదరాలతో మాట్లాడుతుండేవారు. మా అమ్మ మరణించిన తరువాత బోధనా వృత్తి, ముఖ్యంగా పాఠశాల విద్యాబోధన ఎంత ఉత్కృష్టమైన వృత్తో నాకు మళ్లీ సరికొత్తగా అర్థమయింది. అదొక నిస్వార్థమైన వృత్తి. స్వీయ కేంద్రితమైనది ఎంత మాత్రమూ కాదు. ఉద్యోగ విరమణ చేసిన 41 సంవత్సరాలకు మా అమ్మ మరణించింది. మా అమ్మ వద్ద చదువుకున్న విద్యావేత్తలు, నటులు, సైనికాధికారులు, ఫైటర్ పైలట్‌లు, రచయితలు, డాక్టర్లు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, మరీ ముఖ్యంగా ఉపాధ్యాయుల నుంచి సంతాప సందేశాలు నాకు వెల్లువెత్తాయి.

మా నాన్నగారు 2012లో క్రిస్మస్ పండుగ రోజున 88 సంవత్సరాల వయసులో మరణించారు. అంతిమ దినాలలో అనారోగ్యగ్రస్తుడైన మా నాన్నను ఆస్పత్రికి తీసుకువెళ్లింది అబ్బాస్, రాధాకృష్ణ అనే ఇద్దరు పొరుగు పెద్ద మనుషులు. వారిరువురూ ఆయనకు మంచి స్నేహితులు. నాన్న మృతి తరువాత మా అమ్మగారు బెంగళూరులో కోరమంగళ ప్రాంతంలోని తమ స్వగృహంలో కాకుండా మా అక్కయ్య వద్దనో లేదా నా కుటుంబంతోనో ఉండేవారు. వృద్ధాప్య సహజమైన అశక్తత మినహా కుటుంబం, స్నేహితులు, ఒకనాటి తన విద్యార్థుల సహవాసం, సమక్షంలో ఆమె జీవితం ఆనందంగా గడిచిపోయింది. రాజకీయాలలో ఆసక్తి చూపే వ్యక్తి కానప్పటికీ పెచ్చరిల్లుతున్న మత దురభిమానాలు, హిందుత్వ పక్షపాతాలు ఆమెను అమితంగా వ్యాకుల పరిచాయి. నెహ్రూ కాలం నాటి బహుళత్వ, సమ్మిళిత, వైవిధ్యభరితమైన సామాజిక వాతావరణంతో ప్రభావితమైన ఆ విద్యావతికి 'ఈ పురానవ భారత భూమి తన తోటి హిందువులకు మాత్రమే సొంత భూమి' అన్న సంకుచిత భావనను ఆమె ఏవగించుకునేవారు. డెహ్రాడూన్‌లో డైసీ బట్లర్ వైట్, నిఘాత్ రహ్మాన్ అనే ఇద్దరు సహచర ఉపాధ్యాయురాళ్ల సలహాలు, సూచనలకు ఆమె ప్రత్యేక విలువనిచ్చేవారు. బెంగళూరు జీవితంలో ఆమెకు సన్నిహిత ప్రేమాస్పదులు లయీఖ్, జాఫర్ ఫుతేహల్లీ అనే దంపతులు.

నాకు పుట్టుకతోనే అనేక రకాల సామాజిక సౌలభ్యాలు సమకూరాయి. హిందువుల ప్రాబల్యం, పరిపాలనలో ఉన్న దేశంలో నివసిస్తున్న ఒక హిందూ మతస్థుడుగా, కుల పక్షపాతాలు పరిపూర్ణంగా ఉన్న సంస్కృతిలో ఒక బ్రాహ్మణ సంజాతుడుగా, పితృస్వామ్య అణచివేతలు తీవ్రంగా ఉన్న సమాజంలో ఒక పురుషుడుగా, జీవితోన్నతికి ఇంగ్లీషు మాత్రమే అనేక అవకాశాలు కల్పిస్తున్న దేశంలో– ఆ భాషను ధారాళంగా మాట్లాడ గలిగిన మేధా సామర్థ్యమున్న వ్యక్తిగా నేను స్వయంగా ఆర్జించని ఆ సానుకూలతలు నా జీవిత ప్రస్థానాన్ని మరింత సుఖప్రదం చేశాయి. నా తోటి భారతీయులలో అత్యధికులకు ఆ అనుకూలతలు అసలు లేవనే వాస్తవాన్ని నా తల్లిదండ్రులు విశాలాక్షి, సుబ్రమణియం రామదాస్ గుహ ఉదాత్త జీవితాలు నాకు ఎరుకపరిచాయి. సౌభ్రాతృత్వ స్ఫూర్తి, పక్షపాతాలు, ప్రతికూలతలు ప్రదర్శించని విశాల భావదీప్తి, పౌరసత్వ ధర్మాలనే వివేకశీలతను మా అమ్మ, నాన్న ఇరువురూ సైద్ధాంతికంగా కాకుండా తమ జీవితాచరణలో దృఢంగా, స్వార్థరహితంగా ధ్రువీకరించారు. నా జననీజనకుల జీవితాలను సింహావలోకనం చేసినప్పుడు, ఆ సముదాత్త సత్యాన్ని నా యవ్వనంలో కంటే ఇప్పుడే మరింత స్పష్టంగా అవగతం చేసుకో గలుగుతున్నాను.

> **నాకు పుట్టుకతో సమకూరిన అనేక సానుకూలతలు నా జీవిత ప్రస్థానాన్ని సుఖప్రదం చేశాయి. నా తోటి భారతీయులలో అత్యధికులకు అటువంటి అనుకూలతలు అసలు లేవనే వాస్తవాన్ని నా తల్లిదండ్రులు విశాలాక్షి సుబ్రమణియం రామదాస్ గుహ ఉదాత్త జీవితాలు నాకు ఎరుకపరిచాయి. సౌభ్రాతృత్వ స్ఫూర్తి, వివక్షలు చూపని విశాల భావదీప్తి, పౌరసత్వ ధర్మాలనే వివేకశీలతను మా అమ్మ, నాన్న ఇరువురూ సైద్ధాంతికంగా కాకుండా తమ జీవితాచరణలో దృఢంగా, స్వార్థరహితంగా ధ్రువీకరించారు.**

(వ్యాసకర్త చరిత్రకారుడు)

సామాజిక సంక్షేమ బోర్డుకు ప్రాణం

దేశ చిత్రపటాన్ని సంక్షేమ పథకాలు లేకుండా ఊహించలేం. అందులోనూ సామాజిక అంశాలను స్పృశించకుండా ఉండలేం. పరిపాలనలో సామాజిక సంక్షేమం అన్నది చాలా కీలకమైన భాగస్వామ్యం. అత్యవసరం కూడా. ఈ ఆవశ్యకతల నేపథ్యంలోనే 1953, ఆగస్టు 12న కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసింది. తొలుత డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రం బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల పరిధిలోనూ సామాజిక కులాల సంక్షేమం కోసం బోర్డులను ఏర్పాటు చేసి, కేంద్ర రాష్ట్రాల వాటా నిధుల నిష్పత్తి, మార్గదర్శకాలు, పర్యవేక్షణలను రూపొందించారు. దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా అశేష ప్రజలకు సేవలు అందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పలువురు బోర్డు ఛైర్మన్లుగా నియమితులయ్యారు.

మారుతున్న రాజకీయ పరిస్థితులు, కొత్త కొత్త పథకాల ఆవిర్భావంతో సంక్షేమానికి సంబంధించిన సామాజిక మాతృసంస్థ ఉనికి ప్రశ్నగా మిగిలిపోయింది. కేంద్రం నిధుల వాటా క్రమేపీ తగ్గిపోయింది. ఇలాంటి బోర్డు ఒకటి ఉందన్న సంగతి ఆయా సామాజిక కులాలు కూడా మర్చిపోయాయి. కొన్ని రాష్ట్రాలు వారి ఆర్థిక స్థితితో ఆ సామాజిక సంక్షేమ బోర్డును ఉనికిలో ఉంచాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో బోర్డు మనుగడ బాధాకరంగా మారింది. గత ప్రభుత్వం 2021 జూలై 29న వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్‌గా కడపకు చెందిన వ్యక్తిని నియమించింది. 2023 మార్చి 16న కేంద్రం వాటా నిధులు రావటం లేదని బోర్డును నిలుపుదల చేశారు. సంబంధిత ఐదుగురు ఉద్యోగులను ఇతర శాఖలకు బదిలీ చేశారు. మళ్ళీ 2023 జూన్ 27న ఇచ్చిన జీవో ద్వారా బోర్డును ఆగస్టు నాలుగు వరకు కొనసాగించారు. అంటే కేవలం మూడు నెలల వరకే బోర్డు ఉండేలా ఉనికి కల్పించారు. ఇక నవంబర్ 11న బోర్డును పూర్తిగా మూసివేశారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ రంకెలు వేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సామాజిక సంక్షేమ బోర్డును మరణశయ్యపై పడుకోబెట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగస్టు 12న సామాజిక బోర్డుకు ప్రాణం పోసేందుకు నడుం కట్టారు. బోర్డు ఛైర్మన్‌ని నియమించారు. బోర్డును ఉనికిలోకి తెచ్చేలా ఆదేశాలు ఇచ్చారు. నూతన మార్గదర్శకాలను రూపొందించారు. గతంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ పరిధిలో ఉన్న బోర్డును, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోకి తెచ్చారు. ఈ ఏడాది నవంబర్ 25న సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖకు అనుసంధానం చేస్తూ నూతనంగా సామాజిక సంక్షేమ బోర్డుకు ప్రాణం పోశారు. కొత్త మార్గదర్శకాలతో దిశానిర్దేశం చేసారు. దేవుని గుడి ఉంటే, పూజారి ఉంటాడు. పూజలు, ధూప, దీప నైవేద్యాలు జరుగుతాయి. భక్తులు దేవుణ్ణి దర్శించుకుంటారు. వారి కోరికలను విన్నవించుకుంటారు. పూజారిని లేకుండా చేసినా, అసలు గుడే లేకపోయినా ఒక్క భక్తుడు అటువైపు రాడు. ఎట్టకేలకు రాష్ట్రంలో బడుగుల 'సామాజిక న్యాయ' ఆలయ నిర్మాణం జరగటం సామాజిక సంక్షేమ పిపాసకులకు, అంబేద్కరిస్టులకు శుభవార్త.

○ పోతుల బాలకోటయ్య
ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు

ఉన్నత విద్యకు దిక్సూచి 'ఏకీకృత' చట్టం

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యారంగం ఆర్థిక, పరిపాలనా ప్రతికూలతలు, నిర్మాణాత్మక అడ్డంకులు ఎదుర్కొంటున్నప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిసమానంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతున్నది. కోర్సుల రూపకల్పనలో ఆధునికత, సిలబస్ పునర్వ్యవస్థీకరణ, బోధన–అధ్యయన విధానాల్లో నవీనత, పరిశోధన–అభివృద్ధికి ప్రాధాన్యం, ఇన్నోవేషన్–స్టార్టప్–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్ బలోపేతం వంటి రంగాల్లో గత కొన్నేళ్లలో జరిగిన సంస్కరణలు ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ రూపొందిస్తున్న 'ఏకీకృత విశ్వవిద్యాలయాల చట్టం' ఉన్నత విద్యా పరిపాలనలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభించే కీలక ప్రయత్నంగా కనిపిస్తోంది.



ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ గాంధీ సాంకేతిక విజ్ఞాన విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్టీయూలు, ఉర్దూ విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం, క్లస్టర్ విశ్వవిద్యాలయాలు వంటి అనేక సంస్థలు తమ ప్రత్యేక చట్టాల కింద పనిచేస్తున్నాయి. మరొకవైపు, సంప్రదాయ విశ్వవిద్యాలయాలకు మాత్రం ఒకే చట్టం వర్తిస్తున్నది. ఈ విభిన్న శాసన నిర్మాణం కారణంగా పరిపాలనలో అసమన్వయం, అకడెమిక్ ప్రమాణాల్లో భిన్నత్వం, నియామకాలలో అస్పష్టత, ఆర్థిక నిర్వహణలో అసమానత వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని సరిచేయడానికి, ఏకరీతిచేసే శాసన చట్టం ఏర్పాటు చేసి, అన్ని వర్సిటీలను ఒకే దారిలో నడిపించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

2020లో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన 'జాతీయ విద్యా విధానం' ఉన్నత విద్యా వ్యవస్థలో మూలగామి మార్పులకు బాట వేసింది. మల్టీ–డిసిప్లినరీ విద్య విస్తరణ, అకడెమిక్ స్వతంత్రత, నాణ్యతా ప్రమాణాల ఏకరీతీకరణ, HEI క్లస్టర్ల ఏర్పాటు, పరిశోధన–ఇన్నోవేషన్‌కు ప్రాధాన్యం వంటి అంశాలు ఈ విధానం యొక్క ప్రధాన స్తంభాలు. త్వరలో అమల్లోకి రానున్న ఉన్నత విద్యా కమిషన్ ఆఫ్ ఇండియా (HECI) ద్వారా దేశవ్యాప్త ఉన్నత విద్యా పరిపాలన మరింత సమీకృతం, ప్రమాణీకృతం కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న ఏకీకృత విశ్వవిద్యాలయాల చట్టం, జాతీయ విధానాల దిశగా రాష్ట్ర ఉన్నత విద్యా నిర్మాణాన్ని అనుసంధానించే ఒక ముందడుగుగా నిలుస్తోంది.


యూనిఫైడ్ యూనివర్సిటీ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చిన రాష్ట్రాల అనుభవాలు సమగ్ర ఉన్నత విద్యా సంస్కరణలకు దారితీయగలవన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఈ చట్టాన్ని ముందుగా అమలు చేసి అనేక సానుకూల ఫలితాలు సాధించాయి. ఈ రెండు రాష్ట్రాల అనుభవాలు, అమలు విధానాలు ఆంధ్రప్రదేశ్‌కు మార్గనిర్దేశం చేసే నమూనాగా ఉపయోగపడే అవకాశం ఉంది.

విశ్వవిద్యాలయాల ప్రధాన పరిపాలనా సంస్థ అయిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (EC) స్థానంలో, ప్రస్తుతం కొత్త చట్టం ప్రకారం బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ (BoM) ఏర్పాటు చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఈ బీఓఎమ్, విశ్వవిద్యాలయాల కీలక నిర్ణయాధికార సంస్థగా, పాలసీ రూపకల్పన కేంద్రంగా, కార్యనిర్వాహక మండలిగా వ్యవహరించనుంది. ఇందులో ఉపకులపతి అధ్యక్షుడిగా ఉంటారు. దీంతోపాటు అన్ని విశ్వవిద్యాలయాలు అనుసరించాల్సిన ఒక 'మోడల్ స్టాట్యూట్'ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే అవకాశం ఉంది.

ప్రతిపాదిత చట్టంలో సర్వీసు కోడ్ అత్యంత కీలక అంశంగా నిలవనుంది. నియామకాలు, జీతభత్యాలు, పదోన్నతులు, పదవీ విరమణ, సేవా నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, శిక్షా ప్రక్రియ వంటి అంశాలన్నింటికీ ఒకే విధమైన సర్వీసు కోడ్ రూపొందించే అవకాశం ఉంది. దీనివల్ల వర్సిటీల మధ్య ఉన్న అసమానతలు తొలగి, ఉద్యోగులలో న్యాయం, సమానత్వం, పారదర్శకత పెరుగుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కొత్త చట్టం పరిధిలోకి వచ్చే విశ్వవిద్యాలయాల్లో కులపతిగా రాష్ట్ర గవర్నర్ కొనసాగుతారనే స్పష్టత కనిపిస్తోంది. ప్రస్తుతం రాజీవ్‌గాంధీ సాంకేతిక విజ్ఞాన విశ్వవిద్యాలయంలో సీఎం కులపతిగా ఉండే ఏర్పాటు కూడా మారే అవకాశం ఉంది. 'ఏకీకృత విశ్వవిద్యాలయాల చట్టం'ను సమతుల దృష్టితో, సమర్థవంతంగా అమలు చేయగలిగితే, ఉన్నత విద్యా ప్రమాణాల విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండే అవకాశం ఉంది.

■ ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు
కృష్ణా విశ్వవిద్యాలయం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
3
శుక్రవారం 12 డిసెంబరు 2025





తలపడుతున్న కర్నూలు - కడప జిల్లాల మహిళా జట్లు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

4

టిప్పర్లు.. టెర్రర్

ఓవర్ లోడ్‌తో రయ్.. రయ్

- ప్రజలకు ప్రాణ సంకటంగా రాకపోకలు
- చిద్రమవుతున్న రోడ్లు.. చోద్యం చూస్తున్న అధికారులు

రోడ్డు భద్రతా నిబంధనలను పాటించకుండా.. రోడ్డుపై రాకపోకలకు అనుకూలంగా ఉందో లేదో చూసుకోకుండా.. ట్రాఫిక్ పరిస్థితి అర్థం చేసుకో కుండా.. అసలు ఆ మార్గంలో ప్రయాణించవచ్చా లేదా అని ఆలోచించ కుండా.. టిప్పర్లు దూసుకు వస్తున్నాయి. అది పట్టణమైనా.. పల్లె అయినా రయ్‌రయ్ అంటూ ఓవర్ లోడుతో రాక పోకలు సాగిస్తున్న టిప్పర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా దూసుకు వస్తున్న టిప్పర్లతో వాహనచోదకులు, పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా పరిధిలో కృష్ణానదీ తీరం నుంచి ఇసుకను సామర్థ్యానికి మించి పోసుకుని వెళ్తున్న టిప్పర్లు రోడ్లను ఛిద్రం చేయడమే కాకుండా ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. కంకర, గ్రావెల్ లోడుతో వెళ్లే లారీలు, టిప్పర్ల అయితే నిత్యం ప్రాణసంకటంగా మారాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసు, రవాణా, మైనింగ్ తదితర శాఖలు పట్టించుకోవడం లేదు. మామూళ్లు వసూళ్లకే టిప్పర్ల సీజ్, కేసులు అన్నట్లుగా జిల్లాలో అధికారుల పరిస్థితి మారిందని, ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

జేబులు నింపుతోన్న నిబంధనలు

రహదారుల భద్రత దృష్ట్యా ఓవర్‌లోడ్ వాహనాలకు ప్రభుత్వం పలు నిబంధనలు తెచ్చింది. అయితే అవి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. ఈ ఓవర్ లోడ్ నిబంధనలు అధికారులకు ఆదాయం సమకూర్చే వనరుగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ బాడీ ఎత్తు పెంచి ఇసుక, కంకర, మట్టి తదితరాలను కుప్పగా పోసి రవాణా చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. స్పీడ్ బ్రేకర్ల వద్ద ఇసుక, మట్టి, కంకర రోడ్లపై పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.



నరసరావుపేటలో ఇసుక ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్



(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఓవర్‌లోడుతో ఇసుక, కంకర, మట్టి టిప్పర్లు దూసుకొస్తున్నాయి. వాహన చోదకులను, పాదచారులను టిప్పర్లు హడలెత్తిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. సాక్షాత్తు పోలీసుస్టేషన్లు, రవాణా శాఖ కార్యాలయాల ఎదుటగానే ఓవర్ లోడ్‌లో టిప్పర్లు, లారీలు రయ్ రయ్ అంటూ దూసుకుపోతున్నాయి. అయినా ఆయా శాఖల అధికారులు వాటివైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. నెలవారీ మామూళ్లు తీసుకుని ఆయా వాహనాలపై చర్యలు తీసుకోకుండా మిన్నకుంటున్నారన్న (మిగతా 4వ పేజీలో)

వాస్తవ దూరంగా.. పరీక్షలు!

- ఆంధ్ర వర్సిటీ దూర విద్య పరీక్షల్లో భారీగా అక్రమాలు
- యథేచ్ఛగా చూచిరాతలు, ఒకరికి బదులు మరొకరు హాజరు
- ప్రశ్నపత్రాలు ఇంటికిచ్చి పంపిస్తున్నవైనం
- అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు

4

ఏపీ టూరిజంను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి

- ఏపీటీడీసీ చైర్మన్ బాలాజి

4

ఆడబిడ్డ నిధి అందేనా



గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే ఆడబిడ్డలకు చేయూత ఇస్తామన్నారు. సూపర్ సిక్స్‌లో మహిళలకు భరోసా ఇచ్చేలా 'ఆడబిడ్డ నిధి' కీలకమైనది. అయితే ఏడాదిన్నరగా ఈ పథకం అమలుపై పాలకులు మీనమేషాలు వేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం అమలు గురించి ఊసే లేకపోవడంపై మహిళల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మహిళా సాధికారత సాధించడానికి వీలుగా ప్రతి కుటుంబంలో 18ఏళ్లు నిండి, 59 ఏళ్లలోపు ఉన్న మహిళలకు ప్రతి నెలా ఆడబిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు.

- ఎన్నికల హామీ అమలుపై మహిళల ఎదురుచూపు
- 18-59 ఏళ్ల వయసున్న వారికి ఊసేలేని రూ.1500 సాయం
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10 లక్షల మంది లబ్ధిదారులు

తిరుగులేని మెజారిటీతో పాలనాపగ్గాలు చేపట్టిన కూటమి నేతలు ఈ పథకం అమలుకు అయ్యే ఖర్చును చూసి పిల్లిమొగ్గలు వేస్తున్నారన్న (మిగతా 4వ పేజీలో)

వైసీపీ పాలనలోనూ టోకరా..

గత వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తానన్న చేయూత పథకాన్ని కూడా అరకొరగా అమలు చేసింది. నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. నాలుగు విడతలుగా ఇస్తానన్న నగదును ఐదేళ్లలో మూడు విడతలే ఇచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేవరకూ వాయిదా వేసి, ఎన్నికల కోడ్ వచ్చాక నిధులు వేశామంటూ గత వైసీపీ ప్రభుత్వం నాటకమాడింది. ఆ నాటకాలను గుర్తించిన ప్రజలు అప్పటి వైసీపీకి తగిన బుద్ధి చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నిధులు వస్తాయని చాలామంది ఆశించారు గానీ.. అదేమీ జరగలేదు. పైపెచ్చు కూటమి ప్రభుత్వం ఇస్తానన్న ఆడబిడ్డ నిధి కూడా రాక పోవడంతో మహిళల్లో ఒకింత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ

చైర్మన్‌గా వందనాదేవి



సీఎం చంద్రబాబుతో వందనాదేవి (పాతచిత్రం)


సత్తెనపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవిని వరించింది. ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన వందనాదేవి 2004 నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నారు. 2019లో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పని చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలో తిరిగి యూనియన్‌ను ఆమె బలోపేతం చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 2023లో జరిగిన ఎంఎల్‌సీ ఎన్నికలకు పర్చూరు నియోజకవర్గ పరిశీలకురాలిగా ఆమె వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకురాలిగా ఉండి రామాంజనేయులు విజయానికి కృషి చేశారు. ఈ క్రమంలో పార్టీకి ఆమె అందించిన సేవలను గుర్తించిన అధిష్ఠానం ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టింది.

నేతలకు కృతజ్ఞతలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నమ్మకాన్ని వమ్ము చేయనని వందనాదేవి తెలిపారు. తనకు పదవి రావడానికి కారకులైన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌తో పాటు ఇతర నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటింగ్ హబ్‌గా అమరావతి

ఏడు క్వాంటం ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం



గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి దేశంలోనే మొట్టమొదటి క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చెందనున్నది. అమరావతి క్వాంటంవ్యాలీలో ఏడు క్వాంటం కంప్యూటింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. దీంతో రూ.కోట్ల పెట్టుబడులు రాజధానికి రానున్నాయి. అలానే వందల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరగనున్నది.

- 2026 జూన్‌లో ప్రారంభించేలా క్యూపీ ఐఏఐ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.47.16 కోట్ల పెట్టుబడి పెట్టి ప్రాజెక్టుని ఏర్పాటు చేయనున్నది. ఈ సంస్థకు మెర్సిడెస్, ఎల్ అండ్‌టీ క్లయింట్‌లుగా ఉన్నాయి. రూ.14.13 కోట్ల ప్రోత్సాహకాలను ప్రభుత్వం కల్పించనున్నది.
- 2026 మేలో ప్రారంభించే క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.
- సైబ్రానెక్స్ టెక్నాలజీస్ అండ్ కన్సల్‌టెన్సీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.9.80 కోట్లతో ఏర్పాటు చేయనున్నది. ఈ సంస్థకు ఐఐటీ జమ్ము, ఐఐఎస్‌ఈఆర్‌ల సహకారం ఉంది.
- రూ.36.50 కోట్లతో క్యూబీట్స్(నోస్ట్రాడామాస్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్) సంస్థ రాజధానిలో ఏర్పాటు కానున్నది. ఈ ప్రాజెక్టు 2028కి ప్రారంభం అవుతుంది. క్వాంటం హార్డ్‌వేర్ అండ్ మెటీరియల్స్ ఫౌండ్రీ, సెన్సార్ల తయారీ, చిప్‌బేస్డ్ లేజర్లను తయారు చేస్తుంది.
- రూ.6.25 కోట్లతో సెంట్రెల్లా సైంటిఫిక్ ప్రైవేటు లిమిటెడ్ ఏర్పాటు కానున్నది. ఈ సంస్థ క్వాంటం డ్రగ్ డిస్కవరీ ల్యాబ్‌ని నెలకొల్పుతుంది. క్యాస్‌కేడ్ ప్లాట్‌ఫాం, క్యాన్సర్, న్యూరాలజీ రంగాల పరిశోధన, హార్వర్డ్, ఐఐటీ హైదరాబాద్‌ల సహకారం లభిస్తుంది.
- 42 టెక్నాలజీస్ ఇన్నోవేట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.9.45 కోట్ల పెట్టుబడి పెడుతుంది.

క్యూ క్లెయిర్‌వోయన్స్ క్వాంటం ల్యాబ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ. 14 కోట్లతో ఏర్పాటు కానున్నది. ప్రభుత్వ డిజిటల్ సేవలకు అత్యాధునిక భద్రత లభిస్తుంది. ఆర్‌బీఐ, డిజిటల్ ఇండియా, ఐబీఎం, మైక్రోసాఫ్టుతో కలిసి పని చేస్తుంది.

సలీంబాషు.. డీఈవోగా బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్ అన్సారియాను కలిసిన డీఈవో సలీంబాషు

గుంటూరు(విద్య), డిసెం బరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎస్‌కే సలీంబాషా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బీఆర్ అంబేద్కర్ జిల్లా నుంచి ఆయన గుంటూరుకు నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం సలీంబాష బాధ్యతలు స్వీకరించగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ తమీమ్‌అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలతో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ డీఈవోకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో యేసురత్నం, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పద్మావతి, ఎంఈవో కుద్దూస్, నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

ఫిరంగిపురం ఏఎంసీకి పాలకవర్గం

- చైర్మన్‌గా తడవర్తి కేశవరావు, వైస్‌చైర్మన్‌గా జానిబేగం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఫిరంగిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. కమిటీకి గౌరవ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ వ్యవహరిస్తారు. ఛైర్మన్‌గా తడవర్తి కేశవరావు, వైస్‌ఛైర్మన్‌గా షేక్ జానిబేగం, సభ్యులుగా గుండిగ జోజప్ప, పెరికల శౌరి, షేక్ షాహెదా, సెగ్గం శ్రీలక్ష్మి, నోసిన స్వప్న, శాఖమూర్తి రామకోటయ్య, సాంబ్రాజ్యం, రాచగిరి ఏడుకొండలు, రామకోటమ్మ, హరికృష్ణ, వెంకటబ్రహ్మారెడ్డి, చేబ్రోలు చైతన్య, బర్కత్‌వలిలను ప్రభుత్వం నియమించింది. కాగా కమిటీలో మందపాడు పీఏసీఎస్ ప్రెసిడెంట్, గుంటూరు వ్యవసాయ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్, రేపూడి సర్పంచ్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి ఉండనున్నారు.

నరసరావుపేట గ్యాంగ్‌తో..

పోలీస్ అధికారుల మిలాఖత్

- ముడుపులు తీసుకుని అక్రమాలకు పూర్తి సహకారం
- చిలకలూరిపేట రోడ్డు ప్రమాదం కేసు విచారణలో వెలుగులోకి..

నేటి నుంచి క్రెడాయ్

ప్రాపర్టీ షో

మూడు రోజుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

అధికారులు డీసీసీబీ

పురోభివృద్ధికి కృషి చేయాలి

- ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

4

అనధికారికంగా.. మార్కెట్



బుడంపాడు బైపాస్ వద్ద అనధికారంగా నడుస్తున్న కూరగాయల హోల్‌సేల్ మార్కెట్

- ఓ నేత ప్రోత్సాహంతో బుడంపాడు బైపాస్‌లో ఏర్పాటు
- మూత పడే దిశలో కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో నగర పాలక సంస్థ పరిధిలో కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉంది. ఇక్కడ వ్యాపారాలకు ఇటీవల జీఎంసీ వేలం కూడా నిర్వహించగా రూ.లక్ష లు వెచ్చించి వ్యాపారులు దుకాణాలు పాడుకున్నారు. అయితే వ్యాపారం చేసుకోవచ్చు అనుకున్న వారు విస్తుపోయేలా.. బుడంపాడు బైపాస్‌లో అనధికారికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు ఓ నేత ప్రోత్సాహం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తనకు ఇష్టం లేకుండా కొల్లి శారద మార్కెట్‌కు వేలం నిర్వహించారని కోపగించుకున్న నేత అనధికార మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. దీంతో శారద మార్కెట్‌లో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు లబోదిబో మంటున్నారు. శారద మార్కెట్‌లో పాటదారులను వ్యాపారాలు చేసుకోనివ్వడంలేదు. పైగా ఈ మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారిపై బుడంపాడు వద్ద మరో ప్రైవేట్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మార్కెట్ నిర్వహణకు జీఎంసీ, మార్కెటింగ్ శాఖల నుంచి అనుమతులు లేవు. అయినా ఇష్టారాజ్యంగా మార్కెట్ నిర్వహిస్తున్నారు.

నేత కక్ష.. వ్యాపారుల పాలిట శాపం

కొల్లి శారద కూరగాయల మార్కెట్‌లో 81 షాపులకు హైకోర్టు ఆదేశాలతో ఇటీవల జీఎంసీ అధికారులు వేలం నిర్వహించారు. సంవత్సరానికి గతంలో 50 లక్షలు వచ్చిన ఆదాయం ప్రస్తుత వేలంతో రూ.6 కోట్లుకు చేరింది. కొన్ని నెలలుగా కక్ష కట్టిన ఓ నాయకుడు లక్షల పోసి పాట పాడుకున్న వారిని మార్కెట్‌లోకి అడుగుపెట్టనీయడం లేదు. వేలం నిర్వహించిన అధికారులు కూడా వ్యాపారుల గోడును పట్టించుకోవడంలేదని సమాచారం. దీంతో శారద మార్కెట్‌పై రాజకీయ క్రీనీడ అలుముకుంది. దీంతో కొల్లి శారద మార్కెట్ మూత పడే దిశకు చేరిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆదాయం కోల్పోతున్నా నగర పాలక సంస్థ అధికారులకు పట్టడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఆక్రమణ.. అనధికార నిర్మాణాలు

- 40 నుంచి 20 అడుగులకు పరిమితమైన లింకురోడ్డు



అక్రమంగా నిర్మిస్తున్న దుకాణాలను కూల్చేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్‌లో అంకిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల నుంచి మిర్చి యార్డు వరకు ఉన్న లింకు రోడ్డు ఆక్రమణలతో కుదించుకుపోతోంది. అనధికార నిర్మాణాలతో గతంలో 40 అడుగులు ఉన్న రోడ్డు ప్రస్తుతం 20 అడుగులకు పరిమితమైంది. ఈ రోడ్డులో కోల్డ్‌స్టోరేజ్‌లు, మిర్చి గోడౌన్లు ఉండగా వాటి వద్దకు రైతులు సరుకులు తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. మిర్చియార్డు వద్ద సీజన్‌లో ఏదైనా ట్రాఫిక్ స్తంభించిపోతే ప్రత్యామ్నాయంగా అంకిరెడ్డిపాలెం నుంచి ఏర్పాటై ఉన్న ఈ రోడ్డుని వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఈ రోడ్డులో ఓ వ్యక్తి అనుమతి తీసుకోకుండా గోడౌన్ నిర్మాణం కోసం షెడ్డు నిర్మిస్తుండగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఒక ఉద్యోగిపై కొంతమంది దాడికి పాల్పడ్డారు.

నేడు మెగా జాబ్ మేళా

పొన్నూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో 30కి పైగా సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన.. 18 నుంచి 35ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువత విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జాబ్ మేళాను ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఇతర వివరాల కోసం 99664 54975 నంబరుకు సంప్రదించాలని సూచించారు. ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సంజీవరావు సూచించారు.

52,010 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,043 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,010 అమ్మకం జరిగినట్టు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,925 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్టు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15400
273	10500	14600
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500
పార్ట్-1	----	----
బ్యాడిగి	10500	16500
దేవనూరు డీలక్స్	11000	16700
ఆర్మూరు	10500	12500

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16700
4884	11500	14300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	16500
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7500

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

పెదకూరపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూత పెట్టు.. పాయింట్ పట్టు అన్న రీతిలో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య పాఠశాలలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల జట్లు ఉత్సాహంగా తలపడ్డాయి. నువ్వా? నేనా? అన్న రీతిలో కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ పోటీలు డే అండ్ నైట్ జరుగుతున్నాయి. రెండవ రోజు కబడ్డీ పోటీల్లో మహిళా విభాగంలో కడప - కర్నూలు, విశాఖపట్నం - శ్రీకాకుళం, వెస్ట్‌గోదావరి - ఎన్‌టీఆర్, అంబేడ్కర్ కోనసీమ - ప్రకాశం జిల్లాల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగంలో విశాఖ - అంబేడ్కర్ కోనసీమ జిల్లాల జట్ల మధ్య ఆట ఉత్కంఠగా సాగింది. పల్నాడు జిల్లా - కర్నూలు జిల్లాల జట్ల పోటీ ఆకట్టుకుంది. వాలీబాల్, బాడ్మింటన్ పోటీలు అలరించాయి. అర్ధరాత్రి కూడా ప్రేక్షకులు క్రీడా పోటీలను వీక్షించేందుకు ఆసక్తి చూపారు. విజేతలను శుక్రవారం రాత్రికి ప్రకటించనున్నారు. ఈ క్రీడా పోటీల్లో 26 జిల్లాల నుంచి ఎనిమిది వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కల్పించకుండా జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం వసతులను సమకూర్చారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.


పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్ జట్ల మధ్య పోటీ

పరుగు పెట్టి..పతకాలు పట్టి..

పిట్టలవానిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అచార్య నాగార్జున యూనివర్సిటీ 48వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగాయి. మొదట బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ క్రీడా జ్యోతిని వెలిగించి జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 45వ, డాక్టర్ డి.ఎస్.రాజు జూనియర్ కళాశాల 29వ క్రీడా వార్షికోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా వార్షికోత్సవాల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 1500 మిక్స్‌డే రిలే 100, 400, షార్ట్‌పుట్, డిస్క్‌త్రో, హర్డిల్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో పాటు వర్సిటీ రెక్టార్ రామినేని శివరామప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డిగ్రీ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు అధ్యక్షత వహించారు. కళాశాల ఉపాధ్యక్షులు మంతెన శివరామరాజు, జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, చినబాబు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుబ్బరాజు పాల్గొన్నారు. 5కే రన్‌లో ప్రజ్ఞా మనోహర్, తిరుపతిరావు, రుస్తుం, 100 మీటర్ల పరుగు పందెంలో నాగ నవీన, కావ్యరెడ్డి, తేజశ్రీ, 1500 మీటర్ల పరుగు పందెంలో లీలా ప్రవలిక, ధనలక్ష్మీ, హేమలత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.


5కే రన్ విజేతలతో ఎమ్మెల్యే వేగేశన తదితరులు

ఏపీ టూరిజంను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి

● ఏపీ టీడీసీ చైర్మన్ బాలాజీ

విజయపురిసౌత్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో నూతన టూరిజం పాలసీతో.. ఏపీ పర్యాటక శాఖను దేశంలోనే నెంబరు వన్ స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. గురువారం టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్‌తో కలిసి ఆయన నాగార్జునసాగర్ లాంచీ స్టేషన్, ఎత్తిపోతలను సందర్శించారు. విజయపురిసౌత్‌లోని బోటింగ్ యూనిట్, హరిత రిసార్ట్‌లో పర్యాటకులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీ టూరిజానికి సంబంధించి రూ.19 వేల కోట్ల పెట్టుబడులతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. సాగర్ లాంచీ స్టేషన్లో రెండు చిన్న బోట్లను త్వరలోనే ప్రవేశపెడతామన్నారు. అనంతరం టూరిజం ఉద్యోగులతో సమావేశం జరిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం ఎస్ఈ ఈశ్వరయ్య, జీఎం నాంచారయ్య, డీవీఎం కృష్ణచైతన్య, జిల్లా టూరిజం ఆఫీసర్ నాయుడమ్మ, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


బోటు షికారులో చైర్మన్ బాలాజీ

నేడు క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

● మూడు రోజుల పాటు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
● వివరాలు వెల్లడించిన క్రెడాయ్ నాయకులు శివారెడ్డి, రాము

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నేటి నుంచి మూడు రోజులపాటు క్రెడాయ్ ప్రాపర్టీ షోను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీ క్రెడాయ్ మాజీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, గుంటూరు ప్రెసిడెంట్ మామిడి రాములు తెలిపారు. గురువారం క్రెడాయ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీలలో క్రెడాయి ప్రాపర్టీ షో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాపర్టీ షోలో ఒకే వేదిక భవన కొనుగోలు, నిర్మాణాలు ఇతర అంశాలకు సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇండియాలోనే రియల్ ఎస్టేట్ రంగంలో అతిపెద్ద సంస్థ క్రెడాయ్ ఆధ్వర్యంలో ఈ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు సిద్ధార్థ గార్డెన్స్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రాపర్టీ షో జరుగుతుందన్నారు. గుంటూరు నగర, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొని ప్రాపర్టీ షోని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశం ఉచితమని తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఒక మొక్కను ఇస్తామని, ప్రతిరోజు గిఫ్ట్ కూపన్లు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి మెట్టు సాంబశివరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వినోద్‌రెడ్డి, గుంటూరు ఉపాధ్యక్షులు శివనాగేశ్వరరావు, ఈసీ సభ్యులు కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రెడాయ్ నాయకులు

పందేనికి సన్నాహకం

● 25 నుంచి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు
●భూమి పూజ చేసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో గల డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు ఘనంగా సంప్రదాయ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. సన్నాహక ఏర్పాట్లకు గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి సంబరాల్లో భాగమైన ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు పోటీలు పల్నాడు ప్రాంతంలో ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఏడాది కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్ల యజమానులు భారీ సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పందేల నిర్వాహకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సన్నాహక ఏర్పాట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 575.20 అడుగులు ఉంది. ఇది 269.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేలు, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,072, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సి ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 50,452 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 15,633 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వాస్తవ దూరంగా..పరీక్షలు!

● ఆంధ్ర వర్సిటీ దూర విద్య పరీక్షల్లో భారీగా అక్రమాలు ● యథేచ్ఛగా చూచిరాతలు, ఒకరికి బదులు మరొకరు హాజరు ● ప్రశ్నపత్రాలు ఇంటికిచ్చి పంపిస్తున్న వైనం ● అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు

గుంటూరు (విద్య)డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చూచిరాతలు ఒకవైపు.. ఒకరికి బదులు మరొకరు పరీక్షకు హాజరు.. ఇంకో వైపు.. ఏకంగా సమాధాన పత్రాలు ఇంటికి తీసుకెళ్లడం.. ఇవీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో.. ఆంధ్ర యూనివర్సిటీ దూరవిద్య పరీక్షల నిర్వహణపై వినిపిస్తున్న ఆరోపణలు. దూరవిద్య తొలి విడత పరీక్షలు గతవారం పూర్తయ్యాయి. రెండో విడత పరీక్షలు ఈ నెల పది నుంచి 13వ తేదీ వరకు జరుగుతున్నాయి. 19 నుంచి మూడో విడత పరీక్షలు జరుగుతాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యలో సైన్స్ కోర్సులు లేకపోవడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని భారీ అక్రమాలకు తెరలేపినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరీక్షల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు, సత్తెనపల్లి తాడికొండ, నంబూరు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల స్టడీ సెంటర్లకే సెల్ఫ్ ఎగ్జామినేషన్ సెంటర్లు కేటాయించారు. దీంతో అక్కడ అక్రమాలు అంతులేవని తెలుస్తోంది.

పేపర్ పట్టుకెళ్లు.. పరీక్ష రాసుకో

దూరవిద్య పరీక్షల్లో ప్రశ్నపత్రాలు ఇంటికి తీసుకెళ్లి.. జవాబులు రాసుకున్నారని.. దీనికి కొంతమంది అధ్యాపకులు వత్తాసు పలుకుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణ లేకపోవడం, తనిఖీ బృందాలు కాసులకు కక్కుర్తి పడడంతో.. యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు కొందరు చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలో భగవంతుడి పేరుతో గల ఓ పరీక్ష కేంద్రంలో చూచిరాతకు రూ.1000 నుంచి రూ.2వేలు, ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తే రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అదే ప్రశ్నపత్రం ఇంటికి తీసుకెళ్లి రాస్తే రూ.3 వేల వరకు చెల్లించేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. గుంటూరు నగరం నడిబొడ్డున ఉన్న ఓ పరీక్ష కేంద్రంలోని లెక్చరర్ 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంటర్ నుంచి ప్రశ్నపత్రాలు తెచ్చి విద్యార్థులకు ఇచ్చి సమాధానాలు రాయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. రాజధానికి అడ్డ రోడ్డులో ఉన్న ఒక సెంటర్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 7:30 గంటల వరకు అభ్యర్థులు పరీక్ష రాస్తున్నట్లు సమాచారం.

పత్తాలేని పరిశీలకులు

పరీక్షల పరిశీలకుల జాడ కనిపించడం లేదు. పరీక్షలు వ్యాపారంగా మారడంతో సిఫార్సులతో పరిశీలకులు ఇక్కడికి వస్తున్నారు. ఒక్కో పరిశీలకుడు రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు చెల్లించి మరీ ఇక్కడ డ్యూటీలు వేయించుకున్నారంటే.. ఇక్కడ అక్రమ ఆదాయం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని సెంటర్లలో.. విద్యార్థి నుంచి రూ.300 నుంచి రూ.500 వరకు దండుకొని కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం గురించి ఆంధ్ర యూనివర్సిటీ పరీక్షల విభాగం కో-ఆర్డినేటర్ ఆచార్య ఎ.నాయుడును సంప్రదించగా ఆయన స్పందించ లేదు.

నరసరావుపేట గ్యాంగ్‌తో..

పోలీస్ అధికారుల మిలాఖత్

● ముడుపులు తీసుకుని అక్రమాలకు పూర్తి సహకారం
● చిలకలూరిపేట రోడ్డు ప్రమాదం కేసు విచారణలో వెలుగులోకి

చిలకలూరిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి బాధ్యులైన ఐదుగురు సభ్యుల గ్యాంగ్‌కు పల్నాడు జిల్లాలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో లభించినట్లు సమాచారం. ఈ గ్యాంగ్ లీడర్ మదమంచి వెంకటనాయుడు ఏఎస్ఐ కుమారుడు కావడంతో అతడి దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రవాణా శాఖ అధికారులమని బెదిరిస్తూ హైవేలపై వాహనాలను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడడంపై.. పోలీసు అధికారులు దృష్టి కేంద్రీకరించడంతో కొత్త విషయాలు బయటపడ్డాయి. ఈ గ్యాంగ్ తమ దందాల ద్వారా వచ్చే మొత్తాల్లో కొంత భాగం తమకు.. సహకరించిన పోలీసు అధికారులకు నిత్యం ముట్టజెప్పినట్లు సమాచారం. గతంలో, ప్రస్తుతం నరసరావుపేటలో ఉన్న కొందరు అధికారుల పాత్ర ఇందులో స్పష్టంగా ఉందని గుర్తించారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థానాల్లో ఉన్న వారికి తరచూ భారీగానే ముడుపులు ఇచ్చి ఈ గ్యాంగ్ దందా కొనసాగించినట్లు సమాచారం. ఒక పోలీసు అధికారి తన సేవా కార్యక్రమాలకు భారీగా విరాళం ఇచ్చినందుకు తన స్వగ్రామంలో ప్రధాన నిందితుడిని సత్కరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఎస్పీ దృష్టికి రాకుండా కింది స్థాయి అధికారులకు.. నిందితులు నిత్యం ముడుపులు ఇచ్చారని సమాచారం. ఈ ఐదుగురు సభ్యుల గ్యాంగ్‌కు మరో ఇద్దరు కూడా సహకరించినట్లు అనుమానిస్తున్నారు. వీరు ఈ గ్యాంగ్‌కు కొత్త కార్లు సరఫరా చేసినట్లు గుర్తించారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. త్వరలోనే బాధ్యులను అరెస్టు చేస్తారని అంటున్నారు.

అధికారులు డీసీసీబీ పురోభివృద్ధికి కృషి చేయాలి

● చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది సమష్టిగా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సూచించారు. బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం బ్యాంకు జిల్లాస్థాయి సాధికారిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, అంతర్గత వ్యవహారాలతో పాటు సిబ్బంది బదిలీలపై చర్చించారు. సీఈవో ఫణికుమార్, డీసీవో వీరాచారి పాల్గొన్నారు.

'ఆడబిడ్డ నిధి' అందేనా

(3వ పేజీ తరువాయి)

విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం పేరుతో డ్వాక్రా సంఘాల్లోని 40 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిని మించిన స్థాయిలో కూటమి పార్టీలు సూపర్ సిక్స్‌లో 'ఆడబిడ్డ నిధి' ఇస్తామని హామీ ఇచ్చాయి. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళా ఈ పథకం పరిధిలోకి వచ్చే వీలుండడంతో గతంలో చేయూత లబ్ధిదారుల కంటే వీరి సంఖ్య ఇంకో మూడు రెట్లు అధికంగా ఉంటుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 70వేల డ్వాక్రా గ్రూపులు, 7 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ దాదాపు 18ఏళ్లు పైబడినవారే. వీరితోపాటు మరింత మంది ఈ పథకం పరిధిలోకి వస్తారు. మొత్తంగా చూస్తే పది లక్షల మంది లబ్ధిదారులు ఉండే అవకాశం ఉందని సమాచారం. వీరందరికీ నెలకు 1500 చొప్పున ఇవ్వాలంటే నెలకు 150 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో పథకం అమలు చేయడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

టిప్పర్లు.. టెర్రర్

(3వ పేజీ తరువాయి)

విమర్శలున్నాయి. ఒక్కొక్క లారీ 40 టన్నుల లోడుతో వెళ్తుండటంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. అయినా రహదారి భద్రత, రవాణా శాఖలు పట్టించుకోవడంలేదు. టిప్పర్లు, లారీల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడంలేదు. తూతూమంత్రంగా కేసులతో సరిపెడుతున్నారే కానీ కఠిన చర్యలు తీసుకోవడంలేదు. ఓవర్ లోడ్‌తో వందలాది టిప్పర్లు రహదారులపై ప్రయాణిస్తుంటే నామమాత్రం చర్యలు కూడా ఉండటంలేదు. వీటిని నియంత్రించడంలో రవాణా.. పోలీసు శాఖలు ఘోరంగా విఫలమవుతున్నాయి. టిప్పర్‌కు అనుమతించిన బరువు 10 టన్నులు కాగా 18 టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చు. ఆధునిక ఫీచర్లతో వచ్చిన వాహన బరువే 11 టన్నులకుపైగా ఉంటుంది. వాటిలో 30 నుంచి 40 టన్నుల వరకు ఇసుక.. కంకర, మట్టి వంటి మెటీరియల్‌ను రవాణా చేస్తున్నారు.

పగిలిపోతున్న రహదారులు

రహదారుల సామర్థ్యానికి మించి బరువైన లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారులు దెబ్బతింటున్నాయి. రోడ్లు పగిలిపోయి గోతులు ఏర్పడుతున్నాయి. గ్రామాలకు కూడా ఓవర్ లోడ్‌తో లారీలు వెళ్తుండటంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. రహదారులకు ప్యాచ్‌లు వేస్తున్నా అవి నిలవడంలేదు. ఓవర్ లోడ్ లారీల కారణంగా ఏటా రూ.కోట్లలో రహదారులకు నష్టం వాటిల్లుతున్నట్లు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల శాఖల అధికారులు చెప్తున్నారు. రోడ్డు నిర్మాణంలోనే ఎంత బరువు వాహనాలు రాకపోకలు చేస్తాయనే అంచనాతో డిజైన్ చేస్తారు. కొన్ని రోడ్లను 20 నుంచి 30 టన్నుల వాహనాలు ప్రయాణించే రీతిలో నిర్మిస్తారు. ఇటువంటి రహదారుల్లో 40 టన్నుల లోడ్‌తో లారీలు వెళ్తుండటంతో అవి పగిలిపోతున్నాయి. వర్షాలు కురిసే సమయంలో ఓవర్ లోడ్ లారీల వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. గోతులు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తున్నా అవి మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి.

ఆర్‌టీఐహెచ్‌లో ఇన్నో-ఎక్స్‌ఆర్ ల్యాబ్ ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్, యానిమేషన్, వర్చువల్ రియాలిటీ వేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో రాష్ట్ర యువతకు సరైన శిక్షణ, నైపుణ్యాలు అందించడం అవసరమని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ధాత్రి రెడ్డి అన్నారు. మంగళగిరిలోని ఆర్‌టీఐహెచ్‌లో ఇన్నో-ఎక్స్‌ఆర్ ల్యాబ్‌ని గురువారం ఆమె ప్రారంభించారు. సీఈవో మాట్లాడుతూ ఏవీజీసీ - ఎక్స్‌ఆర్ రంగం ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందన్నారు. సొంత ప్రాజెక్టులు అభివృద్ధి చేసుకునేందుకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. ఎక్స్‌ప్లోరేటరీ బూట్ క్యాంపుని ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరినా యానిమేషన్ డైరెక్టర్ శ్రీనివాస్ శ్రీభక్త పాల్గొన్నారు.


ఆర్‌టీఐహెచ్‌లో ఇన్నో-ఎక్స్‌ఆర్ ల్యాబ్‌ని ప్రారంభిస్తోన్న సీఈవో ధాత్రిరెడ్డి

విశ్రాంత ఏఎస్ఐపై కేసు నమోదు

తాడికొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాధితులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారని విచారణలో తేలడంతో.. విశ్రాంత ఏఎస్ఐ పొలరాజుపై తాడికొండ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ కె.వాసు వివరాల మేరకు.. ఈడే మురళీకృష్ణ, అద్దంకి కృష్ణ, యర్రంశెట్టి రవి అనే ముగ్గురు తనను కులం పేరుతో దూషించారని, రేకుల షెడ్డును కూల్చేశారని పొలరాజు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. విచారణలో భాగంగా.. పొలరాజును, ఈడే మురళికృష్ణను స్టేషన్‌కు పిలిపించి విచారించగా.. మురళికృష్ణ ఎవరో తనకు తెలియదని పొలరాజు చెప్పడంతో.. సీఐ అవాక్కయ్యారు. విశ్రాంత ఏఎస్ఐ ఫిర్యాదులో వాస్తవం లేదని తేలడంతో.. బాధితులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు.. పొలరాజుపై కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన కేసులో నిందితుడైన బస్సు డ్రైవర్ కమ్మిలి వెంకట శివన్నారాయణకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధించింది. గుంటూరు ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఒకటో డిపో గ్యారేజ్ వద్ద 2019 జనవరిలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ చేసిన కోర్టు తప్పు తేలడంతో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధించింది.


స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

శోభాయమానంగా సీతారాముల పట్టాభిషేకం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీరామనామక్షేత్రంలో 99వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం విశ్వక్సేన ఆరాధన, కలశారాధన హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో సీతారామ లక్ష్మణులకు అభిషేకాలు జరిపారు. తిరుమంజన సేవ వేద మంత్రాల నడుమ శ్రీరామచంద్ర పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం, 108 కలశాలతో అభిషేకం, తిరుమంజనం కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను రాగం వెంకట లీలా సుందరి, మస్తానరావు తదితరులు పర్యవేక్షించారు.

ఫుట్‌బాల్‌లో డీపీఎస్ విద్యార్థి అద్భుత ప్రతిభ


విద్యార్థి సుభాష్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ 69వ రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో అమరావతి రోడ్డులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సుభాష్ అద్భుత ప్రతిభ ప్రదర్శించాడు. ఈ నెల 7 నుంచి 9వ తేదీల్లో నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11వ తరగతి చదువుతున్న విద్యార్థి జి.సుభాష్ అత్యుత్తమ క్రీడాస్ఫూర్తి, నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరియాణ పానిపట్‌లో జరగబోయే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావటంపై స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

ఇకపై ప్రతి రోజు అర్జీల స్వీకరణ

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలోని రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఇకపై ప్రతి రోజూ రైతుల సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామని సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసెప్షన్ కౌంటర్ వద్ద పనిదినాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతుల అర్జీలను తీసుకుంటామని తెలిపింది. ఆన్‌లైన్‌లో కూడా అర్జీల నమోదుకు అవకాశం ఉందని ప్రకటించింది.

జాబ్‌మేళాను సద్వినియోగించుకోవాలి

● ఎంపీడీవో లక్ష్మీదేవి

పెదనందిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్డీయే, సీడాప్, స్కిల్ డెవలప్‌మెంట్ గుంటూరు వారి సహకారంతో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మండలపరిధిలోని నిరుద్యోగ యువత 65మంది హాజరు కాగా 50మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిలో అర్హులైన వారిని గుర్తించి మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని కోఆర్డినేటర్ వీరాస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు, గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, జంపని హనుమంతరావు, కోటప్పకొండ, బుర్రిపాలెం శిక్షణా కేంద్ర నిర్వాహకులు రామకోటేశ్వరరావు, రమేష్‌బాబు, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌బాబు, డీఆర్డీయే అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు బాల్య వివాహ రహిత జిల్లా కావాలి

● కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు

గుంటూరు సిటీ, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బాల్య వివాహ రహిత జిల్లాగా ఆవిష్కృతం కావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు. బాల్య వివాహ ముక్త్ భారత్ (బీవీఎంబీ) వంద రోజుల ప్రచార కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వంద రోజుల ప్రచార పర్వంలో షెడ్యూల్‌ను పక్కాగా తయారు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞను చేశారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి, గుంటూరు నగర పాలక సంస్థ ఉప కమిషనర్ శ్రీనివాసరావు, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, కార్మికశాఖ ఉప కమిషనర్ ఏ.గాయత్రి దేవి, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలి

● ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ జి.సునీత

గుంటూరు (విద్య) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా కళాశాల యాజమాన్యాలు కృషి చేయాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో గర్నేపూడి సునీత సూచించారు. స్థానిక టీజేపీఎస్ కళాశాలలో గురువారం జరిగిన మెగా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో ఉండే క్రీడానైపుణ్యాలను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం ప్రిన్సిపాల్ కామేశ్వర శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు.


మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీ సునీత, హాజరైన విద్యార్థులు

కంపోస్ట్ యూనిట్ల బాధ్యత కార్యదర్శులదే

● కమిషనర్ పులి శ్రీనివాసులు


కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని అపార్టుమెంట్లు, గ్రూప్ ఇళ్లలో పర్యావరణహితంగా క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, మధురా నగర్, స్తంభాలగరువు ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు హోం క్లస్టర్ కంపోస్ట్‌పై ప్రజారోగ్య అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే ఐటీసీ వారి సహకారం తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరు నాటికి ప్రతి సచివాలయం పరిధిలో కనీసం 50 ఇళ్లల్లో హోం కంపోస్ట్, 10 అపార్టుమెంట్లలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. హోం, క్లస్టర్ కంపోస్ట్‌ల ద్వారా వచ్చిన ఎరువును ఆయా పరిసరాల్లోని మొక్కలకు వినియోగించుకున్న తర్వాత మిగిలిన దానిని జీఎంసీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యల పై తగు ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వీధి లైట్ల ఏర్పాటు పనులను వారంలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారీగా జరుగుతున్న సమగ్ర సర్వేకు నగర ప్రజలు తగిన సమాచారం అందించి సహకరించాలని, నోడల్ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు.

ఐవీఎఫ్ విధానంలో.. ఒంగోలు, గిర్ వంటి స్వదేశీ పశు జాతుల అభివృద్ధి

● డాక్టర్ ముత్తారావు కృషితో ఎల్లలు దాటిన దేశకీర్తి
● శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ రమణ

గుంటూరు సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు, గిర్ వంటి స్వదేశీ పశుజాతుల అభివృద్ధి కోసం ఐవీఎఫ్ విధానంలో పిండాలను ఉత్పత్తి చేస్తున్నట్టు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జే వీ రమణ వెల్లడించారు. ఇటువంటి ఐవీఎఫ్ ప్రక్రియ అందుబాటులోకి తెచ్చేందుకు నిరంతరం కృషి చేసిన లాం పరిశోధనా స్థానం అధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎం ముత్తారావు ఇక్కడ పుట్టటం ఈ దేశం చేసుకున్న పుణ్యమని అన్నారు. పశు సంపద సృష్టి, అభివృద్ధిలో డాక్టర్ ముత్తారావు కృషి వల్లే దేశం ఖ్యాతి ఎల్లలు దాటిందని అన్నారు. గురువారం గుంటూరు సమీపంలోని లాం ఫాంలో పశువులలో 'పిండోత్పత్తి, పిండమార్పిడి'పై జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఆరంభమయింది. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జేవీ రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ముత్తారావు మాట్లాడుతూ ఇది లాంఫాంలోని పరిశోధనాస్థానంలో నిర్వహిస్తున్న రెండో జాతీయశిక్షణ కార్యక్రమం అన్నారు. లాం పశుపరిశోధనా స్థానాన్ని భారతప్రభుత్వ ఆధ్వర్యంలోని రాష్ట్రీయ గోకుల్ మిషన్ దేశంలోని ప్రముఖ బోవైన్ ఐవీఎఫ్ ప్రయోగశాలలలో ఒకటిగా గుర్తించిందన్నారు. అందువల్లే దేశవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలకు ఈ ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇవ్వాలనే బాధ్యతను ఈ పరిశోధనా స్థానానికి అప్పగించారని తెలిపారు. లాం పరిశోధనా స్థానం ఎంబ్రియో బయోటెక్నాలజీ ల్యాబ్ అత్యాధునిక మౌలిక వసతులతో, ప్రస్తుతం ఒంగోలు, గిర్ వంటి స్వదేశీ జాతుల అభివృద్ధి కోసం ఐవీఎఫ్ పిండాలను ఉత్పత్తి చేస్తుందని డాక్టర్ ముత్తారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ శ్రీలత, రిజిస్ట్రార్ ఆర్ విను, ఆంధ్ర ప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈకో టూరిజం) డాక్టర్ నందని సలారియా, ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈఓ ఎం. శ్రీనివాసరావు, పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎన్ ఆర్ శ్రీకాంత్, కె రవిచంద్ర, కె సన్నీ ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ రమణ, డాక్టర్ ముత్తారావు, డాక్టర్ నందని సలారియా తదితరులు

పీ-ఫోర్‌లో మార్గదర్శిగా వికాస్ హాస్పిటల్స్

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మానసపుత్రిక పీ-ఫోర్ కార్యక్రమంలో మార్గదర్శిగా ఉన్న వికాస్ హాస్పిటల్స్ చొరవ, కృషి అభినందనీయమని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా గుజ్జనగుండ్లలోని రామిశెట్టి రామారావు నగరపాలక ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెం.106వ సచివాలయం ద్వారా 1900 బంగారు కుటుంబాలకు వికాస్ హాస్పిటల్స్ మార్గదర్శులుగా ముందుకు వచ్చి, పరీక్షలు, మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో విద్య, ఉపాధి, మౌలిక వసతులు వంటి ప్రతి రంగంలో మార్గదర్శుల భాగస్వామ్యం పెరిగేలా చూడడం ద్వారా పీ-4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సమన్వయం చేసిన నోడల్ ఆఫీసర్‌కు, నాయకులకు, కార్పొరేటర్లకు, వికాస్ హాస్పిటల్ సీఈవో, డాక్టర్లు, నర్సులు, సిబ్బందికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి

రైల్వేస్టేషన్‌లో సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం


500 కేడబ్ల్యూపీ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించి వివరాలు తెలుసుకుంటున్న డీఆర్ఎం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించే క్రమంలో గుంటూరు రైల్వేడివిజన్ 500 కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్‌ను రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసింది. గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ ప్రారంభించి ఆ ప్లాంట్ వివరాలను ఎలక్ట్రికల్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఇది ఆన్-గ్రిడ్ సోలార్ పవర్ ప్లాంట్‌గా డీఆర్ఎం పేర్కొన్నారు. ఈ రూఫ్ టాప్ ప్లాంట్ ఏడాదికి 8 లక్షల 10 వేల యూనిట్లను ఉత్పత్తి చేస్తుందన్నారు. దీని వల్ల ఏటా రూ. 61.96 లక్షల విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని చెప్పారు. దీంతో పాటు అదనంగా మరో 600 కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్‌ను కూడా ప్రతిపాదించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ ఎలక్ట్రికల్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో డబ్బు.. సమయం ఆదా

తుళ్లూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13న నిర్వహించే లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర న్యాయసేవాధికర సంస్థ సభ్యకార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ తో న్యాయస్థానాల్లో పెడింగ్‌లో ఉన్న ఆస్తి తగాదాలు, సివిల్ తగదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, రాజీపడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలు లేదని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడిన సివిల్ తగాదాలలో కోర్టు ఫీజు తిరిగి కక్షిదారులకు అందుతుందని ఆమె వివరించారు. కేసుల రాజీ ద్వారా డబ్బు సమయం ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు తమ దగ్గరలోని కోర్టు ఆవరణలో గల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఈ జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసు లను పరిష్కరించుకోవాలని ప్రకటనలో కోరారు.


ఆటోను ఢీకొట్టిన లారీ : మహిళ మృతి

తాడికొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ఆటోను లారీ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని లాం గ్రామంలో గురువారం జరి గింది. అడ్డరోడ్డు ఉంచి జొన్నలగడ్డకు ఆటో లో ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను.. ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో పక్కనే ఉన్న క్వారీ గుంతలోకి ఆటో తో సహ లారీ దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న ఇక్కుర్తి ఉమాదేవి(55) అనే మహిళ అక్క డిక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్, మరో నలుగురికి తీవ్రగాయాల య్యాయి. గ్రామస్థులు క్షతగాత్రులను బయటకు తీసి, 108కు సమాచారం అందించారు. వారిని జీజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ అక్కడ నుంచి పారిపోయాడు. పోలీసులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది క్వారీ గుంతలో పడిన లారీ, ఆటో ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు.

రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


సాయి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి..

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫారాలకు రక్షణ లేకుండా పోయింది. ప్రధాన రహదారుల పక్కనే ఉన్న ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు అత్యంత ప్రమాదభరితంగా ఉంటున్నాయి. ఆదమరిస్తే ఎంత ప్రమా దం పొంచి ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలో ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫారాలకు రక్షణగా చుట్టూ ఫెన్సింగ్ లేదా గోడ నిర్మాణం చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.


శ్యామల నగర్‌లో..


రాజేంద్ర నగర్లో..


రాజ రాజేశ్వరి నగర్‌లో..

ప్రభుత్వ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందాలి

● సీఎస్ విజయానంద్


సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ సేవను పారదర్శకంగా ప్రజలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. గురువారం పెన్షన్లు, రేషన్ పంపిణీ, రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, ఆర్టీసీ, ధాన్యం సేకరణ తదితర ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయి అంశాలపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ, పెన్షన్లు, రేషన్ పంపిణీ, రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్య సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా అధికారులు పనిచేయాలన్నారు. లబ్ధిదారులపై సిబ్బంది మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ప్రజల సంతృప్తి మేరకు సేవలు అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌లలో పరిశుభ్రత మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రయాణికులకు మంచి సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెలుగుదనం మూర్తీభవించిన కవి తుమ్మల


డాక్టర్ ఏల్చూరి మురళీధరరావుకు తుమ్మల పురస్కారాన్ని అందజేస్తున్న సాహితీవేత్తలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుమ్మల సీతారామమూర్తి కవిత్వంతో గ్రామీణ జీవిత, ఆంధ్రత్వ, భారతీయత్వం, విశ్వామానవత్వ లక్షణాలు గోచరిస్తాయని పలువురు సాహితీ వేత్తలు, కవులు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై తుమ్మల కళాపీఠం ఆధ్వర్యంలో తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి 23వ పురస్కార సభ ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ ఏల్చూరి మురళీధరరావుకు తుమ్మల కళాపీఠం పురస్కారం, రూ 25 వేల నగదు అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాహితీవేత్తలు మాట్లాడుతూ తుమ్మల వారి సమగ్ర సాహిత్యాన్ని మరోమారు ప్రజలకు అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సభలో డాక్టర్ ఏల్చూరి, సంస్థ కార్యదర్శి సూర్యదేవర రవికుమార్, అప్పాజోస్యుల సత్యనారాయణ, అక్కిరాజు సుందరరామకృష్ణ, ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, వెన్నిశెట్టి సింగారావు, డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, పారా అశోక్, ముత్తేవి, భూసురపల్లి, నాగరాజ్యలక్ష్మి, నాగసుశీల, దేశం పాపిరెడ్డి, బొల్లేపల్లి సత్యనారాయణ, నూతలపాటి తిరుపతయ్య, ప్రొఫెసర్ మస్తాన్, సుఖవాసి మొదలైన సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

14న సోమేపల్లి పురస్కారాల ప్రదానం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి చిన్న కథల పోటీలలో విజేతలైన వారికి 16వ సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 14న జరగనుందని సోమేపల్లి పురస్కార కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రమ్యభారతి ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో గల అన్నమయ్య గ్రంథాలయ మీటింగ్‌హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ప్రముఖ సాహితీవేత్త వేముల హజరత్తయ్యగుప్త అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్ ముఖ్య అతిథిగా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు చిల్లర భవానీదేవి, ప్రముఖ రచయిత శ్రీకంఠస్ఫూర్తి, వెంటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారన్నారు.

ఇద్వా మహానగర్ వాసులకు న్యాయం అందాలి

● డీఆర్వో ఖాజావలికి వినతి


డీఆర్వో ఖాజావలికి వినతి పత్రం అందజేస్తున్న గోళ్లమూడి రాజాసుందరం బాబు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం జరిగిన దాడుల ఫలితంగా సర్వస్వం కోల్పోయిన స్వర్ణభారతి నగర్ సమీపంలోని అంబేడ్కర్ ఇద్వా మహానగర్ బాధితులకు న్యాయం చేయాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరం బాబు డీఆర్వో ఖాజావలీని కోరారు. గురువారం బాధితులతో కలిసి కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఆయనకు వినతి పత్రం అందజేశారు. నాటి దాడుల కారణాంగా 400 నివాసాలు లూటీలకు గురయ్యాయని, చివరకు కలపను కూడా అక్రమణదారులు అమ్ముకున్నారని డీఆర్వో దృష్టికి తీసుకొచ్చారు. ఆ తరువాత ఖాళీ స్థలాలను వేరే వారికి అమ్మేశారని అన్నారు. నివాసాలు కోల్పోయిన బాధితులకు ఐదు సెంట్ల స్థలం ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం, హైకోర్టు తీర్పును నేటి వరకు అమలు చేయలేదన్నారు. తొలుత ఇద్వా సభ్యులు, బాధితులు అంకమ్మనగర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఇద్వా సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు బేతపూడి భారతి, కాగితా కోటిరత్నం, ఇసుకపల్లి సుందరమ్మ, చల్ల సత్యవతి, గుడిపూడి పద్మ తదితరులు ఉన్నారు.


వచ్చే ఏడాది సెలవుల లిస్టు విడుదల

గుంటూరు (తూర్పు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2026 సంవత్సరంలో వేతనంతో కూడిన సెలవు దినాలను ప్రకటిస్తూ గుంటూరు జోన్ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ సీహెచ్.ఆషారాణి ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 26, మే 1, ఆగస్టు 15, అక్టోబరు 2, నవంబరు 1, పండుగ సెలవులు జనవరి 16న కనుమ, మార్చి 20న రంజాన్, అక్టోబరు 20న దసరా, డిసెంబరు 25న క్రిస్మస్ పండుగలలో కార్మికులకు వేతనంతో కూడిన సెలవు దినాలను ప్రకటిస్తూ నిర్ణయించినట్లు తెలిపారు.

మాలల హక్కుల పరిరక్షణే సమితి ధ్యేయం

● రాష్ట్ర అధ్యక్షుడు బుస్సా రత్న ప్రసాద్

గుంటూరు (విద్య) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల కోసం పరిరక్షణ సమితి కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు బుస్సా రత్న ప్రసాద్ అన్నారు. ఏసీ కళాశాలలో గురువారం నిర్వహించిన మాలల హక్కుల పరిరక్షణ సదస్సుకు రత్న ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాల సమాజ అభ్యున్నతికి సంస్థలు, సంఘాల ముఖ్య నాయకులు, సమాజసేవకులు, సామాజిక కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అశాస్త్రీయమైన వర్గీకరణ, నూతన రోస్టర్ విధానం వల్ల మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు లేకుండా ప్రభుత్వం చేయటం శోచనీయమని పేర్కొన్నారు. సదస్సులో మాలల హక్కుల బలోపేతం, సామాజిక ఆర్థిక పురోగతి, విద్య ఉద్యోగ అవకాశాలు, కొత్త తరం మాల యువత శిక్షణ అంశాలపై చర్చలు నిర్వహించారు. మాల యువతకు శిక్షణ, కోచింగ్, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న బుస్సా రత్న ప్రసాద్

మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మృతి

▸▸ అనుమలవీడులో నేడు అంత్యక్రియలు



పిడతల రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గిద్దలూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి (89) కన్నుమూశారు. ఆయన టీడీపీ తరఫున 1994లో గిద్దలూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి వైసీపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. రాంభూపాల్‌రెడ్డి మృతదేహాన్ని గురువారం రాత్రికి గిద్దలూరులోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. రాచర్ల మండలంలోని స్వగ్రామమైన అనుమలవీడులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రాంభూపాల్‌రెడ్డి 1972లో గిద్దలూరు కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1975 నుంచి 1978 వరకు కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ అధ్యక్షునిగా, 1985 వరకు కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్, కోఆపరేటివ్ ల్యాండ్ మార్ట్‌గేజ్ బ్యాంక్‌లలో డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరి 1987-92 మధ్య రాచర్ల ఎంపీపీగా పనిచేశారు. 1994-99 మధ్యలో గిద్దలూరు ఎమ్మెల్యేగా పనిచేశారు.

నకిలీ మద్యం కేసులో మరొకరు అరెస్టు

▸▸ మూతలు సరఫరా చేసిన వ్యక్తి జైలుకు

విజయవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం సీసాలకు మూతలు సరఫరా చేసిన మరో నిందితుడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. దారబోయిన ప్రసాద్ (ఏ-23)ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని విజయవాడ ఆరో అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి ఈ నెల 24 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం అతడిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులోని నకిలీ మద్యం తయారీ కేంద్రాలకు ప్రసాద్ హైదరాబాద్ నుంచి వివిధ నకిలీ బ్రాండ్ల పేర్లను ముద్రించి మూతలను సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు మద్యం నింపడానికి అవసరమైన సీసాలను గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన డి. శ్రీనివాసరెడ్డి నుంచి కొనుగోలు చేశారు. విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ముతా మనోజ్ నుంచి సుమారు8 లక్షల సీసాలు, మూతలను కొనుగోలు చేశారు. వీరిలో శ్రీనివాసరెడ్డి రిమాండ్ ఖైదీగా ఉండగా, ముతా మనోజ్ ఉపశమనం కోసం హైకోర్టును ఆశ్రయించారు.

సత్యవర్ధన్ కేసులో ఆ ఇద్దర్నీ కస్టడీకి ఇవ్వండి

విజయవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఎర్రంశెట్టి రామాంజనేయులు, కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లును కస్టడీకి ఇవ్వాలని విజయవాడ పటమట పోలీసులు ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. రామాంజనేయులును మూడు రోజులు, కోట్లును రెండు రోజులు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

సంజయ్ బెయిల్‌పై 15న తీర్పు

అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ బెయిల్‌పై ఏసీబీ కోర్టు 15 తీర్పు ఇవ్వనుంది. ఇప్పటికే పలుమార్లు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది. తాజాగా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదప్రతివాదనలు ముగిశాయి. దీనిపై తీర్పును 15వ తేదీకి వాయిదా వేశారు.

ఫైలు కదలాలంటే పైసలివ్వాల్సిందే!

వామ్మో... రవాణా మంత్రి పేషీ

▸▸ సీఎం చెప్పినా ముడుపులు ఇవ్వాల్సిందే

▸▸ శాఖను పట్టించుకోని మంత్రి మండిపల్లి

▸▸ ఫైళ్ల క్లియరెన్స్‌లో ఆయనకు చివరి ర్యాంకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'మా మంత్రి పేషీలో ఫైలు కన్నా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు ఎంతో వేగంగా కదులుతాయి.. ఆర్టీసీ సిబ్బంది పదోన్నతులపై సీఎం ఆదేశించినా నెలల తరబడి ఆపేసి ముడుపులు వసూలు చేశాకే ఫైలు కదిపిన ఘనత మా మంత్రిగారి పేషీదే.. ప్రతి పనికీ ఎంతోకొంత చెల్లించాల్సిందే.. లేదంటే ఏ ఫైలు అయినా ముందుకు కదలదు'.. అంటూ ఏపీఎ‌స్‌ఆర్టీసీ హౌస్‌లో సిబ్బంది, అధికారులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. రవాణా శాఖలో పనిచేసే వారి పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. 'ఆదాయం వస్తుందిగా.. తెచ్చివ్వండి' అని పేషీలో డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిన వెంటనే కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా చర్యలు తీసుకుంటున్నారు. అడ్డూ అదుపూ లేకుండా దండుకుంటున్న కొందరు రవాణా అధికారులపై ఏకంగా రవాణా కమిషనరేట్ నుంచే ఏసీబీకి వివరాలు వెళ్లాయని తెలుస్తోంది. 'లంచం తీసుకుంటే కమిషనర్‌తో సమస్య.. లంచం తీసుకోలేదు, వాటా ఇవ్వలేమంటే మంత్రి పేషీలో కుదరదు' అంటూ వాపోతున్నారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి శాఖా పరమైన పనితీరులో అందరు మంత్రుల కన్నా అట్టడుగున ఉండటంపై సీఎం చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో సీరియస్ అయ్యారు. గురువారం పత్రికల్లో వార్తలు చూసిన ఆర్టీసీ, రవాణా సిబ్బంది తమ అనుభవాలను బహిరంగంగా చెబుతున్నారు. రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన రామ్‌ప్రసాద్ రెడ్డికి చిన్న వయసులోనే రవాణా మంత్రిగా అవకాశం లభించింది. ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయలు ఆర్జించి పెట్టే కీలకమైన రవాణా శాఖను ఆయన పూర్తిగా వదిలేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఏడాదిన్నరలో రవాణా శాఖపై ఒక్కసారి మాత్రమే సమీక్షించిన మంత్రి.. ఆర్టీసీపై రెండుసార్లు మాత్రమే అధికారులతో సమావేశమయ్యారు. హైదరాబాద్, బెంగళూరులలో వ్యాపారాలు, నియోజకవర్గంలో వ్యవహారాలతోనే ఆయన తలమునకలై ఉన్నారు.

ఆ ఇద్దరే కీలకం

మంత్రి పేషీలో అధికారిక ఓఎస్డీగా ఆర్టీసీ అధికారి విశ్వనాథ్ నియమితులయ్యారు. రిటైర్డ్ ఈడీ కోటేశ్వరరావును అడిషనల్ ఓఎస్డీగా మంత్రి నియమించుకున్నారు. నీటిపారుదల శాఖ ఉద్యోగి చైతన్యను పీఎస్‌గా తీసుకున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ ఎమ్మెల్యే(మాజీ మంత్రి) సిఫారసు మేరకు ఇటీవల మరో వ్యక్తిని తీసుకున్నా ఇప్పటి వరకూ అధికారికంగా ఆదేశాలివ్వలేదు. రవాణా, ఆర్టీసీతో పాటు క్రీడలు, యువజన సర్వీసులకు సంబంధించిన ఫైళ్లన్నీ ఇక్కడి నుంచే కదలాలి. ఈ-ఫైళ్లు చూసే అధికారం ఉన్న అధికారి వాటిని పట్టించుకోవట్లేదు. ఇదే అవకాశంగా మరో సీట్లో ఉన్న వ్యక్తి ఈ-ఫైళ్లు తాను చూస్తానని మంత్రి అనుమతి తీసుకున్నారు. తన సంగతేంటని ఇంకో ఉద్యోగి అడగటంతో.. ఈ-ఫైలు మీ ఇద్దరిలో ఎవరు చూసినా మరొకరికి ఓటీపీ వచ్చేలా పని చేసుకోమని మంత్రి అనుమతిచ్చారు. పదోన్నతులు, పనిష్మెంట్లు, వినతులకు సంబంధించిన ఫైళ్లు ఏవి వచ్చినా ముందుకు కదలవు. బేరం కుదిరేదాకా జాప్యం చేస్తున్నారు. అవసరమున్నవారు ఎంతో కొంత ముట్టజెప్పి పని చేయించుకుంటున్నారు. రవాణా శాఖలో పనులైతే లక్షల్లో, ఆర్టీసీలో ఫైళ్లయితే వేలల్లో ఇవ్వాలని విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో చర్చించుకుంటున్నారు. ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్లతో పాటు ఎంవీఐల తోనూ పేషీ ఖర్చులంటూ వసూలు చేస్తున్నట్టు సమాచారం. యువజన సర్వీసులకు సంబంధించి ఉత్తరాంధ్రకు చెందిన ఒక మహిళా అధికారి డిప్యుటేషన్‌పై వచ్చేందుకు అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి సిఫారసుతో దరఖాస్తు చేసుకున్నారు. పైసా ఆదాయం లేని ఆ పోస్టు కోసం ఆమె నెలల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. చివరికి ముడుపులు చెల్లించుకున్నాకే ఫైలు క్లియరైందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రవాణా శాఖలో ఒక అధికారి పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) కోసం భారీగా ముట్టజెప్పినట్లు చర్చ జరుగుతోంది. ఇలాంటి వారిని పేషీ నుంచి బయటికి పంపకపోతే ఆ తప్పులకు మంత్రి బాధ్యత వహించే పరిస్థితి ఎంతో దూరంలో లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

లేడీడాన్ అరుణపై పీడీ యాక్ట్



నెల్లూరు (క్రైం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరుజిల్లాకు చెందిన లేడీడాన్ అరుణపై పోలీసు అధికారులు పీడీ (ప్రివెంటివ్ డిటెన్షన్) యాక్ట్ నమోదు చేశారు. కోవూరు మండలం పెద్ద పడుగుపాడు గ్రామం కేఆర్ఆర్ నగర్‌కు చెందిన అరుణ గత ప్రభుత్వంలో అనేక నేరాలకు పాల్పడింది. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయంపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలతో అరుణ నేర సామ్రాజ్యం వెలుగులోకి వచ్చింది. అరుణ చేసిన నేరాలపై కోవూరు, నవాబుపేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్లతో పాటు విజయవాడలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసు నమోదైంది. కోవూరు పోలీసులు అరుణపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఇంత నేరచరిత్ర కలిగిన అరుణపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఎస్పీ అజిత వేజెండ్ల ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కోవూరు పోలీసులు అరుణపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ప్రస్తుతం నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా నెల్లూరులోని ఇద్దరు రౌడీషీటర్లు ఎస్ జయప్రకాశ్, షేక్ షాహుల్ హమీద్‌లపైనా పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేశారు. వీరిద్దరిని నెల్లూరు నుంచి కడప కేంద్ర కారాగారానికి తరలించారు.



పల్నాడు జిల్లాలోని మాచర్ల కోర్టు వద్ద పిన్నెల్లి సోదరులు

పిన్నెల్లి సోదరుల లొంగుబాటు

▸▸ జంట హత్యల కేసులో వారికి 14 రోజుల రిమాండ్

మాచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):జైలుకు పోకుండా తప్పించుకోవడానికి చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలం కావడంతో పిన్నెల్లి సోదరులు గురువారం పల్నాడు జిల్లా మాచర్ల కోర్టులో లొంగిపోయారు. గత ఏడాదిన్నర కాలంలో 11 కేసుల్లో బెయిల్ తెచ్చుకోగలిగారుగానీ, జంట హత్యల కేసులో మాత్రం వీరిద్దరు జైలుకు పోక తప్పలేదు. 14 రోజుల రిమాండ్‌కు కోర్టు ఆదేశించడంతో, గట్టి ఎస్కార్ట్ బందోబస్తు మధ్య పిన్నెల్లి సోదరులను నెల్లూరు జైలుకు తరలించారు. గతేడాది మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ7) మాచర్లలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి పి. ప్రశాంత్ ఎదుట ఉదయం 11 గంటలకు లొంగిపోయారు. పిన్నెల్లి సోదరుల తరఫున హైకోర్టు న్యాయవాది రామలక్ష్మారెడ్డి, గురజాల న్యాయవాదులు బర్రెడ్డి నాగిరెడ్డి, చల్లా రామిరెడ్డి, మాచర్ల న్యాయవాదులు సీహెచ్ నాగిరెడ్డి, గుంజె వరప్రసాద్, జి వెంకటేశ్వర్లు, చిట్టా విజయభాస్కర్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులకు రిమాండ్ విధించాలని ప్రభుత్వ న్యాయవాది పి. విజయకుమార్ కోరారు.

ఫైబర్‌నెట్ కేసులో గౌతంరెడ్డికి చుక్కెదురు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ కార్పొరేషన్ కేసులో వైసీపీ నేత, ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పి.గౌతంరెడ్డికి చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని విజయవాడ ఏసీబీ కోర్టు స్పష్టంచేసింది. ఆయన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని చంద్రబాబుతోపాటు మరికొందరిపై జగన్ ప్రభుత్వ హయాంలో సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు పూర్తయిందని సీఐడీ అధికారులు కోర్టుకు నివేదిక ఇచ్చారు. కేసును ఉపసంహరించుకుంటున్నట్లు ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి కొద్దిరోజుల క్రితమే కోర్టులో అఫిడవిట్ వేశారు. ఈ నేపథ్యంలో తీర్పు ఇచ్చే ముందు తన వాదనలు వినాలంటూ గౌతంరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణార్హతపై రెండ్రోజుల కిందట వాదప్రతివాదనలు ముగిశాయి. న్యాయాధికారి ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ప్రేక్షకుల్ని భయపెట్టడం పక్కా

వంశీ నందిపాటి

"ఈషా' సినిమా రిలీజ్ కాస్త ఆలస్యం కావొచ్చేమో గానీ, మిమ్మల్ని భయపెట్టడం మాత్రం పక్కా. థియేటర్ నుంచి బయటకు వచ్చాక, కచ్చితంగా ఆంజనేయ స్వామి దండకం చదువుకుంటారు' అని నిర్మాత వంశీ నందిపాటి అన్నారు. త్రిగుణ్, హెబ్బా పటేల్ జంటగా శ్రీనివాస్ మన్నె తెరకెక్కించిన చిత్రమిది. కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారైంది. బన్నీవాసుతో కలసి వంశీ నందిపాటి ఈ నెల 25న 'ఈషా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో బన్నీ వాస్ మాట్లాడుతూ ' ఈ సినిమా చూసి భయపడని వారుండరు' అని చెప్పారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఇదొక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా' అని తెలిపారు. హారర్ చిత్రాల్లో 'ఈషా' కొన్నేళ్ల పాటు ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని శ్రీనివాస్ చెప్పారు.

హైదరాబాద్‌లో 'పెద్ది'



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తోన్న చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. తాజాగా ఆసక్తికర అప్డేట్‌ని మేకర్స్ ఇచ్చారు. నేటి నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతోంది. ఇందులో భాగంగా కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. మరికొన్ని సన్నివేశాలను ఢిల్లీలోనూ చిత్రీకరించనున్నారు. జనవరి నెలాఖరు వరకూ ఈ షెడ్యూల్ కొనసాగుతుంది. సినిమా వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆసక్తికరమైన కథాంశంతో..



రమ్యకృష్ణ, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా కరణ్ తుమ్మకొమ్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'పాకశాల పంతం'. ప్రవీణ్ కొల్లా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఆసక్తికరమైన కథాంశంతో భావోద్వేగాలు, వినోదం ప్రధానంగా చిత్రం సాగుతుందని మేకర్స్ అన్నారు. ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే చిత్రమని తెలిపారు. వంట లేదా ఆహారం విషయంలో ఇద్దరి మధ్యనున్న పంతం నేపథ్యంగా సినిమా ఉండవచ్చని తెలుస్తోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించి, వచ్చే ఏడాది వేసవికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

రోషన్.. రామ్‌చరణ్‌లా అనిపించాడు

రానా దగ్గుబాటి



'నేను ఈ వేడుకకి రావడానికి ప్రధాన కారణం రోషన్. తను మా ఇంట్లో అబ్బాయి. రోషన్‌ను చూస్తుంటే చిరుతలో రామ్‌చరణ్‌ను చూస్తున్నట్లు అనిపించింది' అని నటుడు రానా దగ్గుబాటి అన్నారు. రోషన్ కనకాల, సాక్షి సాగర్ మడోల్కర్ జంటగా సందీప్‌రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ శనివారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'సందీప్ గొప్ప సంకల్పం గల దర్శకుడు' అని అన్నారు. 'మోగ్లీ' మీ అందరికీ అసలైన యాక్షన్ సినిమా ఎలా ఉంటుందో చూపిస్తుంది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. 'ప్రేక్షకుడి సమయానికి విలువనిచ్చి చేసిన సినిమా ఇది' అని సందీప్‌రాజ్ అన్నారు.

సెన్సార్ బోర్డుకు క్షమాపణలు...

ఈ కార్యక్రమంలో నటుడు బండి సరోజ్‌కుమార్ సెన్సార్ బోర్డుపై చేసిన వ్యాఖ్యలపై నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటన విడుదల చేసింది. 'సెన్సార్ బోర్డుపై, సెన్సార్ బోర్డు అధికారిపై బండి సరోజ్‌కుమార్ చేసిన ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమైనవి కావు. మా టీమ్ తరఫున క్షమాపణలు. ఆ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుంటున్నాం' అని పేర్కొంది.


వినోదంతో మెప్పిస్తాం

మురళీ మనోహర్



"డార్క్ కామెడీ కథాంశంతో ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న చిత్రం 'గుర్రం పాపిరెడ్డి" అని దర్శకుడు మురళీ మనోహర్ అన్నారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రమిది. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మురళీ మనోహర్ మీడియాతో మాటాడుతూ 'హీరో క్యారెక్టర్ పేరైన గుర్రం పాపిరెడ్డిని టైటిల్‌గా పెట్టాం. సమాజంలో తెలివైన వారికి, తెలివితక్కువ వారికి మధ్య జరిగే ఆసక్తికరమైన యుద్ధమే ఈ సినిమా. మనందరిలో ఎంతో కొంత ఉండే తెలివితక్కువ తనం నుంచి పుట్టే సహజమైన వినోదాన్ని ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులు ప్రతి సన్నివేశాన్ని ఎంజాయ్ చేస్తారు. బ్రహ్మానందం, యోగిబాబు కీలకపాత్ర పోషించారు' అని తెలిపారు.





13 ఉమ్మడి జిల్లాలకు గ్రంథాలయ చైర్మన్లు

▸ బీజేపీలో ఒకరు, జనసేనలో ఇద్దరికి పదవులు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయాల సంస్థలకు నూతన చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి జిల్లాల వారీగా 13 మంది పేర్లతో గురువారం జాబితాను విడుదల చేసింది. జనసేన నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరిని పదవులు వరించాయి. ఇటీవల హత్యకు గురైన వీరయ్య చౌదరి భార్యను ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. టీడీపీ నుంచి పీరికట్ల విఠల్‌రావు(శ్రీకాకుళం), దొడ్డక రామకృష్ణ(విజయనగరం), సాయిబాబా రాజు(తూర్పుగోదావరి), వందన దేవి(గుంటూరు), ఎంఎస్ బేగ్(కృష్ణా), సుచిత్ర ముప్పవరపు(ప్రకాశం), శాంతకుమారి(నెల్లూరు), రెడ్డివారి గురవారెడ్డి(చిత్తూరు), తుగ్గలి నాగేంద్ర(కర్నూలు), వడ్డే వెంకట్(అనంతపురం), జనసేన నుంచి వన్నంరెడ్డి సతీశ్‌కుమార్(విశాఖపట్నం), జుట్టిగ నాగరాజు(పశ్చిమ గోదావరి), బీజేపీ నుంచి భానుప్రకాశ్ దాసరి(కడప) జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లుగా ఎంపికయ్యారు. వీరి నియామక ఉత్తర్వులు త్వరలో విడుదల కానున్నాయి.

ఎంఎస్ఎంఈడీసీకి 13 మంది డైరెక్టర్ల నియామకం

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈడీసీ) బోర్డు డైరెక్టర్లుగా 13 మందిని నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పత్తి రైతులను ఆదుకోండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పత్తి రైతులను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఏపీలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ప్రస్తావించారు. మొంథా తుఫాను వల్ల రాష్ట్రంలోని దాదాపు 1.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిందని, రైతులు నష్టపోయారని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్త నిబంధనలు రైతులను మరింత ఇబ్బంది పెడుతున్నాయని వివరించారు. జిన్నింగ్ మిల్లుల కొనుగోలు కోటాను పెంచి, రైతుల నుంచి పత్తిని పూర్తిగా కొనుగోలు చేయాలని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖకు విన్నవించారు.

కేంద్ర పథకాలు నూరు శాతం అమలుచేయాలి

▸ వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ శాఖల్లో కేంద్ర ప్రయోజిత పథకాలను నూరు శాతం అమలు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఆయా శాఖలకు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పాలనాపరమైన ఆమోదం కోసం తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గురువారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ మాట్లాడుతూ దాళ్వా వరి సాగులో వినియోగదారులు ప్రాధాన్యత ఇచ్చే రకాలను మాత్రమే సాగు చేసేలా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు.

మత్స్యకార సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జిగా నవీన్ కుమార్

రాష్ట్ర మత్స్యకార సహకార స ంఘాల సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జిగా కర్నూలు జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు బి.శివ నవీన్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సమాఖ్య కార్యకలాపాల నిర్వహణ కోసం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆరు నెలలు పాటు శివ నవీన్ కుమార్ అధికారేతర పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లోపేర్కొన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల ప్రొవిజినల్ జాబితా విడుదల

పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఈ నెల 29 నుంచి 31 వరకు విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపింది.

మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం: డీజీపీ

విజయవాడ సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. తాడేపల్లిలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో 164 శక్తి బృందాలు పని చేస్తున్నాయని... మహిళలపై వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111కు అందిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



ఉమెన్, చైల్డ్ సేఫ్టీ వింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

రాజ్యాంగానికి విరుద్ధంగా మోదీ పాలన: డి.రాజా

అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాశారని, కానీ మోదీ పాలన రాజ్యాంగానికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. అనంతపురంలో గురువారం నిర్వహించిన సీపీఐ వందేళ్ల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పార్టీ అమరవీరుల కుటుంబాలకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమ సమయం నుంచి సీపీఐ దేశం కోసం, ప్రజల కోసం పనిచేస్తోందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయ పార్టీ అని, తమ పార్టీలాగా ఉద్యమ పార్టీ కాదన్నారు. సీపీఐకి వందేళ్ల ఘన చరిత్ర ఉందని పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పేద ప్రజల కోసం పోరాటాలు సాగిస్తోందని అన్నారు. ఎర్రజెండా పోరాటశక్తులన్నీ మళ్లీ ఏకం కావాల్సిన సమయం వచ్చిందని చెప్పారు.



భవానీ దీక్షల విరమణ ప్రారంభం

▸ తొలిరోజు దీక్షలు విరమించిన 50 వేల మంది

విజయవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం ఆరు గంటలకు అమ్మవారి మూల విరాట్ వద్ద అర్చకులు జ్యోతిని వెలిగించారు. జ్యోతిని వాయిద్యాల మధ్య మెట్ల మార్గంలో కనకదుర్గనగర్‌లో ఏర్పాటు చేసిన హోమగుండాల వద్దకు తీసుకెళ్లారు. ఆ జ్యోతితో మూడు హోమగుండాలను వెలిగించారు. ఆ తర్వాత 6.30 గంటలకు భవానీలను దర్శనానికి అనుమతించారు. తొలి రోజు రాత్రి వరకు 50 వేల మంది భవానీలు దీక్షలు విరమించారు.



భక్తులతో దీక్ష విరమింపజేస్తున్న గురుభవానీ

టీడీపీకి ఒక మున్సిపాలిటీ, రెండు ఎంపీపీలు

▸ కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తలారి గౌతమి

▸ ఏర్పేడు, రామగిరి ఎంపీపీలుగా తెలుగుదేశం అభ్యర్థులు

▸ కడప మేయర్‌గా వైసీపీ కార్పొరేటర్ పాకా సురేశ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాయలసీమలో ఐదు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగగా మూడింటిని తెలుగుదేశం పార్టీ గెలుచుకోగా కడప కార్పొరేషన్‌ను వైసీపీ నిలబెట్టుకుంది. కడప నూతన మేయర్‌గా 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేశ్ ఎన్నికయ్యారు. గురువారం జేసీ అదితిసింగ్ అధ్యక్షతన మేయర్ ఎన్నిక జరిగింది. మేయర్‌గా వైసీపీ అభ్యర్థి ఒక్కరే బీఫాం ఇవ్వడంతో ఎన్నిక ఏకగ్రీవమయింది. కమిషనర్ మనోజ్ రెడ్డి నూతన మేయర్‌తో ప్రమాణం చేయించారు. కడపలో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా వారిలో ఒక్కరే టీడీపీ నుంచి గెలుపొందారు. మిగిలిన 49 మందిలో ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. మిగిలిన 47 మందిలో 8 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. దీంతో వైసీపీకి 39 మంది కార్పొరేటర్లు మిగిలారు. కాగా, ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకే రోజు రెండు స్థానాలు టీడీపీ ఖాతాలో పడ్డాయి. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్ పర్సన్‌గా తలారి గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీగా కప్పల సాయిలీల ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వైసీపీ నాయకుడు తలారి రాజ్‌కుమార్ పాలకవర్గ సమావేశాలను నిర్వహించకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించడంతో ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తొలగించింది. గురువారం ఆర్డీవో వసంతబాబు ఆధ్వర్యంలో కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. 22 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. వైసీపీ అభ్యర్థి ఎం.లక్ష్మన్నకు 11 మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో టీడీపీ అభ్యర్థి గౌతమి రెండు ఓట్ల మెజార్టీతో చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అలాగే, శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీగా కప్పల సాయిలీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికకు ఐదుగురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో ఎన్నిక ఏకపక్షంగా సాగింది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నూతన ఎంపీపీని అభినందించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు ఎంపీపీ పదవి టీడీపీ వశమైంది. వైసీపీకి చెందిన గీత గత ఎన్నికల్లో ఎంపీపీగా ఎన్నికై.. ఆరు నెలల కిందట వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో తాజాగా ఎన్నిక నిర్వహించారు. ప్రస్తుతం 14 మంది ఎంపీటీసీలున్నారు. గురువారం నిర్వహించిన ఎన్నికకు హాజరైన తొమ్మిది మంది ఎపీటీసీల్లో ముగ్గురు టీడీపీ సభ్యులు. మిగిలిన వైసీపీ ఎంపీటీసీలు ఆరుగురూ టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించి మరీ ఎన్నికలో పాల్గొన్నారు. అనంతరం ఆ ఆరుగురిలో ఒకరైన ఆదిలక్ష్మిని ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాలెం ఎంపీపీ ఎన్నిక కోర్టు స్టే కారణంగా జరగలేదు. సత్యవేడు మండల వైస్ ఎంపీపీ పదవిని వైసీపీ నిలబెట్టుకుంది.



ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీతకు చూపుతున్న రామగిరి ఎంపీపీ సాయిలీల



కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గౌతమి



కడప మేయర్ పాకా సురేశ్

అధికార భాషా సంఘానికి మండలి పేరు భేష్

▸ చైర్మన్‌గా త్రివిక్రమరావుతో ప్రమాణం చేయించిన మంత్రి దుర్గేష్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలుగు భాషకు ప్రత్యేక స్థానం తీసుకువచ్చిన మండలి వెంకట కృష్ణారావు పేరుతో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబు తీసుకున్న గొప్ప నిర్ణయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్‌గా నియమితులైన పి.త్రివిక్రమరావు (విక్రమ్ పూల) పదవీ బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ పున్నమిఘాట్‌లోని హరితబెర్మ్ పార్క్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. అధికార భాషా సంఘాన్ని ప్రజల మధ్యలోకి తీసుకెళ్లి భాషా ఔనత్యాన్ని పెంపొందించగల వ్యక్తిగా, సుదీర్ఘకాలం పాత్రికేయ సేవలందించిన త్రివిక్రమరావును అధ్యక్షుడిగా నియమించడమని గొప్ప విషయమన్నారు. త్రివిక్రమరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు భాష ఉపయోగాన్ని పెంచడం వంటి కార్యక్రమాలపై పెద్దలు, మేధావుల సలహాలు తీసుకుని ముందుకు వెళాతానని తెలిపారు.



త్రివిక్రమరావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి దుర్గేష్

రసకందాయంలో నెల్లూరు 'అవిశ్వాసం'

▸ గోడ దూకడానికి వైసీపీ భారీ ఆఫర్లు

▸ టీడీపీలోకి వచ్చిన ఐదుగురు మళ్లీ వైసీపీకి

▸ అప్రమత్తమైన తెలుగుదేశం పార్టీ నేతలు

▸ కార్పొరేటర్లను శిబిరాలకు తరలించిన ఇరు పక్షాలు

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసం రసకందాయంలో పడింది. నిన్నటి వరకూ నల్లేరుపై నడక అనుకున్న టీడీపీ నేతల అంచనాలు తారుమారు అవుతున్నాయి. టీడీపీలోకి వెళ్లిన తమ పార్టీ కార్పొరేటర్లకు వైసీపీ నేతలు భారీ రేటు కట్టారు. దీంతో కొందరు మళ్లీ వైసీపీ వైపు చూడడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం రోజు(18వ తేదీ)కు ఎవరు ఎటు ఉంటారు? అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. దీంతో ఇరుపక్షాల్లో ఉత్కంఠ నెలకొంది. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ అనుసరించిన విధానాలతో టీడీపీ వైపు నుంచి పోటీ చేయాలంటే భయపడే పరిస్థితులు. దీంతో స్థానాలన్నీ వైసీపీకి ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో మొత్తం 53 మందిలో 13 మంది మినహా మిగిలిన కార్పొరేటర్లు అందరూ టీడీపీలో చేరిపోయారు. ఆ దన్నుతోనే మేయర్ స్రవంతిని అవిశ్వాస తీర్మానం ద్వారా గద్దె దించడానికి ఆ పార్టీ సన్నద్ధమైంది. ఆమేరకు కలెక్టర్‌కు నోటీసులు ఇవ్వడంతో 18వ తేదీ అవిశ్వాసానికి రంగం సిద్ధమయింది. బలాబలాలు స్పష్టంగా ఉండడంతో ఇరు పార్టీలు విషయాన్ని తేలికగా తీసుకున్నాయి. హఠాత్తుగా బుధవారం వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. కార్పొరేటర్లకు భారీ రేట్లు ఫిక్స్ చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని ఓడించి టీడీపీని అప్రతిష్ఠపాలు చేయడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. నిన్నటి వరకూ టీడీపీ పక్షంలో ఉన్న ఐదుగురు కార్పొరేటర్లు గురువారం జగన్ సమక్షంలో తిరిగి వైసీపీలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం టీడీపీ వైపు 39 మంది ఉన్నారు. వీరిలో ఏ ఇద్దరు జారుకున్నా అవిశ్వాస తీర్మానం వీగిపోతుంది. దీంతో వైసీపీ ఆ ఇద్దరి కోసం తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించింది. జరిగిన పరిణామాలతో ఉలిక్కిపడ్డ టీడీపీ నేతలు తమ బలం తగ్గకుండా పట్టు బిగించారు. ఇరు పక్షాలూ తమ కార్పొరేటర్లను ప్రత్యర్థులు ఎగరేసుకుపోకుండా క్యాంపులకు తరలించాయి. అవిశ్వాసానికి ఇంకా ఆరు రోజుల సమయం ఉంది. ఈలోగా ఇది మరెన్ని మలుపులు తిరుగుతుందో చూడాల్సిందే.

ఆస్తి కోసమే హత్య చేశారు!

▸ శ్రవణ్ సాయి పెదనాన్న ఆరోపణ

▸ స్వగ్రామానికి యువకుడి మృతదేహం.. ముగిసిన అంత్యక్రియలు

పెనుగంచిప్రోలు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు శ్రవణ్ సాయిని బాలిక కుటుంబ సభ్యులు కేవలం ఆస్తి కోసమే హత్య చేశారని అతని పెదనాన్న వెంకటేశ్వరరావు ఆరోపించారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన కాకాని శ్రవణ్ సాయి మృతదేహానికి అతని స్వగ్రామం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో గురువారం అంత్యక్రియలు జరిగాయి. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గురువారం ఉదయం పెనుగంచిప్రోలు తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసిన బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విహార యాత్రలో విషాదం

▸ పొగమంచు కారణంగా బ్రిడ్జిని ఢీకొన్న కారు

▸ మన్యం అందాలను తిలకించేందుకు వచ్చిన ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు

▸ ఒకరి మృతి, ముగ్గురి పరిస్థితి విషమం

హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మన్యం అందాలను తిలకించేందుకు వచ్చిన ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం ఉదయం ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలు, ఇద్దరికి స్వల్పగాయాలయ్యా యి. విశాఖపట్నం గీతం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు రుద్ర (20), శ్రియానిహార్ (20), అభిలాష్ (20), శ్రీవత్సవ (20), నరేశ్, మధురెడ్డి బుధవారం రాత్రి కారులో పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండకు వెళ్లారు. గురువారం వేకువజామున అరకు లోయ బయలుదేరారు. ఉదయం ఏడు గంటల సమయంలో హుకుంపేట మండలం రాళ్లగడ్డ సమీపానికి వచ్చేసరికి పొగమంచు దట్టంగా ఉండటంతో రహదారి కనిపించలేదు. దీంతో అక్కడి వంతెన అంచును కారు బలంగా ఢీకొట్టింది. రుద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రియానిహార్, అభిలాష్, శ్రీవత్సవ తీవ్రంగా గాయపడ్డారు. నరేశ్, మధురెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాయుడు తెలిపారు.

ఏపీలోని ఎర్రచందనం రైతులకు 1.1 కోట్లు

▸ ఐదు రాష్ట్రాలకు 6.2 కోట్లు విడుదల చేసిన

▸ జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబరు 11: జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) గురువారం ఐదు రాష్ట్రాలకు రూ.6.2 కోట్ల నిధులు విడుదల చేసింది. యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ (ఏబీఎస్) మెకానిజం కింద అంతరించిపోతున్న ఎర్రచందనం చెట్ల పరిరక్షణకు మద్దతు ఇవ్వడానికి, రైతులు, అటవీ ఆధారిత వర్గాల జీవనోపాధిని బలోపేతం చేయడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పర్యావరణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రూ.6.2 కోట్ల నిధుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు రూ.1.1 కోట్లు కేటాయించగా, తెలంగాణ రైతులకు రూ.17.8 లక్షలు వెళ్లనున్నాయి. ఇక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ అటవీ శాఖలు వరుసగా రూ.2.98 కోట్లు, రూ.1.05 కోట్లు, రూ.69.2 లక్షలు, రూ.5.8 లక్షల చొప్పున అందుకొనున్నాయి. మరో రూ.16 లక్షల నిధులను రాష్ట్రాల బయోడైవర్సిటీ బోర్డులకు పంచనున్నారు. దీంతో ఎర్రచందనం పరిరక్షణకు ఇప్పటి వరకు విడుదల చేసిన ఏబీఎస్ నిధులు రూ.101 కోట్లు దాటాయి.


రిటైర్డ్ ఈఎన్‌సీ శ్రీనివాస్‌కు రెండు వారాల రిమాండ్

▸ ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు కేసు నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై విశాఖపట్నం ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాజీ ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్‌కు ఏసీబీ కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ శ్రీనివాస్ ఈ ఏడాది ఆగస్టు 7న ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయగా, 45 రోజులపాటు రిమాండ్‌లో ఉన్నారు. ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. కాగా శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై విశాఖ ఏసీబీ అధికారులు పూర్తి సమాచారం సేకరించి బుధవారం కేసు నమోదుచేసి, విశాఖలోని ఆయన నివాసంతోపాటు విశాఖ, ఏలూరు, హైదరాబాద్‌లోని అతని బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.1.5 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, ఇన్నోవా కారుకు సంబంధించిన పత్రాలు లభ్యమయ్యాయి. శ్రీనివాస్‌పై 2001లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసు, 2014లో లంచం కేసులు నమోదయ్యాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీనివాస్‌ను ఏసీబీ కోర్టులో గురువారం హాజరుపరచగా కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించిందని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఆలయ దర్శనం

ఈ గణపతి రత్నగర్భుడు



'గణ' అంటే సమూహం లేదా సైన్యం. 'నాథుడు' అంటే అధిపతి లేదా నాయకుడు. గణనాథుడు అంటే దేవతల సమూహానికి అధిపతి... వినాయకుడు. ఆయనను విఘ్నాలకు అధిపతిగా భావిస్తారు. ఏదైనా పని ప్రారంభించే ముందు ఆయనను పూజిస్తే అడ్డంకులు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. ఆ స్వామి ఆంధ్రప్రదేశ్‌లోని రాయభూపాలపట్నంలో రత్నగర్భ గణపతిగా ఆయన కొలువయ్యాడు.

ఉత్తరాభిముఖంగా...

ప్రస్తుతం రత్నగర్భ గణపతి ఆలయ ఉన్న ప్రాంతం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో... దాదాపు 150 ఏళ్ళ క్రితం రెండు విగ్రహాలు బయటపడ్డాయి. వాటిలో ఒక దాన్ని కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో రెండోదాన్ని తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో ఉన్న రంగాపురం గ్రామంలో ప్రతిష్ఠించారని తెలుస్తోంది. అప్పట్లో ఈవిగ్రహం తరలించడానికి సుమారు వారం రోజుల సమయం పట్టిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది దాదాపు 500 సంవత్సరాల క్రితం పాలించిన చాళుక్యుల కాలం నాటి విగ్రహం అని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. చెరువులో నుంచి విగ్రహం బయటపడిన తరువాత అక్కడే ఆలయాన్ని నిర్మించారు. నాటినుంచి నేటి వరకూ గణనాథుడు నిత్యం ఇక్కడ పూజలందుకుంటున్నాడు. ఆ గణపతిని గర్భంలో రత్నాలను దాచుకున్న 'రత్నగర్భ గణపతి'గా, 'లక్ష్మీగణపతి'గా కొలుస్తున్నారు. రత్నాలవంటి అమూల్యమైన కరుణ, జ్ఞానం, ఐశ్వర్యాలను తన ఉదరంలో ధరించిన వేలుపు రత్నగర్భ గణపతి అని, పైకి సైకత శిల్పంలలా కనిపించే ఈ స్వామిని సేవిస్తే సమస్త సంకటాలు, సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. సాధారణంగా తూర్పు ముఖంగా దేవతా మూర్తుల విగ్రహాలు ఉంటాయి. కానీ ఇక్కడ ఉత్తర ముఖంగా శ్రీరత్నగర్భ గణపతి స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.



• వినాయక్ నర్లజర్ల, పెద్దాపురం

యోగా

ఎంత తెలిసినా ఆచరణ సున్నా!

మనం ప్రస్తుతం విజ్ఞాన యుగంలో బతుకుతున్నాం. ప్రపంచంలో ఏ విషయానికి సంబంధించిన సమాచారమైనా మనకు సెకన్లలో అందుబాటులోకి వస్తోంది. మన పూర్వ గ్రంథాలు, ఋషులు, మునులు చెప్పిన జ్ఞాన సూత్రాలు, ప్రపంచంలోని ఇతర నాగరికతలకు సంబంధించిన విశేషాలు- ఇలా ఏవి కావాలన్నా సెకన్లలో మన స్క్రీన్లపై ప్రత్యక్షమవుతున్నాయి. అయితే ఇంత విజ్ఞానం మన కళ్ల ముందే ఉన్నా- మన వ్యక్తిగత జీవితాల్లో, వృత్తిపరమైన కార్యకలాపాలలో, సామాజిక వ్యవహారాలలో వాటిని ఏమాత్రం ఆచరించం. దైనందిక జీవితంలో ఈ వ్యత్యాసం కనబడుతూ ఉంటుంది. ఉదాహరణకు అధికార హూకుంల కన్నా సామరస్య సూత్రమే మేలైన పద్ధతి అని మనకు తెలుసు. కానీ చాలా సమయాల్లో మనం అధికారాన్నే ఆయుధంగా వాడుకోవాలని చూస్తూ ఉంటాం. పరమాత్మతో అనుసంధానం కావడమే జీవుల పరమోద్దేశమని ప్రతి మతం మనకు చెబుతుంది. అయినా విశ్వాసాలు అనే పొరలు అందరినీ వేర్వేరు చేస్తూ ఉంటాయి. ఇక ఆధ్యాత్మిక మార్గం విషయానికి వస్తే- చాలా మంది సాధకులకు ఆధ్యాత్మిక సిద్ధాంతాలన్నీ తెలుసు. కానీ వారు వాటిని నిజ జీవితంలో ఆచరణలోనే పెట్టరు. అసలు ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయనే విషయాన్ని ఆలోచిద్దాం.

మానవుడి లక్ష్యం...

మానవుడి జీవన లక్ష్యం విజ్ఞాన సముపార్జన కాదు. ఆ విజ్ఞానాన్ని తన అభివృద్ధికి, సమాజ అభివృద్ధికి ఉపయోగించడం. ఈ విషయాన్ని మెదడు గ్రహిస్తే- మనస్సు అనుభవిస్తుంది. 'నేను'అనే అహం కరిగిపోయి... సహకరిస్తుంది. అప్పుడు తీసుకొనే చర్యలు నిజమైన ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. అప్పుడు కరుణ, ప్రేమ లాంటివి సహజంగా బహిర్గతమవుతాయి. ప్రకృతితో మన జీవనం మమేకమవుతుంది. ఆ సమయంలో విజ్ఞానానికి, దాని ఆచరణకు మధ్య తేడా ఉండదు.

విజ్ఞానపు పరిమితులు...



విజ్ఞానానికి పరిమితులు ఉన్నాయి. ఇది మన మెదడులో మాత్రమే నిక్షిప్తమై ఉంటుంది. కానీ ఒక వ్యక్తి ప్రవర్తన- అతని భావోద్వేగాలు, అలవాట్లు, అభిప్రాయాలు, చుట్టుపక్కల ఉన్న సమాజపు తీరులపై ఆధారపడి ఉంటుంది. బలమైన ఒత్తిడి పెడితే మెదడు లొంగిపోతుంది. భయం, అహంకారం, అభద్రతా భావం మొదలైనవి ప్రవర్తనపై ప్రభావం చూపించడం మొదలుపెడతాయి. మనకు తెలిసిన జ్ఞాన సూత్రాలు వెనక్కి వెళ్లిపోతాయి. అందువల్లే బాగా చదువుకున్నవారు, సంస్కారవంతులు కూడా కొన్నిసార్లు వారి వ్యక్తిత్వానికి భిన్నంగా ప్రవర్తిస్తూ ఉంటారు. అంటే ఒక వ్యక్తిని విజ్ఞానం మాత్రమే మార్చలేదు. మనం ఈ సమస్యను అహం (ఈగో) కోణం నుంచి కూడా ఆలోచించాలి. ఉన్నతమైన ప్రతీ ఆలోచనకు ఈగో అడ్డుతగులుతూ ఉంటుంది. క్షమాగుణం కావచ్చు, నిగర్వత్వం కావచ్చు, కష్టాలకు స్పందించే గుణం కావచ్చు- ఇలా ప్రతి ఆలోచనకు ప్రతికూలంగా పనిచేసేది ఈగోనే! దానిని రూపుమాపితే తప్ప మన మెదడులో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానానికి బలం చేకూరదు. అయితే ఈ ఈగో చాలా బలమైనది. 'నేను ఎందుకు తగ్గాలి? తగ్గితే నాకున్న గౌరవం పోతుందేమో'- లాంటి వాదనలను మనసుకు వినిపిస్తూ ఉంటుంది. మనిషి మనసులో జరిగే ఈ అంతర్యుద్ధంలో విజ్ఞానం చాలా సందర్భాలలో ఓడిపోతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే మనిషి అణువణువులోనూ మార్పు రావాలి. ఈ మార్పు హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది. మానవుడిలో అహం పొరలు కరిగిపోయి దైవ లక్షణాలు చేకూరతాయి. అయితే ఇది ఒక రోజులో వచ్చే మార్పు కాదు. కొన్ని ఏళ్ల తరబడి చేయాల్సిన సాధన. దీనికి కొన్ని సూత్రాలున్నాయి.

- ప్రతి రోజూ ఒక పది నిమిషాలు నిజాయితీగా 'మన విలువలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నామా?' అని ఆత్మశోధన చేసుకోవడం. పరివర్తన అనేది అవగాహనతోనే ప్రారంభమవుతుంది.
- ఎలాంటి స్థితిలోనైనా స్పందించే ముందు- ఒక లిప్తపాటు కాలం ఆగడం. దీనివల్ల మనలో నిబిడీకృతమైన విలువలు బయటకు వచ్చే అవకాశముంది.
- మనకు మనస్సే దిక్సూచి. అది చెప్పినట్లు వింటే సమస్యలే ఉండవు. ఆ మనస్సు చూపే మార్గాన్ని అనుసరించడమే ఆచరణీయం.
- ఒక చర్యను పదే పదే చేస్తూ ఉంటే సులభమవుతుంది. సత్ ప్రవర్తనను విషయంలోనే అదే అనుసరించడం మంచిది.



డాక్టర్ శరత్‌రెడ్డి
కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్
9440087532

భగవద్గీత



దేవుడు చేయిస్తున్నాడా? మనమే చేస్తున్నామా?

భగవద్గీతలోని 'విశ్వరూప సందర్శన యోగం'లో కృష్ణపరమాత్మ తన విశ్వరూపాన్ని చూపగానే అర్జునుడు వణికిపోయాడు. ఈ విషయాన్ని ధృతరాష్ట్రుడికి వివరిస్తున్న సంజయుడు... ఆ విశ్వరూపం ఎలా ఉందో చెప్పాడు.

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా
యది భాః సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మనః

"ఆకాశంలో ఒక్కసారికి వేల సూర్యులు ఉదయిస్తే కనిపించే కాంతి... ఈ కాంతికి సాటిరాదు!" అని అర్థం.

మన అందరికీ ఈ విశ్వరూపం గురించి తెలుసు... ముఖ్యంగా తెలుగువారికి ఎన్టీరామారావు పౌరాణిక సినిమాల ధర్మమా అని. మహాభారతం ఇంకా బాగా తెలుసు. ఆశ్చర్యమేమిటంటే... ఎక్కడో అమెరికాలో, కొన్ని దశాబ్దాల క్రితం హార్వర్డ్ యూనివర్సిటీలో డాక్టరేట్ తీసుకున్న ఒక అణుశాస్త్రజ్ఞుడికి... మొదటి అణుబాంబు ప్రయోగం జరిగినప్పుడు చూసిన విస్ఫోటనం... ఈ శ్లోకాన్ని గుర్తుకుతెచ్చిందట. 'ఫాదర్ ఆఫ్ ది ఆటమిక్ బాంబ్'గా పిలుపులందుకున్న ఆ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తకు భగవద్గీత మతాలకు అతీతమైన గ్రంథం. గీతను పూర్తిగా అర్థం చేసుకోవడం కోసం సంస్కృతం నేర్చుకొనే ప్రయత్నం కూడా చేశాడట.

1945 జూలై 16. అణుబాంబు పేలితే ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి చేసిన ప్రయోగం అది. మనం పోక్రాన్‌లో చేసినట్టు వాళ్ళు మెక్సికోలో చేసినప్పుడు... ఆ విస్ఫోటనం ఎలా కనబడిందో చెప్పడానికి, పోల్చడానికి భగవద్గీతలో విశ్వరూపం తప్ప మరో పోలికే కనిపించలేదు ఓపెన్ హోమర్‌కి. నెలరోజుల తరువాత హిరోషిమా-నాగసాకిల మీద అమెరికా అణుబాంబు ప్రయోగించింది. ప్రపంచంలో జరిగిన అన్ని యుద్ధాలలో ఇదే అత్యంత క్రూరమైన ఆయుధ ప్రయోగం అయి ఉండవచ్చు. 1945 ఆగస్టు 9 ప్రపంచంలోనే ఒక చీకటి రోజు. సుమారు లక్షన్నరమంది జనం... పిల్లలు, స్త్రీలు, వృద్ధులతో సహా మాడి మసైపోయారు. బాంబు పేలిన ప్రాంతాలు శ్మశానాల దిబ్బల్లా ఎందుకూ పనికిరాకుండా పోయాయి. (ఇప్పటికీ రేడియేషన్ ప్రభావం ఎంతమేరకు ఉందనేది ఇంకా అను(ఋ)మానమే). ప్రపంచ వ్యాప్తంగా అణ్వస్త్ర పితామహుడు ఓపెన్ హోమర్ తీవ్రమైన విమర్శలకు గురయ్యాడు. ఐన్‌స్టీన్ స్థాయి మేధావులతో సహా గొప్ప గొప్పవారందరూ "ఛీ... ఇంత దారుణమా?" అంటూ ఈసడించారు. (కొన్నాళ్ళ తరువాత ఐన్‌స్టీన్, ఓపెన్ హోమర్ కలిసి... అణుబాంబు వ్యతిరేక ప్రచారకులుగా ముందువరుసలో నిలిచారు).

అపరాధ భావనతో అమెరికన్ ప్రభుత్వాలు కూడా తనకు చేస్తున్న అవమానాల భారంతో కుంగిపోయిన ఓపెన్ హోమర్‌కు భగవద్గీతలోనే ఉపశమనం లభించి ఉంటుంది. ఇరవయ్యేళ్ళ తరువాత బి.బి.సి.కి ఇచ్చిన ఇంటర్వ్యూలో "చరిత్రలోనే అత్యంత దారుణమైన నరమేధానికి కారకులైన మీకు... అణుబాంబు ప్రయోగం, హిరోషిమా, నాగసాకీల విధ్వంసం విషయంలో ఏమనిపిస్తూ ఉంటుంది?" అనే ప్రశ్నకు...

కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః
ఋతేపిత్వాం న భవిష్యంతి సర్వే
యే వస్థితాచి ప్రత్యనీకేషు యోధాః...

"లోకాన్ని తుదముట్టించడానికి విజృంభించిన మహాకాలుడను. నువ్వు యుద్ధం చేయకపోయినా వీరెవరినీ మిగలనివ్వను..." ఇవి అర్జునుడితో కృష్ణుడు చెప్పిన మాటలు. ఇవే చెప్పాడు ఓపెన్ హోమర్. "ప్రపంచంలోనే అతి గొప్ప గ్రంథమైన భగవద్గీతలో దేవుడు చెప్పిన మాటలివి" అన్నాడు. భూగోళానికి అవతలపక్క ఉన్న అమెరికాలో ఒక మేధావి... ఇటువైపు ఎక్కడో ఇండియా అనే ఉపఖండంలో... అత్యంత పురాతనం, సనాతనం అయిన ఒక సంప్రదాయం వేల సంవత్సరాలుగా మనుగడలో ఉందనీ, ఆ జనానికి 'భగవద్గీత' అనే దేవుడు పాడిన పాటను స్మరించుకోవడం అలవాటనీ ఎలా తెలిసిందో! "నేను చేసిందేమీ లేదు. నేను పైవాడి చేతిలో పనిముట్టును మాత్రమే..."... ఎంత గొప్ప ఉపశమనం! జరిగినది గొప్ప పనైనా, చెడ్డ పనైనా మనం ఒక ఉపకరణమే తప్ప, మనమే కారకులం అనుకోవడం అహంకారం అవుతుందన్నాడు కృష్ణుడు.

అలాగని చెప్పి "అంతా దేవుడే చేయిస్తున్నాడండీ! నేనేం చెయ్యగలను?" అని కేడీ పనులు చేసేస్తూ సమర్థించుకోవడాన్ని కృష్ణుడు ఒప్పుకోడు. నీ ఆలోచన, నీ ప్రమేయం, నీ కృషి లేకుండా ఏ పనీ జరగదంటాడు. పరస్పర విరుద్ధమైన ప్రతిపాదనలుగా అనిపిస్తోంది కదా! అందుకే భగవద్గీత వేల సంవత్సరాలుగా ఒక ప్రామాణిక గ్రంథంగా నిలిచిపోయింది. ఇంతకీ దేవుడే చేయిస్తున్నాడా, మనమే చేస్తున్నామా? అది తెలుసుకోవాలంటే మరింత లోతుగా వెళ్ళి పరిశీలించడానికి ప్రయత్నించాలి.



ఉండవల్లి అరుణ్‌కుమార్

దైవమార్గం

సజీవ వాక్కు

బైబిల్‌లో వాక్కుకు (మాటకు) మహోన్నతమైన స్థానం ఉంది. దేవుని నోట వెలువడిన ఆ వాక్కు ద్వారానే ఈ సమస్త విశ్వం పుట్టిందనీ, కాబట్టి అది దైవతుల్యమైనదనీ, దానికి ఎంతో ఔన్నత్యం ఉన్నదనీ, దివ్యమార్గాన్ని నిర్దేశించే ఆ వాక్కు... ప్రజల కోసం శరీరధారిగా, క్రీస్తు రూపంలో మానవునిగా అవతరించిందనీ, మానవుల మధ్య సంచరించిందనీ బైబిల్ చెబుతోంది. కనిపించే ఐశ్వర్యాలన్నిటినీ దొంగిలించడానికి వీలుంది... కానీ జ్ఞానాన్నీ, దానికి సంబంధించిన మంచి వాక్కును ఎవరూ దొంగిలించలేరు. "ఆహారం లేకుండానైనా ఉండవచ్చేమో కానీ, మాట లేకుండా బతకడం కష్టం" అని ఒక సందర్భంలో సాతానుకు ఏసు ప్రభువు చెబుతాడు. కేవలం మాట ద్వారానే ఏసు అద్భుతాలు చేసిన సంఘటనలు కనిపిస్తాయి.

ఒక సైన్యాధిపతి తన ఇంట చావు బతుకుల్లో ఉన్న తన కుమారుణ్ణి బతికించాలని ఏసును ఆహ్వానిస్తూ "స్వామీ! మీరు నా ఇంటికి వచ్చేటంతటి భాగ్యవంతుణ్ణి, అర్హుణ్ణి కాదు. మీరు ఇక్కడి నుంచి ఒక మాట పలికితే చాలు, నా కుమారుడు బతుకుతాడు" అని వేడుకున్నాడు. ప్రభువు మాటలోని శక్తిమంతమైన జీవాన్ని అతను గుర్తించాడు. ఏసు కృపతో అతని విశ్వాసం ఫలించింది. "భూమ్యాకాశాలు నశించినా నశించవచ్చు, కానీ నా వాక్కుకు అంతం లేదు. అది ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటుంది" అని ప్రభువు ప్రకటించాడు.



ప్రభువు వాక్కు సత్యంతో, జీవంతో, కాంతితో, శక్తితో కూడుకున్నది. అది బాధల్లో ఉన్నవారికి చల్లనైన ఓదార్పును ఇస్తుంది. నిత్యంగా ఉండే మార్గానికి తీసుకువెళ్తుంది. అది ఆదికాలం నుంచి నేటి వరకూ ఉన్న మానవులందరికీ తోడుగా ఉంది. ఆ వాక్కు ఇప్పటికీ అనేక రూపాల్లో ప్రజలతో మమేకమై, లోకాన్ని నడిపిస్తోంది. ఒకప్పుడు దేవుని నోట "అగుగాక" అని శాసించిన వాక్కు... ఉపదేశించే క్రీస్తు వాక్కుగా పరిణమించి ఈ విశ్వాన్ని కాపాడుతూ... మానవులకు తోడుగా ఉండే పవిత్రాత్మగా నేడు వ్యాపించిందనేది క్రైస్తవుల విశ్వాసం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

ఇంట్లో విగ్రహం ఎత్తు ఎంత ఉండాలి?

తెలుసుకుందాం



మన ఇంటి పూజామందిరంలో దేవుని విగ్రహం ఎంత ఎత్తులో ఉండొచ్చు? ఏ లోహంతో లేదా ద్రవ్యంతో చేయించుకోవాలి? ఎలాంటి విగ్రహాలు ఉండాలి? ఇలాంటి అనేక సందేహాలు రావడం సర్వసాధారణం. తిరువారాధన చేసుకోవడానికి గృహస్థులు తమ ఇళ్ళలో పెట్టుకొనే విగ్రహాలు ఎంత ఎత్తులో ఉండాలనే నియమాన్ని ఆగమ, శిల్ప శాస్త్రాలు కొన్ని సూచిస్తున్నాయి. అలాగే పెద్దలనుంచి అనూచానంగా వస్తున్న కొన్ని సంప్రదాయ పద్ధతులు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం.


గృహస్థులు తమ ఇళ్ళలో ఆరాధనలను తమ కోసం, తమ కుటుంబం కోసం, వంశవృద్ధి కోసం నిర్వహిస్తారు. కాబట్టి దాన్ని 'ఆత్మార్థ పూజ' అంటారు. దేవాలయాల్లో జరిగే ఆరాధన లోకోపకారం కోసం, లోకక్షేమం కోసం. కాబట్టి దాన్ని 'పరార్థ పూజ' అంటారు. కనుక గృహారాధన విగ్రహాలు ఆ ఇంటి యజమాని చేతిలోని కొన్ని ముఖ్యమైన భాగాల ప్రమాణాన్ని బట్టి ఉండాలి. దీనిలో నాలుగు విధానాలు ఉన్నాయి.

హస్తప్రమాణం: సాధారణంగా ఒక మనిషి దేహం అతని అరచేతికి ఎనిమిదిరెట్లు ఉంటుంది. అరచేతితో సమానంగా అతని ముఖం ఉంటుంది. అలాగే పాదం ముందుభాగం అరచేతి కొలతతో సరిపోతుంది. శిల్పశాస్త్రంలో ఈ అరచేతి కొలతను 'హస్తప్రమాణం' అని, ఆ కొలతలను అనుసరించే విధానాన్ని 'తాళమానం' అని పిలుస్తారు. ఎక్కువలో ఎక్కువ ఆ హస్త ప్రమాణానికి మించి విగ్రహాలు ఉండకూడదని 'పద్మసంహిత' చెబుతోంది. యజమాని అరచేతి కొలతను తీసుకొని, విగ్రహం పాదం నుంచి లలాటం వరకూ కొలతను దానికి సమానంగా నిర్ణయించాలి. అదనంగా ప్రమాణం ప్రకారం కిరీటం, పాదపీఠం చేర్చి, విగ్రహం ఎత్తును నిర్ణయించాలి. అలా తయారుచేసిన విగ్రహాలకు ఆచార్యులద్వారా ప్రాణప్రతిష్ఠ చేయించి, ఆరాధనలు జరుపుకోవాలి. ఇంత ఎత్తుగా పూజలో పెట్టుకున్న విగ్రహాలకు నిత్య ఆరాధన చేయాలి, వండిన పదార్థాలను ప్రతిరోజూ నివేదన చేయాలి.

హృదయప్రమాణం: విగ్రహం యజమాని కుడిచేతి గుప్పెడంత ఉండాలని మన ఋషులు చెప్పారు. దాన్ని నేటి పరిస్థితికి అన్వయించుకుంటే... మనిషి గుండె అతని గుప్పెడంత ఉంటుందని ఆధునిక విజ్ఞానం కూడా ధ్రువపరిచింది. అందుకే తిరువారాధనలో ఉంచే విగ్రహాలకు హృదయప్రమాణాన్ని కూడా నిర్దేశించారు. యజమాని అరచేతిని గుప్పెడుగా బిగించి, ఆ కొలతతో విగ్రహం ఎత్తును పాదాది లలాటాంతం (అరికాలి నుంచి నుదుటి వరకు) స్థిరపరచి, కిరీటాన్ని, పీఠాన్ని చేర్చి విగ్రహం నిర్మిస్తారు. లేదా విగ్రహం మొత్తం ఎత్తును ఆ కొలతలో ఇమిడేలా చేస్తారు.

అంగుష్ఠప్రమాణం: యజమాని కుడిచేతి బొటనవేలు కొలతతో విగ్రహాన్ని తయారుచేసే పద్ధతి కూడా ఉంది. దేహంలో అన్ని భాగాలూ ముఖ్యమైనవే. కానీ అందులోని అతి ముఖ్యమైన భాగాలలో కుడిచేతి బొటనవేలు ఒకటి. మహాభారతంలో ద్రోణాచార్యుడు... తననే ఆచార్యునిగా భావించి, సొంతంగా విలువిద్యను అభ్యసించిన ఏకలవ్యుణ్ణి కట్టడి చేయడానికి... గురుదక్షిణగా కుడిచేతి బొటనవేలును అడిగిన కథ మనకు తెలుసు. దీన్నిబట్టి దాని ప్రాధాన్యత మనకు అర్థమవుతుంది. మన ప్రాచీన శిల్ప శాస్త్రాలలో అంగుష్ఠప్రమాణంతో విగ్రహాలు నిర్మించి, ఆరాధన చేసే సంప్రదాయాన్ని కూడా నిర్దేశించారు.

మాత్రాప్రమాణం: యజమాని కుడిచేతి మధ్యవేలి మధ్య కణుపు ఎత్తు కానీ, వెడల్పుకానీ, చుట్టుకొలతను కానీ ప్రమాణంగా లెక్కిస్తే వచ్చే పొడవును 'మాత్రాంగుళం' అంటారు. దేవాలయాల్లో ప్రతిష్ఠించే విగ్రహాల కొలత తీసుకొనేటప్పుడు ఈ మాత్రాంగుళానికి కూడా చాలా ప్రాధాన్యం ఉంటుంది. గృహారాధనలో పైనచెప్పిన మూడు కొలతల్లో ఏదో ఒకదాన్ని తీసుకొని విగ్రహ నిర్మాణం చేసుకోవచ్చు.



డి.యన్.వి. ప్రసాద్ స్థపతి
9440525788

జీవన మకరందం

చింతన

"యద్యతా చరతి శ్రేష్ఠ స్తత్తదేవత రోజనః... సయత్ప్రమాణాం కురుతే లోకస్తదనువర్తతే... ఉత్తములు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తారో... ప్రపంచమంతా దానినే అనుసరిస్తారు, ఆచరిస్తారు" అంటోంది భగవద్గీత. కాబట్టి అందరికీ ఆదర్శంగా మన నడవడిక ఉండాలి. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడుపడాలని మహాకవి గురజాడ హితవు పలికారు. దీన్ని ఆచరిస్తే మానవ జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. మనకు కష్టమయినా, నష్టమయినా ఎదుటివారికి మంచి జరగాలన్న అభిలాష... మానవ సంబంధాలలో అద్భుతమైన విజయాలను అందిస్తుంది. జీవితంలో ఓటమి ఎదురైనప్పుడు... దానికి కారణాలేమిటో అన్వేషించడం, గెలుపు సాధ్యమైనప్పుడు గర్వాన్ని పొందకుండా మరింత బాధ్యతాయుతంగా ఉండడం, మనస్సు ఆందోళన చెందినప్పుడు సహనంతో విశ్లేషించుకోవడం లాంటి లక్షణాలు మన విజయానికి శ్రీరామరక్ష. ఎప్పుడూ ప్రసన్నవదనంతో శాంతంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. ధర్మాన్ని ఆచరిస్తే దిగ్విజయంగా, పరోపకారాన్ని ఆకాంక్షిస్తే క్షేమంగా మన జీవిత గమనాన్ని సాగించవచ్చు.

ధీరత్వానికి ప్రతీకలు

'నవ్వుతూ బతకాలి' అనేది ఆధునిక సాంకేతిక యుగంలో సముచితమైన జీవన విధానం. నవ్వు అనారోగ్యాలను తరిమికొట్టే జీవ రసాయనం. వైద్య శాస్త్రం కూడా దీన్ని ఒక దివ్యౌషధంగా అంగీకరించింది. అలాగే సంగీతం అనేక రుగ్మతలను పారద్రోలే సాధనంగా ఇటీవల నిరూపితమవుతోంది. ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి హాస్యరసం కూడా చక్కటి పాత్ర పోషిస్తుంది. "ఆపదలు, కష్టాలు మనిషి ధీరత్వానికి ప్రతీకలు" అని షేక్స్‌పియర్ చెబుతాడు. ప్రాకృతిక నియమానుసారం సుఖదుఃఖాలు అనేవి సహజం. వాటిని జీవన ధర్మంగా, ప్రకృతి అమరికగా భావించాలి.



లక్ష్యం లేని జీవితం వ్యర్థం. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు పెద్దలు. జీవితంలో విజయం సాధించినవారిని ఆదర్శంగా తీసుకొని, సముచిత రీతిలో కృషిచేస్తే మనిషి ఋషిగా మారడానికి, అర్థవంతమైన జీవితాన్ని సాధించడానికి సదవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అనేక కోణాల్లో మన జీవితాలను సుసంపన్నం చేసుకుంటూ... జీవన మకరందాన్ని ఆస్వాదించవచ్చు.

• శ్రీగిరి గోపాలకృష్ణ,
9666436415

ముత్యాల ముగ్గు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్
జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్
features@andhrajyothy.com



ప్రయాణికులకు రూ.10 వేల వోచర్లు

- ఈ నెల 3, 4, 5 తేదీల్లో విమానాల రద్దుతో తీవ్రంగా ఇబ్బందిపడ్డ వారికి ఇస్తామన్న ఇండిగో
- ఏడాదిలోగా ఎప్పుడైనా వాడుకోవచ్చని వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 11: విమానాల రద్దుతో తీవ్రంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు కాసింత అదనపు పరిహారం ఇచ్చేందుకు ఇండిగో ముందుకొచ్చింది. ఈనెల 3, 4, 5 తేదీల్లో విమానాలు రద్దయి చాలా మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని.. వారిలో కొందరు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని పేర్కొంది. అలా తీవ్రంగా ఇబ్బందిపడిన ప్రయాణికులకు రూ.10 వేల చొప్పున వోచర్లు ఇస్తామని గురువారం ప్రకటించింది. ప్రయాణ సమయానికి 24గంటల్లోపు విమానం రద్దయితే ఇచ్చే సాధారణ పరిహారానికి ఇది అదనమని తెలిపింది. ఏడాదిలోగా ఎప్పుడైనా ఇండిగో టికెట్ల బుకింగ్ కోసం ఈ వోచర్లను వినియోగించుకోవచ్చని పేర్కొంది. దేశవ్యాప్తంగా విమాన సర్వీసులను దాదాపు పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్టు తెలిపింది. మొత్తం 138 ప్రాంతాలకు 1,900కుపైగా సర్వీసులను నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. ముందస్తు సమాచారం లేకుండా విమాన సర్వీసులేవీ రద్దు చేయడంలేదని.. వాతావరణం, సాంకేతిక సమస్యలతో మాత్రం పలు సర్వీసులు రద్దయ్యాయని పేర్కొంది. కాగా, పరిహారం వోచర్లు ఇచ్చేందుకు తీవ్రంగా ఇబ్బందిపడిన ప్రయాణికులను ఎలా గుర్తిస్తుంది, ఇందుకు ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందన్న విషయాన్ని ఇండిగో వెల్లడించలేదు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇండిగో సంక్షోభం మొదలైన విషయం తెలిసిందే. 3, 4, 5 తేదీల్లో అయితే వేలకొద్దీ విమాన సర్వీసులు రద్దయ్యాయి. పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. గురువారం కూడా 150కిపైగా విమానాలను ఇండిగో రద్దు చేసింది. అందులో ఒక్క బెంగళూరు విమానాశ్రయం నుంచే 60 సర్వీసులు ఉండటం గమనార్హం.

డీజీసీఏ ముందుకు ఇండిగో సీఈవో..

డీజీసీఏ ఆదేశాల మేరకు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, ఇతర ఉన్నతాధికారులు గురువారం డీజీసీఏ అధికారుల ముందు హాజయ్యారు. గత పది రోజులుగా విమాన సర్వీసులు, రద్దు, పైలట్లు, సిబ్బంది సంఖ్య, ఇతర వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వారి నుంచి డీజీసీఏ అధికారులు పలు వివరాలు తెలుసుకుని, కీలక సూచనలు చేశారు. తిరిగి శుక్రవారం కూడా డీజీసీఏ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశించారు. మరోవైపు డీజీసీఏ నియమించిన ప్రత్యేక కమిటీ గురువారం గుర్‌గావ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి వెళ్లింది. విమాన సర్వీసుల నిర్వహణ, రద్దు, పైలట్లు, సిబ్బంది హాజరు, ప్రయాణికులకు రీఫండ్లు, లగేజీ తిరిగి అందజేయడం తదితర అంశాలను సమీక్షించింది.

లోకం తీరు



ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై సమీక్ష

- భారత్-అమెరికా 'కాంపాక్ట్' అమలుపై చర్చ
- ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- స్నేహపూర్వక సంభాషణ జరిగిందని వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 11: ప్రధానమంత్రి మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడారు. భారత్-అమెరికాల మధ్య సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురు నేతలు సమీక్షించారు. ద్వైపాక్షిక సంబంధాల్లో వృద్ధిపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచుకోవడంపైనా చర్చించినట్లు విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సంక్లిష్ట సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. 21 శతాబ్దపు ప్రయోజనాల కోసం భారత్-అమెరికా 'కాంపాక్ట్ (సైనిక భాగస్వామ్యం; వాణిజ్యం, సాంకేతికతల్లో మరింత సహకరించుకోవడం)' కార్యక్రమ అమలుపై కూడా మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. కీలకమైన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా మోదీ, ట్రంప్ చర్చించినట్లు తెలిపారు. పుతిన్ భారత పర్యటన అనంతరం మోదీ-ట్రంప్ సంభాషించుకోవడం ఇదే తొలిసారి. కాగా, భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిపై ట్రంప్‌తో సమీక్షించినట్లు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో స్నేహపూర్వక, ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని మేం సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా చర్చించాం. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం భారత్-అమెరికాలు కలిసి పనిచేస్తూనే ఉంటాయి" అని ప్రధాని పేర్కొన్నారు.

రష్యా చమురు దిగుమతులు పైపైకి!

అమెరికా ఆంక్షలను లెక్కచేయని భారత్

న్యూఢిల్లీ, డిసెంబరు 11: రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు విధిస్తున్నా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే అంశంలో భారత్ వెనక్కి తగ్గడం లేదు. ఎప్పటిలానే రష్యా చమురును పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. డిసెంబరులో సగటున రోజుకు 18.5 లక్షల చమురు బ్యారెళ్లను దిగుమతి చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. దీంతో ఈ దిగుమతులు ఆరు నెలల గరిష్ఠానికి చేరనున్నాయి. కమోడిటీ ఎనలిస్ట్ కెప్లర్ ఈ మేరకు అంచనా వేసింది. కెప్లర్ నివేదిక ప్రకారం.. భారత్ అక్టోబరు నెలలో రోజుకు సగటున 14.8 లక్షల బ్యారెళ్ల చమురును రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. నవంబరులో ఆ సంఖ్య 18.3 లక్షల బ్యారెళ్లకు పెరిగింది. డిసెంబరులో ఆ సంఖ్య 18.5 లక్షల బ్యారెళ్లకు చేరే అవకాశం ఉంది. 2025 జూన్ తర్వాత ఇదే అత్యధికం. ఈ ఏడాది జూన్‌లో భారత్ రోజుకు 21లక్షల చమురు బ్యారెళ్లను దిగుమతి చేసుకుంది.

అమెరికాలో ప్రసవం కోసమే అయితే టూరిస్టు వీసా ఇవ్వం

- రాయబార కార్యాలయం ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 11: అమెరికాలో బిడ్డకు జన్మ ఇవ్వాలన్న ప్రణాళికతో టూరిస్టు వీసా కావాలని కోరితే అందుకు ట్రంప్ ప్రభుత్వం నిరాకరించనుంది. అమెరికా భూభాగంపై జన్మించే వారికి సహజసిద్ధ పౌరసత్వం రానుండడంతో ఆ నిబంధనను అవకాశంగా తీసుకొని ఆ దేశంలో ప్రసవం చేసుకోవాలని కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. ఇకపై ఇలాంటి అడ్డదారులను మూసివేయనున్నట్టు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. "పౌరసత్వం పొందడం కోసం అమెరికా భూభాగంపై బిడ్డకు జన్మనిచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు సూచన ప్రాయంగా తెలిసినా అలాంటి వారి వీసా దరఖాస్తులను పరిశీలించబోం. అలాంటి వారికి కాన్సులేట్ అధికారులు టూరిస్టు వీసాలను తిరస్కరిస్తారు. అనుమతించేది లేదు" అని స్పష్టం చేసింది.

ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

- అదే రోజున సంస్కరణలపై రిఫరెండం కూడా..: ఈసీ

ఢాకా, డిసెంబరు 11: బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 12న జరగనున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏఎంఎం నసీర్ ఉద్దీన్ గురువారం జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రకటించారు. మొత్తం 300 స్థానాలకు ఆ రోజు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఈ నెల 29 నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థుల ఆందోళన కారణంగా గత ఏడాది ఆగస్టులో అవామీలీగ్ పార్టీకి చెందిన షేక్ హసీనా ప్రభుత్వాన్ని తొలగించడంతో తాజాగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. ఎన్నికలతో పాటుగా ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణలపై ప్రజాభిప్రాయం సేకరించేందుకు అదే రోజున రిఫరెండం కూడా నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషనర్ తెలిపారు.

త్వరలో భారత్‌లో ఇజ్రాయెల్ ప్రధాని పర్యటన

జెరూసలేం, డిసెంబరు 11: తాను, భారత్ ప్రధాని నరేంద్రమోదీ త్వరలో కలుసుకోనున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఈ మేరకు మోదీ, నెతన్యాహు ఫోన్‌లో జరిగిన సంభాషణల్లో అంగీకారం కుదిరిందని ఇజ్రాయెలీ పీఎంవో గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'ఇరు నేతల మధ్య సుహృద్భావ వాతావరణంలో జరిగిన చర్చల్లో కలుసుకోవడానికి అంగీకారం కుదిరింది' అని ఆ పోస్టులో తెలిపారు. వివిధ రంగాల్లో వాణిజ్యంపై స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడానికి ఇరు దేశాల మంత్రులు పరస్పరం భారత్, ఇజ్రాయెల్‌లలో పర్యటిస్తున్న నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ ప్రధాని పర్యటనపై ఆసక్తి నెలకొంది.

పలు రాష్ట్రాల్లో 'సర్' గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 11: తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేంద్రపాలిత ప్రాంతం అండమాన్- నికోబార్ దీవుల్లో సర్ గడువును పొడిగిస్తున్నట్లు ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో డిసెంబరు 14 వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్- నికోబార్ దీవుల్లో డిసెంబరు 18 వరకు, ఉత్తరప్రదేశ్‌లో డిసెంబరు 26 వరకు గడువును పెంచింది. ఆయా తేదీల ప్రకారం ముసాయిదా జాబితా ప్రచురణ తేదీలను కూడా సవరించింది. గడువు పొడిగించిన రాష్ట్రాల్లో పశ్చిమబెంగాల్‌ను మినహాయించడం విశేషం. ప్రస్తుతం 9 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. వాటిలో బెంగాల్, రాజస్థాన్, గోవా రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి, లక్షదీవుల్లో గడువు యథాతథంగా గురువారంతో ముగిసింది.

ఒకే జిల్లాలో 7400 హెచ్ఐవీ కేసులు!

- బిహార్‌లోని సీతామఢీ జిల్లాలో నిర్ధారణ
- వీరిలో 400 మంది చిన్నారులు కూడా!

పట్నా, డిసెంబరు 11: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కొన్నిచోట్ల ప్రజలు అవగాహన లోపంతో ఆ వైరస్ బారిన పడుతూనే ఉన్నారు. బిహార్‌లోని సీతామఢీ జిల్లాలో ఏకంగా 7400 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నట్లు ఓ అధికారిక నివేదిక పేర్కొంది. వీరిలో 400 మంది చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపింది. జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ నిర్వహించిన పరీక్షల్లో.. ఈ చిన్నారులకు తమ తల్లిదండ్రుల ద్వారా ఈ వ్యాధి సంక్రమించినట్లు నిర్ధారణ అయింది. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు హెచ్ఐవీ బారిన పడితే.. వారి పిల్లలు పుట్టుకతోనే ఈ వైరస్ బాధితులవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రజల్లో హెచ్ఐవీ పట్ల సరైన అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమని వారు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రతి నెలా 50 నుంచి 60 దాకా హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నిర్ధారణ అవుతున్నాయని, ప్రస్తుతం 5వేల మందికి పైగా వైద్య చికిత్స అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హసీన్ అక్తర్ తెలిపారు.

పాక్‌పై అమెరికా వల్లమాలిన ప్రేమ!

- ఎఫ్-16 ఫైటర్ జెట్ల ఆధునికీకరణకు గ్రీన్‌సిగ్నల్

ఇస్లామాబాద్, డిసెంబరు 11: అగ్రరాజ్యం అమెరికా.. పాకిస్థాన్‌పై మరోసారి వల్లమాలిన ప్రేమను చాటుకుంది..! పాక్‌కు భారీగా సైనిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. పాకిస్థాన్ వాయుసేనకు చెందిన ఎఫ్-16 ఫైటర్ జెట్ల ఆధునికీకరణ, ఇతర సాంకేతిక సాయం కోసం 68.6 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,196 కోట్లు) విలువైన ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా పాక్‌కు అత్యాధునిక సాంకేతికత, విడిభాగాలు, నిర్వహణ వంటి సాయం అందించనుంది. ఈ మేరకు అమెరికాకు చెందిన రక్షణ భద్రత సహకార సంస్థ (డీఎస్‌సీఏ) యూఎస్ కాంగ్రెస్‌కు లేఖ పంపినట్టు పాకిస్థాన్‌కు చెందిన డాన్ పత్రిక గురువారం వెల్లడించింది.

విదేశీ విద్యార్థులను వెనక్కు వెళ్లనివ్వటం సిగ్గుచేటు

- ప్రతిభావంతులైన భారత, చైనా విద్యార్థులను తిరిగి వెళ్లనివ్వద్దు
- అమెరికాలోనే నియమించుకోవాలి
- గోల్డ్ కార్డు కొన్నవాళ్లకు ఐదేళ్లలోనే అమెరికా పౌరసత్వం
- ట్రంప్ వెల్లడి.. గోల్డ్ కార్డు విడుదల
- అమెరికా కంపెనీల అధినేతలతో భేటీ



పలు అమెరికా కంపెనీల ప్రతినిధులతో భేటీఅయిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్, డిసెంబరు 11: భారత్, చైనా వంటి దేశాల నుంచి వచ్చి అమెరికాలోని అత్యుత్తమ కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతిభావంతులైన విద్యార్థులను తిరిగి స్వదేశాలకు వెళ్లనివ్వటం సిగ్గుచేటు అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అలాంటి విద్యార్థులకు అమెరికన్ కంపెనీలు ఉద్యోగాలిచ్చి అమెరికాకే సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఆ దేశ టాప్ కంపెనీల అధిపతులకు సూచించారు. పలు కంపెనీల సీఈవోలతో బుధవారం ఆయన అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ట్రంప్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'ట్రంప్ గోల్డ్ కార్డ్'లను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను అమెరికాలోనే ఉంచేందుకు కంపెనీలు వారి కోసం గోల్డ్ కార్డులను కొనుగోలు చేయాలని సూచించారు. 'అమెరికాలోని అత్యుత్తమ విద్యా సంస్థలైన వార్టన్, హార్వర్డ్, ఎంఐటీ తదితర వాటిల్లో చదివి, టాప్‌లో నిలుస్తున్న విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత తిరిగి వారి దేశాలకు వెళ్లాల్సి వస్తోంది. వారు ఇక్కడ ఉండటం కష్టంగా (ప్రస్తుత వీసా నిబంధనల నేపథ్యంలో) మారింది. ఇది సిగ్గుచేటు. ఈ పరిస్థితిని మార్చేందుకే వీసా ఆధారిత గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నాం. అత్యుత్తమ వీసా విధానం తీసుకురావాలని యాపిల్ సీఈవో టిమ్ కుక్ నన్ను ఎన్నోసార్లు కోరారు. అమెరికాలో ఉండనిస్తారో, ఉండనివ్వరో తెలియని విద్యార్థులను వర్సిటీ క్యాంపస్‌ల నుంచి ఎలా నియమించుకోవాలి? అని ఆయన నన్ను అడిగారు. ఇప్పుడు ట్రంప్ గోల్డ్ కార్డు ఈ సమస్యకు చక్కని పరిష్కారం చూపుతుంది' అని పేర్కొన్నారు. గోల్డ్ కార్డు ద్వారా అమెరికా ఖజానాకు వేలకోట్ల డాలర్ల సంపద వచ్చి చేరుతుందని ఆయన చెప్పారు.

అమెరికా పౌరసత్వానికి అత్యుత్తమ మార్గం

త్వరగా అమెరికా పౌరసత్వం సంపాదించి, ఇక్కడే స్థిరపడాలనుకునే వారికి ట్రంప్ గోల్డ్‌కార్డు అత్యుత్తమ మార్గమని ట్రంప్ తెలిపారు. 'గోల్డ్ కార్డు కూడా గ్రీన్ కార్డే. కానీ, అంతకంటే ఉత్తమమైనది, ఇది గొప్ప వ్యక్తులకు లభిస్తుంది. ఉదాహరణకు వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్‌లో క్లాస్ ఫస్ట్ వచ్చిన విదేశీ విద్యార్థిని ఐబీఎం సంస్థ ఉద్యోగంలోకి తీసుకోవాలని అనుకుంది. కానీ, ఆ విద్యార్థి చదువు పూర్తవ్వగానే స్వదేశం వెళ్లిపోతాడు కాబట్టి ఉద్యోగంలో నియమించుకోవటం సాధ్యం కాదు. అలాంటప్పుడు ఆ విద్యార్థి కోసం ఐబీఎం గోల్డ్ కార్డు కొనుగోలు చేస్తే సరిపోతుంది' అని ట్రంప్ వివరించారు.

కార్డు తీసుకున్న ఐదేళ్లలో పౌరసత్వం: లుట్నిక్

ట్రంప్ గోల్డ్ కార్డు ప్రయోజనాలను అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ సమావేశంలో వివరించారు. 'ట్రంప్ గోల్డ్ కార్డును వ్యక్తులు వ్యక్తిగతంగా కొనుగోలు చేస్తే 10 లక్షల డాలర్లకు లభిస్తుంది. అమెరికా కంపెనీ ఒక విదేశీ ఉద్యోగిని ఇక్కడే నియమించుకొని, అతడికి అమెరికా పౌరసత్వం వచ్చేలా చేయాలనుకుంటే 20 లక్షల డాలర్లకు లభిస్తుంది. గోల్డ్ కార్డు కొనుగోలు చేసిన వ్యక్తిని అన్ని విధాలుగా పరీక్షించి, అమెరికాకు పనికివచ్చే అత్యుత్తమ వ్యక్తి అని నిర్ధారణకు వస్తే ఐదేళ్లలో అమెరికా శాశ్వత పౌరసత్వం జారీచేస్తాం. గోల్డ్ కార్డులవల్ల విదేశీ ఉద్యోగుల్లో ఉత్తమ ప్రతిభావంతులు మాత్రమే అమెరికాకు రాగలరు. పాత వీసా విధానంతోనే అత్యుత్తమ నైపుణ్యాంగల వారిని అమెరికాలోకి ఆహ్వానించాలన్న అధ్యక్షుడు ట్రంప్ ఆలోచనే ఈ గోల్డ్ కార్డు' అని వివరించారు. అలాగే 'ట్రంప్‌కార్డ్.జీవోవీ' పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించి దరఖాస్తులు ఆహ్వానించటం మొదలుపెట్టారు.



అమెరికా రాజకీయాల్లో మోదీ-పుతిన్ సెల్ఫీ కలకలం

- భారత్ పట్ల ట్రంప్‌నకు ఘర్షణాత్మక వైఖరి ఎందుకు?
- ఇలా అయితే మీకు నోబెల్ రాదు.. ఓ చట్టసభ్యురాలి వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబరు 11: ఇటీవల మనదేశంలో రెండ్రోజులు పర్యటించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు విమానాశ్రయంలో స్వాగతం పలికిన ప్రధాని మోదీ.. ఆయనతో కలిసి కారులో తన అధికార నివాసానికి వెళుతున్నప్పుడు తీసుకున్న సెల్ఫీ అమెరికా రాజకీయాల్లో కలకలం రేపుతోంది. భారీ సుంకాల విధింపు, ఘర్షణాత్మకమైన వైఖరిని అవలంబించడం ద్వారా అమెరికాకు ఎంతో విశ్వసనీయ దేశమైన భారత్‌ను అధ్యక్షుడు ట్రంప్ రష్యాకు దగ్గర చేస్తున్నారని డెమోక్రాట్ సభ్యురాలు సిడ్నీ కమ్‌లాగర్ విమర్శించారు. చైనాపై విధిస్తున్న సుంకాల రేటుకన్నా భారత్‌పై విధిస్తున్న సుంకాల రేటే అధికంగా ఉందని పేర్కొన్నారు. ట్రంప్ తన తీరును మార్చుకోకపోతే అధ్యక్షుడిగా ఆయన హయాంలోనే భారత్‌తో స్నేహాన్ని అమెరికా కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలను శత్రుదేశాల చేతుల్లోకి నెట్టడం ద్వారా మీకు నోబెల్ బహుమతి రాదు" అని ట్రంప్‌ను ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ పరిరక్షణకు భారత్ ఆవశ్యకతను మరో చట్టసభ్యుడు బిల్ హుయిజింగా నొక్కి చెప్పారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా అమెరికా, భారత ప్రజలు సవాళ్లు ఎదుర్కొంటున్నారని చట్టసభ్యురాలు ప్రమీలా జయపాల్ ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళలు అట్లకాడలతో సిద్ధం కండి

- ఎస్ఐఆర్‌ను అడ్డుకోవాలి: మమత

కోల్‌కతా, డిసెంబర్ 11: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై వివాదం వేడెక్కుతున్న వేళ.. ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ బీజేపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం మహిళల హక్కుల్ని లాక్కోవాలని చూస్తోంది. తల్లులారా.. సోదరీమణులారా.. ఓటర్ల జాబితా సమీక్ష పేరుతో మీ పేర్లు తొలగిస్తే చూస్తూ ఊరుకోకండి. మీ వంటింట్లో ఉన్న అట్లకాడలు, గరిటెలు ఇతర ఆయుధాలతో పోరాటానికి సిద్ధం కండి " అని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు. బెంగాల్‌లోని కృష్ణానగర్ ప్రాంతంలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్న ఆమె ప్రసంగిస్తూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది బెంగాలీ ఓటర్ల పేర్లను తొలగించేందుకు కేంద్రం, ఎన్నికల సంఘం కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించారు. అర్హుడైన ఒక్క ఓటరు పేరు తొలగించినా నిరవధిక ధర్నాకు దిగుతానని ఆమె హెచ్చరించారు.

భారత్, చైనా సహా పలు దేశాలపై మెక్సికో సుంకాల కొరడా

- వాణిజ్య ఒప్పందం లేని దేశాలపై 50% దాకా సుంకాల పెంపు బిల్లుకు ఓకే



న్యూఢిల్లీ, డిసెంబరు 11: తమపై సుంకాల కొరడా ఝుళిపిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు.. మెక్సికో దేశం తమతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలూ లేని దేశాలపై సుంకాల బాదుడుకు సిద్ధమైంది! 2026 జనవరి 1 నుంచి.. ఆయా దేశాల నుంచి తమ దేశానికి దిగుమతి అయ్యే ఆటోమొబైల్, ఆటో విడిభాగాలు, జౌళి, ప్లాస్టిక్, ఉక్కు ఉత్పత్తులపై సుంకాలను 50 శాతం దాకా పెంచుతూ రూపొందించిన బిల్లును మెక్సికో సెనెట్ బుధవారం ఆమోదించింది. ఈ నిర్ణయం వల్ల ప్రధానంగా ప్రభావితమయ్యేది భారత్, చైనా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా తదితర ఆసియా దేశాలే. భారత్, చైనాలపై ఇతర దేశాలు కూడా భారీగా సుంకాల భారం మోపాలని ట్రంప్ కోరుకుంటున్న సంగతి తెలిసిందే. 2020 జూలైలో కుదిరిన 'అమెరికా-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం'పై 2026 జూలైలో సమీక్ష జరగనుంది. ఇప్పటికే మెక్సికోపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న ట్రంప్.. ఆ సమీక్షలో అమెరికాకు ప్రయోజనాలు కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే తమ దేశానికి నష్టమని భావించడం వల్లనే.. ఆయన్ను మెప్పించేందుకు మెక్సికో ఈ నిర్ణయం తీసుకుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, మెక్సికో నేతలు మాత్రం తమ స్థానిక పరిశ్రమలు, తయారీదారులకు ఊతం ఇవ్వడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. సుంకాల పెంపు వల్ల వచ్చే ఏడాది తమ దేశానికి రూ.33,910 కోట్ల మేర అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

భారత్‌పై ఏ మేరకు ప్రభావం అంటే..

మెక్సికోతో భారత్ వాణిజ్యం 2024లో గరిష్ఠంగా 11.7 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.1.05 లక్షల కోట్లకు) చేరింది. ఇందులో మెక్సికోకు భారత్ ఎగుమతుల విలువ 8.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.80 వేల కోట్లు) కాగా.. అక్కణ్నుంచి మనం దిగుమతి చేసుకునే ఉత్పత్తుల విలువ 2.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25 వేల కోట్లు)గా ఉంది. మెక్సికన్ ఉత్పత్తులకు భారత్ తొమ్మిదో అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఇలాంటి సమయంలో మెక్సికో తీసుకున్న నిర్ణయం ప్రభావం ఇరుదేశాల వాణిజ్యంపై పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా.. మనదేశం నుంచి మెక్సికో దిగుమతుల్లో కార్లు, ఆటో విడిభాగాలు, ఇతర వాహనాలు ఎక్కువగా ఉన్నాయి. సుంకాల ప్రభావం వచ్చే ఏడాది వీటిపై ఎక్కువగా పడే ప్రమాదం ఉంది.

'ఆధార్' ఆదర్శం కాదు!

దాంతో భారత్‌లో అనేక సమస్యలు.. ఈ విధానాన్ని అమలు చేయొద్దు

- అంతర్జాతీయ సమాజానికి భారతీయ ప్రముఖులు, సంస్థల సూచన



న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పౌరుల గుర్తింపునకు సంబంధించి భారత్ అమలుపరిచిన ఆధార్‌ను.. ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకోవాలంటూ ప్రపంచబ్యాంకు చేపట్టిన ఐడీ4డీ ప్రాజెక్టును పలువురు భారతీయ ప్రముఖులు, సంస్థలు తప్పుబట్టాయి. ఆధార్‌తో భారత్‌లో పలు సమస్యలు తలెత్తాయని, ఈ తరహా విధానాన్ని అమలు చేయవద్దని కోరాయి. ఈ మేరకు అంతర్జాతీయ సమాజాన్ని ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశాయి. దీని మీద 50కిపైగా కార్మిక, విద్యార్థి, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, 200 మందికిపైగా ప్రముఖులు సంతకాలు చేశారు. భారీ ప్రచారం మధ్య 2009లో ఆధార్‌ను తీసుకొచ్చారని, తొలిరోజుల్లో ఇది స్వచ్ఛందమేగానీ తప్పనిసరి కాదని చెప్పారని ప్రకటనలో గుర్తు చేశారు. ప్రస్తుతం పౌరులందరికీ ఆధార్ తప్పనిసరి అన్న పరిస్థితి ఉందన్నారు. ఆధార్ పేరుతో కోట్లాదిమంది ప్రజల వివరాలు, ఫొటో, బయోమెట్రిక్ వివరాలు సేకరించారని, దేశంలో ఒక నియంతృత్వ ప్రభుత్వం ఉంటేగనుక.. ఈ వివరాలన్నీ ప్రజల్ని నియంత్రించటానికి ఒక సాధనంగా ఉపయోగపడతాయని హెచ్చరించారు. ఆధార్‌తో దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను, వ్యక్తుల బ్యాంకు ఖాతాల వంటి ప్రైవేటు వ్యవహారాలను కూడా అనుసంధానించారని.. ఇది ప్రజలపై నిఘాకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. సమాచారాన్ని కేంద్రీకరించటం వల్ల.. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే యావత్ సమాచార వ్యవస్థ కుప్పకూలే అవకాశం ఉందని చెప్పారు. పౌరుల ఆధార్‌కార్డుల్లోని వివరాలను ఆధార్ కేంద్రాల నిర్వాహకుల వంటి వారు సులువుగా చూడగలుగుతున్నారని, ఇది వ్యక్తుల గోప్యతకు భంగకరమని పేర్కొన్నారు. ఆధార్ నమోదులో తప్పులు దొర్లాయని, వాటిని సరిదిద్దుకునే ప్రక్రియ సంక్లిష్టంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారని వివరించారు. ఆధార్ వల్ల అవినీతి తగ్గుతుందన్న లక్ష్యం నెరవేరలేదని తెలిపారు. బ్యాంకు ఖాతాలనూ ఆధార్‌తో అనుసంధానించటం వల్ల కొత్త తరహా మోసాలకు ఆస్కారం కల్పించినట్లయిందన్నారు. ప్రభుత్వ నియంత్రణ, నిఘా వంటి వాటికి అవకాశం లేకుండా పలు దేశాల్లో పౌరుల గుర్తింపు వ్యవస్థలు కొనసాగుతున్నాయని, ఆధార్ కంటే అవి మేలైనవని సూచించారు. ఈ ప్రకటన మీద సంతకాలు చేసిన వారిలో ఆనంద్ పట్వర్ధన్, ఆనంద్ తేల్‌తుంబ్డే, అరుంధతీ రాయ్, బెజవాడ విల్సన్, జస్టిస్ ఏపీ షా, పీ సాయినాథ్, టీఎం కృష్ణలతోపాటు పీయూసీఎల్, మంజీరా దళిత సేవా సమితి, ఐద్వా, ఏఐఎస్ఏ తదితర సంఘాలున్నాయి.

షా చేతులు వణికాయి

- అమిత్ షా మానసిక ఒత్తిడిలో ఉన్నారు
- ఆందోళనగా కనిపించారు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, డిసెంబరు 11: ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన ప్రశ్నలకు సమాధానం చెప్పేటప్పుడు ఆందోళనగా కనిపించారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రసంగించే సమయంలో షా చేతులు వణికాయన్నారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదన్నారు. షా తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్నారనేది దేశం మొత్తం చూసిందని రాహుల్ చెప్పారు. తాను అడిగిన ఒక్క ప్రశ్నకూ సూటిగా సమాధానం చెప్పలేకపోయారని, ఆధారాలు కూడా చూపించలేకపోయారని రాహుల్ ఆరోపించారు.

జ్వరంతోటే ప్రసంగం!

అయితే లోక్‌సభలో ప్రసంగించే సమయంలో అమిత్ షా కు 102 డిగ్రీల జ్వరం ఉందని, డాక్టర్ల సలహాతో ఆయన టాబ్లెట్లు వేసుకున్నారని బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది. అంతకుముందు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాహుల్ ఆరోపణలకు షా కౌంటరిచ్చారు. 90 నిమిషాలకు పైగా ప్రసంగించిన ఆయన కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం వల్లే ఎన్నికల్లో ఓడిపోతున్నారని.. ఓట్ చోరీ, ఈవీఎంల వల్ల కాదని ఎద్దేవా చేశారు. నిజానికి ఓట్ చోరీ చేసింది కాంగ్రెస్సేనంటూ ఆయన మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీతో పాటు పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్లను ప్రస్తావించారు.

మంత్రుల ఆలస్యంపై సీరియస్

మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గుమ్మిడి సంధ్యారాణి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ క్యాబినెట్ సమావేశానికి ఆలస్యంగా రావడంపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. మంత్రులే ఆలస్యంగా వస్తే ఎలాగని ప్రశ్నించారు. సాధారణంగా క్యాబినెట్ సమావేశం ఉదయం 11 గంటలకు ఉంటుంది. ఎజెండా ఎక్కువగా ఉండడంతో గురువారం ఉదయం 10.30కే మొదలుపెట్టారు. అయితే, కొందరు మంత్రులు ఎప్పటిలానే 11 గంటలకు వచ్చినట్లు సమాచారం.



అన్నీ నేనే చూడాలా?

మంత్రులూ చొరవ తీసుకోవాలి: ముఖ్యమంత్రి

- పరిశ్రమలకు భూకేటాయింపులు, రెవెన్యూ సమస్యలపై స్పందించండి
- రుషికొండపై నిర్ణయం ఇంత ఆలస్యమా?
- క్యాబినెట్ సబ్ కమిటీపై అసహనం

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు భూకేటాయింపుల్లో ఎదురవుతున్న సమస్యలు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌చార్జి మంత్రులు చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి అంశాన్నీ తానే పర్యవేక్షించాలా అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అప్పటికీ కాకుంటే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయడం, స్థానికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఇన్‌చార్జి మంత్రులే చొరవ తీసుకోవాలన్నారు. గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించిన అనంతరం ఆయన మంత్రులతో మాట్లాడారు. రుషికొండ ప్యాలెస్‌పై నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయాన్ని తీసుకోవడంలో జాప్యం చేస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగిస్తే మంచిదో వీలైనంత త్వరగా తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్ణీత సమయం పెట్టుకుని పనిచేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, సంబంధిత అధికారులకు సూచించారు. పర్యాటక శాఖ, అటవీశాఖ, దేవదాయ శాఖ కలిసి సంయుక్తంగా చేపట్టదగిన పర్యాటక ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయేమో పరిశీలిస్తే బాగుంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఈ ఆలోచన బాగుందని సీఎం అన్నారు. దీనిని పరిశీలించాలని సంబంధిత మంత్రులను, అధికారులను ఆదేశించారు.

చేనేత విద్యుత్ రాయితీలను వెంటనే అమలు చేయండి

సౌర విద్యుదుత్పత్తికి కేంద్రం పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తోందని, వీటిని ఉపయోగించుకుని పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాలను వేగవంతం చేయాలని సీఎం చెప్పారు. పగటి పూట విద్యుత్ వినియోగ భారాన్ని తగ్గించుకునేందుకు ఈ పథకాలు ఉపయోగపడతాయన్నారు. చేనేతలకు విద్యుత్ రాయితీలు ఇవ్వడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపినా ఇంకా అమలు చేయకపోవడాన్ని కొందరు మంత్రులు ప్రస్తావించారు. ఎందుకు అమలు చేయడం లేదని ఆర్థిక శాఖ అధికారులను సీఎం ప్రశ్నించారు. పీఎం సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు సబ్సిడీపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తుండడంతో, ఉచిత విద్యుత్ పథకాన్ని ఆపామని వారు చెప్పడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సూర్యఘర్‌తో సంబంధం లేకుండా చేనేతలకు విద్యుత్ రాయితీలను వెంటనే అందించాలని ఆదేశించారు.

జగనన్న కాలనీలపై అధ్యయనం

జగనన్న కాలనీలు చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వాటి విషయంలో ఏం చేయాలన్న దానిపై సమగ్రంగా అధ్యయనం చేసి ఒక నిర్ణయం తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇళ్లు కట్టుకోవడానికి ఇష్టపడని వారి స్థలాలను రద్దు చేసి ఇతరులకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.



డిప్యూటీ సీఎం పవన్‌కు పువ్వు ఇచ్చి కృతజ్ఞతలు చెబుతున్న మంత్రులు అనిత, డోలా, అనగాని, సవిత, నిమ్మల

మహిళల ఓటుబ్యాంకు మనదే కావాలి!

డబ్బుతోనే ఎన్నికల్లో గెలవలేం!

- చేసిన మంచి ప్రజలకు నిత్యం చెప్పుకోవాలి
- అప్పుడే గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి
- టీడీపీ నేతలకు చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డబ్బుతోనే ఎన్నికల్లో గెలవగలమని కొందరు భావిస్తుంటారని, కానీ మనం చేసే మంచి పనులను ప్రజలకు నిత్యం వివరించడం ద్వారా మాత్రమే మన విజయావకాశాలను మెరుగుపరచుకోగలమని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మహిళల ఓటు బ్యాంకు మెజారిటీ మనకే వచ్చేలా చూడాలని, ఇందుకోసం కార్యకర్తలు బాధ్యతతో, సమన్వయంతో పని చేయాలని సూచించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలకు హాజరైన మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఆయన 'కాఫీ కబుర్లు' నిర్వహించారు. ఏడాదికి రూ.33 వేల కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు ఇస్తున్నామని, అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీశక్తి పథకం, తల్లికి వందనం వంటి పథకాల అమలు గురించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని వారిని కోరారు. 'ప్రతి పోలింగ్ బూత్‌లో బలాబలాలు చూసుకోవాలి. ప్రతి బూత్‌లో మనం బలోపేతం కావడానికి ప్రయత్నం చేయాలి. బలహీన నియోజకవర్గానికి బలమైన నేత ఉంటే నియోజకవర్గం బలపడుతుంది.' అని వ్యాఖ్యానించారు.

శిక్షణ కార్యక్రమాలపై ఆరా..

శిక్షణ కార్యక్రమాలు ఎలా జరిగాయో చంద్రబాబు నేతలను అడిగి తెలుసుకున్నారు. పనిచేయడం ఒక ఎత్తయితే, చేసిన పని ప్రజల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తని వ్యాఖ్యానించారు. 'ఎన్టీఆర్ హయాంలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అప్పుడు ఎర్రటి ఎండలో చెట్ల కింద నిర్వహించేవాళ్లం. ఇప్పుడు చల్లటి ఏసీ గదుల్లో జరుపుతున్నాం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నాయకులు కూడా తమ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచుకోవాలి. పార్టీ సిద్ధాంతాలు, భావజాలం ప్రతి కార్యకర్తకు తెలియాల్సిన అవసరముంది. నేతలు, కార్యకర్తలను కలిసేందుకు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గతంలో టెక్నాలజీ ఉండేది కాదు. ఇప్పుడు టెక్నాలజీ పీక్స్‌కు వెళ్లింది' అని గుర్తుచేశారు.

కొత్తగా రూ.20 వేల కోట్ల పెట్టుబడులు




(మొదటిపేజీ తరువాయి)

విలేకరులకు వెల్లడించారు. ఇటీవల ఉద్యోగులు, పింఛనుదారులకు మంజూరు చేసిన డీఏ ఉత్తర్వులకు ఆమోదముద్ర వేసినట్లు చెప్పారు. నెలకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ వినియోగం కలిగిన 27.2 లక్షల మంది వెనుకబడిన వర్గాల వినియోగదారులకు (బీసీలకు) 2 కిలోవాట్ వరకు సామర్థ్యం గల రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం.. కేంద్రం అందించే రూ.60 వేల రాయితీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.20,000 సబ్సిడీ మంజూరు చేసే ప్రతిపాదనను క్యాబినెట్ ఆమోదించిందని తెలిపారు. ఈ పథకానికి సుమారు రూ.5,445.7 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. రూ.163 కోట్లతో అమరావతిలో గవర్నర్ నివాసం, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు అతిథిగృహాలు, సిబ్బంది క్వార్టర్లతో కూడిన లోక్‌భవన్ నిర్మాణానికి ఎల్-1 బిడ్ ఆమోదించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారమిచ్చే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

కీలక నిర్ణయాలివీ..

- ఐసీసీ మహిళల ప్రపంచ క్రికెట్ కప్‌లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు, కడపలో వెయ్యి చ.గజాల స్థలం, గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం.
- సౌరశక్తి, కెమికల్, ఫార్మాసూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, బయోఫ్యూయెల్స్, గ్లాస్ తయారీ, మహిళా ఎంఎస్ఎంఈ పార్కులు, మల్టీ-ప్రొడక్ట్ పారిశ్రామిక పార్క్ లాంటి రంగాల్లో 15 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వీటిలో రూ.870 కోట్లతో ఇఫ్కో కిసాన్ సెజ్ లిమిటెడ్.. ఏపీఐ, డ్రగ్ ఇంటర్మీడియట్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు విరూపాక్ష ఆర్గానిక్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,225 కోట్ల పెట్టుబడికి ఆమోదం. టీజీవీ స్రాక్ లిమిటెడ్-రూ.1,216 కోట్లు.. రెన్యూ ఫొటో వాలియక్స్ ప్రైవేట్ లిమిటెడ్-రూ.3,990 కోట్లు.. శ్రీవేంకటేశ్వర బయోటెక్-122 కోట్లు, ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్-రూ.182 కోట్లు.. జైట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్-305.9 కోట్లు.. రామన్ సింగ్స్ గ్లోబల్ ఫుడ్ పార్క్-రూ.141 కోట్లు.. గాయత్రి రెన్యుబుల్ ఫ్యూయల్స్-రూ.320 కోట్లు, మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్-రూ.343 కోట్లు.. ఎలీప్ ఉమెన్ ఎంఎస్ఎంఈ పార్క్-రూ.22.48 కోట్లు..మాస్ ఫ్యాబ్రిక్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్-రూ.200 కోట్లు..టెలియన్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్-రూ.350 కోట్లు. ఈ పెట్టుబడులతో లక్షకు పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఐటీ రంగాల్లో 11 కీలక ప్రాజెక్టులకు ఆమోదం. రూ.1,421.2 కోట్ల పెట్టుబడితో, 3,057 ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకు అవకాశం. అమరావతిలో 7 క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులు, నాయుడుపేటలో ఒక ఎలక్ట్రానిక్స్ తయారీ ప్రాజెక్టు, విశాఖలో 3 ఐటీ క్యాంపస్ ప్రాజెక్టుల ఏర్పాటు.
- అమృత్-2లో భాగంగా రూ.9,514.63 కోట్ల వ్యయంతో 506 పెండింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆమోదం.
- చిత్తూరు జిల్లా కుప్పంలో పాలార్ నదిపై చెక్-డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనులకు రూ.15.96 కోట్లు.
- గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 227 మంది తెలుగు పండితులు, 91 మంది హిందీ పండితులు, 99 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి.
- సాంఘిక సంక్షేమ శాఖ నియంత్రణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు పునర్నిర్మాణానికి ఆమోదం.
- కేంద్ర హోంశాఖ రూపొందించిన 'మోడల్ ప్రిజన్స్ చట్టం-2023' అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్టు-2025 ముసాయిదా బిల్లుకు, దానిని అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం.
- నెల్లూరు జిల్లా తెట్టు రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీ-మోడల్ రైల్ కార్గో టెర్మినల్ స్థాపనకు చేవూరు గ్రామంలోని 153.77 ఎకరాల భూమిని ఢిల్లీకి చెందిన మెస్సర్స్ రామాయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయింపు.
- నెల్లూరు జిల్లా బోగోలులోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో 29.58 ఎకరాలు ఎంబైఎస్ సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థకు కేటాయింపు.
- విశాఖ, బాపట్ల, తిరుపతిలో రూ.784.39 కోట్ల పెట్టుబడులతో నాలుగు ప్రముఖ హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలకు ఆమోదం. విశాఖలోని ఎండాడలో పీవీఆర్ హాస్పిటాలిటీస్‌కు లీజుకు 3 ఎకరాలు.. రూ.225 కోట్ల పెట్టుబడి.. మధురవాడలో మెగ్లాన్ లీజర్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు లీజుకు ఐదెకరాలు.. రూ.348 కోట్ల పెట్టుబడి.. బాపట్లలో యాగంటీ ఎస్టేట్స్ వారి సొంత భూమిలో రూ.61 కోట్లతో బీచ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు ఆమోదం. తిరుపతిలో నందినీ హోటల్స్ 149 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకు అనుమతి.
- ఎంబైఎస్ ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్ పేరు స్వర హోటల్స్ లిమిటెడ్‌గా మార్పు. రూ.250 కోట్లతో తిరుపతిలో ఒబెరాయ్ విలాస్ లగ్జరీ రిసార్ట్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ భూమి కేటాయింపునకు ఆమోదం.
- కడప జిల్లా కొప్పోలు, చెమ్మలూరు, టీ కోడూరు గ్రామాల్లో 45 ఎకరాల ప్రభుత్వ భూమి లీజు ప్రాతిపదికన విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎన్ఆర్ఈడీసీఏపీ, హెటిరో విండ్ పవర్‌కు అనుకూలంగా బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం.



క్వాంటమ్ కంప్యూటింగ్‌పై గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

తూర్పు తీరం.. ఐటీ సంబరం

(మొదటిపేజీ తరువాయి)

ఐటీ శాఖ మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం ప్రారంభిస్తారు. ఆ తరువాత 11.30 గంటలకు కాపులుప్పాడలో కేటాయించిన భూమిలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు భూమి పూజ చేస్తారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి లోకేశ్ కూడా పాల్గొంటారు. తమ ఐటీ కార్యకలాపాల కోసం భవనాల నిర్మాణానికి భూమి కేటాయించాలని కాగ్నిజెంట్ కోరగా రాష్ట్ర ప్రభుత్వం కాపులుప్పాడలో 21.31 ఎకరాలు కేటాయించింది. విశాఖపట్నం ప్రాజెక్టుకు రూ. 1,582.98 కోట్లు పెట్టుబడి పెడతామని చెప్పడంతో ప్రభుత్వం ఎకరా 99 పైసలకే ఇచ్చింది. దశల వారీగా ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కాగ్నిజెంట్ ఒప్పందం చేసింది. 2029 మార్చి నాటికి కమర్షియల్ ఆపరేషన్లు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. అయితే అప్పటివరకు వేచి ఉండలేమని ఒకవైపు కేటాయించిన భూమిలో నిర్మాణం చేపడుతూనే మరో వైపు తమ సంస్థ ఆపరేషన్లు నిర్వహిస్తామని ప్రకటించింది.

మరో ఏడు కంపెనీలు కూడా..

విశాఖలో మరో ఏడు కంపెనీలకు కూడా ఐటీ మంత్రి లోకేశ్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. సత్వ కంపెనీ ఇంటిగ్రేటెడ్ ఐటీ పార్కు నిర్మిస్తుంది. ఐటీ టవర్లతో పాటు రెసిడెన్షియల్ ప్లాట్లు, రెస్టారెంట్, హోటల్ వంటివి ఇందులో ఉన్నాయి. అదేవిధంగా ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థలు మెగా ఐటీ పార్కులు ఏర్పాటు చేస్తాయి. నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్, మదర్‌సన్ టెక్నాలజీస్, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ సంస్థలకు కూడా భూమిపూజ చేస్తారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు ఏరోస్పేస్ సంస్థ ఆసక్తి

- మంత్రి జనార్దనరెడ్డితో త్సల్లా ప్రతినిధులు భేటీ

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు డ్రోన్, ఏరో స్పేస్ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఏపీలో డ్రోన్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ త్సల్లా ఏరోస్పేస్ చెప్పింది. గురువారం నాడు వెలగపూడి సచివాలయంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డిని త్సల్లా ఏరోస్పేస్ ప్రతినిధుల కలసి తమ ఆసక్తిని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సన్నద్ధంగా ఉన్నామని, వచ్చే ఐదేళ్లలో రూ. 550 కోట్ల పెట్టుబడులు పెడతామని తెలిపారు.

ఆధునిక పరిశోధనల హబ్‌గా

అమరావతి క్వాంటమ్ వ్యాలీ

విద్య, వైద్యం, ఔషధాల తయారీకి ఏక్యూసీసీ పనిచేయాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా అమరావతిలో ఏర్పాటవుతున్న క్వాంటమ్ వ్యాలీ మారాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. విద్య, వైద్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ రంగాల్లో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) పని చేయాలని సూచించారు. గురువారం క్వాంటమ్ కంప్యూటింగ్, టెక్నాలజీపై పనిచేస్తున్న వివిధ దేశాల పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల బృందం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. వైద్యరంగంలో నూతన ఔషధాలతో పాటు మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలకు గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ఆ బృందం సీఎంకు తెలిపింది. దేశంలో తొలి క్వాంటమ్ బయో మెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా రూపుదిద్దుకుంటుందని ఆ బృందం వివరించింది. ఈసందర్భంగా గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ బృందం సభ్యులకు అభినందనలు తెలిపిన సీఎం.. వైద్యారోగ్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ అంశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉందని అన్నారు. క్వాంటమ్ పరిశోధనలతో బయో సెన్సార్ల లాంటి అప్లికేషన్లను కూడా ప్రజాప్రయోజనాల కోసం అందుబాటులోకి తేవాలని చెప్పారు. అమరావతిలో త్వరలోనే క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమౌతాయని వెల్లడించారు. నేషనల్ క్వాంటమ్ మిషన్ కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తుంటే మొత్తంగా క్వాంటమ్ ఎకో సిస్టం అమరావతికి వస్తోందని చంద్రబాబు వివరించారు.

క్వాంటమ్ గురించి అంతా ఆలోచిస్తున్న సమయంలో ఆ రంగంలో పని చేయడానికి ఔత్సాహిక కంపెనీలు ఏపీని సంప్రదిస్తున్నాయని సీఎం తెలిపారు. క్వాంటమ్ బయో ఫౌండ్రీ అనేది వినూత్న ఆలోచన అని సీఎం చెప్పారు. క్వాంటమ్ వ్యాలీతో పాటు ఏపీలో అమలవుతున్న విధానాలు తమను ఆకర్షించాయని గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ప్రతినిధులు అన్నారు.

16న టీడీపీ జిల్లా కమిటీలు ఖరారు!

- కమిటీల్లో సభ్యుల సంఖ్య 32 నుంచి 40కి పెంపు
- పార్టీ పదవుల్లో సోషల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యం
- కులాలకు జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం
- తొలి నుంచీ టీడీపీ విధానం అదే: చంద్రబాబు
- త్రీమెన్ కమిటీలకు దిశానిర్దేశం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్టీ పదవుల్లో సోషల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రులు, జిల్లా కమిటీల ఎంపిక కోసం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులతో సీఎం సమావేశమయ్యారు. పార్టీ జిల్లా కమిటీల ఎంపికపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సమాజంలో అధికసంఖ్యలో జనాభా ఉన్న కులాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, టీడీపీ ఆవిర్భావం నుంచి అదే విధానాన్ని అవలంబిస్తున్నామని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించింది టీడీపీయేనని, అదే విధంగా మిగిలిన కులాలకూ రాజకీయ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కమిటీల నుంచే సోషల్ ఇంజనీరింగ్‌ను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలో ఉన్న కులాల జనాభా ఆధారంగా అదే దామాషాలో జిల్లా కమిటీకి సభ్యులను ఎంపిక చేయాలన్నారు. జిల్లా కమిటీల్లో ప్రస్తుతం అధ్యక్ష, కార్యదర్శులు కాకుండా 32 మంది సభ్యులు ఉండగా, ఆ సంఖ్యను 40కి పెంచాలని నిర్ణయించారు. 26 జిల్లాలకు సిద్ధం చేసిన కమిటీల సభ్యుల వివరాలను కులాలవారీగా అధ్యయనం చేసిన పార్టీ బ్యాక్ ఆఫీసు సిబ్బంది సీఎంకు అందించగా.. దాని ప్రకారం ఓసీలు 34 శాతం, బీసీలు 41 శాతం, ఎస్సీలు 7 శాతం, ఎస్టీలు 3 శాతం, ఇతరులు 4 శాతం ఉన్నారని సీఎం చెప్పారు. మైనార్టీ కులాలు 40 వరకు ఉన్నాయని, మరో 8 ఇతర కులాలకు కమిటీల్లో తగిన ప్రాధాన్యం లేకుండా పోయిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎక్కువ జనాభా ఉన్న కులాలకు ప్రాధాన్యం ఇవ్వకపోతే వారు రాజకీయంగా ఎప్పటికి ఎదగాలని సీఎం ప్రశ్నించారు. ఓసీల శాతం తగ్గించాలని, ఎస్సీలకు 1 శాతం పెంచాలని, మైనార్టీలకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలకు 33 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని లేనిపక్షంలో కనీసం 26 శాతం తగ్గకుండా చూడాలని సూచించారు. జిల్లాలవారీగా కులాల జాబితాను త్రీమెన్ కమిటీలకు అందిస్తామని, 15వ తేదీనాటికి జిల్లా కమిటీల జాబితాలను సిద్ధం చేసి తనకు అందివ్వాలని ఆదేశించారు. 16న మరోసారి సమావేశమై జిల్లా కమిటీలను ఖరారు చేద్దామని సీఎం స్పష్టం చేశారు.

ఆచితూచి మాట్లాడండి!

- తాజా పరిణామాలపై అప్‌డేట్‌గా ఉండండి
- మన పరిధి ఏమిటో తెలుసుకొని స్పందించండి
- పార్టీ అధికార ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచనలు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే తాజా పరిణామాలపై పార్టీ అధికార ప్రతినిధులు పూర్తి అవగాహన కలిగి మాట్లాడాలని సీఎం చంద్రబాబు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధికార ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ అంశాలపై మాట్లాడే సమయంలో జాగ్రత్తగా లేకుంటే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఇటీవల చూశామని వ్యాఖ్యానించారు. తాజా పరిణామాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలని, దానిలో మన పాత్ర ఎంత వరకు అనేది తెలుసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు ఏదైనా అంశంపై మాట్లాడాల్సి వస్తే.. జాతీయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఒకే లైన్‌లో మాట్లాడతారని, మన పార్టీ నాయకులూ అదే తరహాలో స్పందించాలని నిర్దేశించారు. ఒక అంశంపై మన పార్టీ లైన్ ఏమిటి? ప్రభుత్వ విధానం ఏమిటి? ఆ అంశంలో మన పాత్ర ఎంత వరకు ఉంటుంది? అనే విషయాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడవద్దని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీతో కలిసి పనిచేస్తున్నామని, అదే సమయంలో ఎవరి పరిధి ఏమిటనే దానిపై పూర్తి అవగాహనతో ముందుకెళ్తున్నామని సీఎం పేర్కొన్నారు.

భారత్‌పై మూకుమ్మడిగా 'విషం'

- రెచ్చిపోతున్న పాక్ ఆర్మీ, ఉగ్రవాదులు
- లాహోర్‌లో బాహాటంగా సభ పెట్టిన లష్కరే
- గంగా, యమునలను నెత్తుటితో నింపుతాం..
- ఢిల్లీని వణికిస్తామంటూ తీవ్ర హెచ్చరికలు
- ఇప్పటికే భారత్‌పై ఆర్మీ చీఫ్ మునీర్ విషం
- సభ వెనక ఆయనే ఉన్నారంటున్న నిఘా వర్గాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 11 : భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్మడంలో తామంతా ఒక్కటేనని పాకిస్థాన్ ఆర్మీ, ఉగ్రవాదులు మరోసారి రుజువు చేసుకున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ బుధవారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ మరునాడే లాహోర్‌లో లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థ బహిరంగ సభ నిర్వహించి.... భారత్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేసింది. 'గంగా, యమునలను నెత్తుటితో నింపుతాం..ఢిల్లీని వణికిస్తాం..' అంటూ ఈ సభలో లష్కరే తాయిబా అధినేత హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆ సభకు సంబంధించిన 48 నిమిషాల వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. భారత్‌పై దాడులు చేస్తూ, ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నిషేధిత ఉగ్రవాద సంస్థల జాబితాలో చేరిన లష్కరే తాయిబాకు చెందిన సీనియర్ నాయకులు ఈ సభలో రెచ్చిపోయారు. ఒక ఉగ్ర సంస్థ ఇంత బాహాటంగా సభ జరపడం, భారత్‌పై నేరుగా విషం చిమ్మడం వెనుక పాక్ ఆర్మీ అండ, అసీమ్ మునీర్ వ్యూహం ఉన్నాయని నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఉగ్ర సంస్థలతో మునీర్ బంధం ఈనాటిది కాదని చెబుతున్నాయి. ఆయన ఐఎస్ఐ చీఫ్‌గా ఉండగా, 2018లో హవాలా, డొల్ల కంపెనీల సృష్టి ద్వారా లష్కరే తాయిబాకు భారీగా నిధులను ఆయన సమకూర్చారని చెబుతున్నాయి. లష్కరేకు చెందిన మరో సంస్థ జమాత్ ఉద్ దవా 2019-20లో పాక్‌లో పెద్దఎత్తున విస్తరించడంలో అప్పటి సైనిక కమాండర్ హోదాలో మునీర్ సహకరించారని ఈ వర్గాలు అంటున్నాయి. ఖురాన్‌పై కృషి చేసినందుకుగాను 1990ల్లో మునీర్‌కు హఫీజ్ అనే బిరుదును ప్రదానం చేశారు. ఇప్పుడు అదే పేరు కలిగిన ఒక ఉగ్రవాది కోసం మునీర్ పని చేస్తున్నారని ఈ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

వేదికపై పహల్గామ్ హంతకుడు

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను ఊచకోత కోసిన ఉగ్రదాడికి సైఫుల్లా కసూరీ సూత్రధారి. భారత్ అతని కోసం గాలిస్తోంది. అయితే, తల్హా సయీద్‌తో పాటు కసూరీ కూడా లాహోర్ సభా వేదికపై కనిపించాడు. వీరిద్దరూ కలిసి మిల్లీ ముస్లిం లీగ్ అనే లష్కరే అనుబంధ రాజకీయ పార్టీని పాక్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఈ పార్టీలో చేరి సభ్యత్వం తీసుకోవాలంటూ రాసిన బ్యానర్ వేదికపై కనిపించింది.

ఐఎస్ఐ మాజీ చీఫ్‌కు జైలు శిక్ష

అధికారిక రహస్య చట్టాన్ని ఉల్లంఘించడం, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం సహా పలు తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్న ఐఎస్ఐ (ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్) మాజీ చీఫ్ ఫైజ్ హమీద్‌కు పాక్ మిలిటరీ కోర్టు 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2019-2021 మధ్య కాలంలో ఐఎస్ఐ డీజీగా ఆయన పనిచేశారు. ఈ కాలంలో ఆయన దేశ భద్రత, ప్రయోజనాలకు భంగం కలిగించారని, అధికార దుర్వినియోగం, వ్యక్తులకు వ్యక్తిగత నష్టం కలిగించే చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటిపై విచారణకు గత ఏడాది ఆగస్టు 12వ తేదీన సైన్యం..కోర్టు మార్షల్ ప్రక్రియను ప్రారంభించింది.

అఖండ-2 టికెట్ ధరల పెంపు మెమో సస్పెండ్ చేసిన టీ-హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీహీరో బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన అఖండ-2 సినిమా టికెట్ ధరల పెంపు, గురువారం రాత్రి 8 గంటలకు టికెట్ ధర రూ.600 చొప్పున ప్రీమియర్ షో ప్రదర్శించడానికి అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మెమోను హైకోర్టు సస్పెండ్ చేసింది. పెంచిన రేట్ల ప్రకారం టికెట్‌లను విక్రయించరాదని స్పష్టం చేసింది. హైకోర్టు జారీచేసిన ఈ ఉత్తర్వుల సమాచారాన్ని మెమో జారీచేసిన హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి సంబంధిత నిర్మాణ సంస్థ, బుక్‌మై షో తదితరులకు తెలియజేయాలని పేర్కొంది. ఈ ఉత్తర్వులకు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొంది.

నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్‌తో 'టోల్'కు నామం!

» ప్రకాశంలో ఓ కారు డ్రైవర్ అరెస్టు



నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్‌ను చూపుతున్న పోలీసులు

ఎర్రగొండపాలెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజాల వద్ద ఫీజు చెల్లించకుండా తప్పించుకొనేందుకు.. ఎమ్మెల్యే స్టిక్కర్‌ను మార్ఫింగ్ చేసి కారును బాడుగలకు తిప్పుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తప్పుడు స్టిక్కర్‌తో కారు (ఏపీ 07డీ జడ్ 1807)లో యథేచ్ఛగా తిరుగుతున్న అతడికి చెక్ పెట్టారు. వినుకొండ ఎమ్మెల్యే పేరుతో తిరుగుతున్న కారు డ్రైవర్ షేక్ మున్వర్‌ను ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ చౌడయ్య తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ వాహనంపై ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్ నకిలీదని గుర్తించారు. ఈ క్రమంలో డ్రైవర్ మున్వర్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారని తెలిపారు. మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ మున్వర్ గతంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో కాలం చెల్లిన ఎమ్మెల్యే స్టిక్కర్‌ను సేకరించి, ప్రస్తుతం దానిపై వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేరును మార్ఫింగ్ చేసి టోల్‌ప్లాజాల వద్ద ఫీజు చెల్లించకుండా అద్దెకు నడుపుతున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

సునీత పోరాటానికి మద్దతు

» దోషులను ప్రజల ముందు పెట్టడానికి సహకరించాలంటూ రెండుసార్లు లేఖలు: ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కూతురు వైఎస్ సునీత పోరాటానికి మద్దతుగా నిలబడతామని శ్రీసత్యసాయి జిల్లా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరిలోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వివేకా హత్య కేసును నిగ్గుతేల్చాలని, దోషులెవరో ప్రజల ముందు నిలపెట్టాలని ఆయన కూతురు సునీత చేస్తున్న న్యాయ పోరాటానికి టీడీపీ మద్దతుగా నిలుస్తుంది. రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు ఆమె రెండుమార్లు లేఖలు రాశారు. తన తండ్రి హత్యకు కారుకులెవరో తేల్చేందుకు మద్దతు కోరారు. ఆమె పోరాటం మానవత్వం ఉన్న అందరికీ స్ఫూర్తి. నాపై సీబీఐ కేసులు ఉన్నప్పుడు వాటిని త్వరగా విచారించాలని మేమే కోర్టును కోరాం. జగన్, ఆయన పార్టీ నాయకులు వారిపై ఉన్న కేసులను త్వరగా విచారించాలని కోర్టులను అడగలరా? కదిరిలో సునీత పోరాటానికి మద్దతుగా సంతకాల సేకరణ చేపడతా. ఊరూరా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తాం. వివేకా హత్యకు కదిరిలో గొడ్డలి కొని, ఊరి పరువు తీశారు. వైద్య కళాశాలల విషయంలో జగన్ కోటి ఫోర్జరీ సంతకాల సేకరణ చేస్తున్నారు' అని కందికుంట ఎద్దేవా చేశారు.

విద్యుత్ చార్జీలపై కూటమి తీరు ఆక్షేపణీయం: షర్మిల



విజయవాడ సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలపై చెప్పేవి శ్రీరంగ నీతులు, చేసేవి దొంగ పనులు అనే రీతిలో కూటమి ప్రభుత్వం తీరు ఉందని పీసీసీ చీఫ్ షర్మిల ఎద్దేవా చేశారు. గురువారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఏపీఈఆర్‌సీ ప్రతిపాదనలకు, సీఎం చంద్రబాబు హామీలకు పొంతన లేదు. రూ.15,651 కోట్ల చార్జీల వడ్డనకు కమిషన్ సర్వం సిద్ధం చేస్తుంటే... చార్జీల భారం పడదని చంద్రబాబు చెప్పే మాటలు పాత చింతకాయ పచ్చడితో సమానం. అధికారం చేపట్టిన ఏడాదిన్నరలోపే జనాలకు సర్దుబాటు పేరుతో గుండెపోటు రప్పించారు. ట్రూ అప్ బిల్లుల పేరుతో రూ.15 వేల కోట్లు జనాల జేబులకు చిల్లులు పెటారు. ఇప్పుడు మరో రూ.15 వేల కోట్లను టైం ఆఫ్ ది డే పేరుతో దోచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రజలకు ఏడాదికో హై టెన్షన్ షాక్ ఇస్తున్నారు' అని మండిపడ్డారు.

'ముస్తాబై' వస్తారు

» పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన
» ప్రతి క్లాసులో అద్దం, దువ్వెన, పౌడర్
» పార్వతీపురం మన్యం కలెక్టర్‌కు సీఎం ప్రశంస

(పార్వతీపురం - ఆంధ్రజ్యోతి)

ఒక చిన్న ఆలోచన... పెద్ద మార్పు తెచ్చింది. నిధులేవీ అక్కర్లేకుండా... తరగతి గది స్థాయిలో ఒక పథకం అమలవుతోంది. దాని పేరే... 'ముస్తాబు'! విద్యార్థుల్లో శుభ్రత పట్ల అవగాహన పెంచడం... బడికి చక్కగా తయారై రావడమే ఈ పథకం ఉద్దేశం. బడికి వచ్చే పిల్లలు శుభ్రమైన యూనిఫాం ధరించాలి. తలకు నూనె రాసుకొని, చక్కగా దువ్వుకోవాలి. గోళ్లు తీసుకోవాలి. ఆడపిల్లలైతే రిబ్బన్లతో రెండు జడలు వేసుకోవాలి... ఇలాంటి నిబంధనలన్నీ కార్పొరేట్ స్కూళ్లలో అమలవుతుంటాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ బడుల్లోనూ పిల్లలు ఇలాగే చక్కగా తయారై తరగతి గదుల్లో అడుగు పెడుతున్నారు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చొరవతో 2 నెలల క్రితం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి తరగతి గదిలో అద్దం, దువ్వెన, పౌడర్ ఏర్పాటు చేశారు. చేతులు కడుక్కొనేందుకు నీటి సదుపాయం కల్పించారు. ఒక్కో క్లాస్‌కు ఇద్దరు లీడర్లను నియమించారు. అపరిశుభ్రంగా ఉన్నవారిని అద్దం వద్దకు పంపిస్తారు. అక్కడ ముస్తాబైన తర్వాతే తరగతికి రావాల్సి ఉంది. ఆడపిల్లలు జడలు వేసుకోవడంలో తోటి విద్యార్థులు సహకరిస్తారు. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిన తర్వాత విద్యార్థుల్లో చురుకుతనం పెరిగిందని, అందరూ పరిశుభ్రంగా పాఠశాలకు వస్తున్నారని కృష్ణపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం వి.నారాయణరావు తెలిపారు.


తరగతి గదిలో ఏర్పాటు చేసిన అద్దం వద్ద విద్యార్థులు

చదువుతో పాటు పరిశుభ్రత అవసరం



పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు పరిశుభ్రత ఎంతో అవసరం. పౌష్టికాహార లోపం నివారణ, ఆరోగ్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించాం. సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించడం ఆనందంగా ఉంది.

\- ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్

'ముస్తాబు' గురించి సీఎంకూ తెలిసింది. బుధవారం మంత్రులు, హెచ్‌వోడీలు, కార్యదర్శుల భేటీలో ప్రత్యేకంగా ప్రస్తావించి, జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డిని అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం అమలును పరిశీలించాలని ఆదేశించారు.

పెండింగ్ పెద్దన్న!

(మొదటి పేజీ తరువాయి)

చూసేందుకే 21 రోజుల సమయం తీసుకోవడం గమనార్హం. పాలనలో పారదర్శకత, వేగం, సత్వర పరిష్కారాలు ఉండాలన్న లక్ష్యంతో ఈ-ఆఫీస్ విధానం అమల్లోకి వచ్చింది. ఫిజికల్ (భౌతిక) ఫైల్స్ ఉంటే సకాలంలో పరిష్కరించడం లేదని, కొన్ని సందర్భాల్లో అవి గల్లంతయిపోతున్నాయన్న ఫిర్యాదులకు చెక్‌పెట్టేందుకే ఈ -ఆఫీస్ ఫైల్ విధానం అమల్లో ఉంది. అలాంటి ఫైల్స్‌ను చూసేందుకు కూడా మూడు వారాల సమయం తీసుకోవడం దేనికి సంకేతం? ఇదెక్కడి వేగవంతమైన పరిశీలన? ఇది అలసత్వం, అడ్డగోలు నిర్లక్ష్యం కిందకు రాదా? అని ప్రభుత్వ వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

పార్కింగ్‌లో 3154 ఫైళ్లు..

ఏ ప్రభుత్వ శాఖ అయినా, ఎలాంటి ఫైల్ అయినా వారం రోజుల్లోగా సెటిల్ చేయాలి. పెండింగ్ పెట్టరాదు. ఇది నిబంధన. కానీ ఇది రెవెన్యూకు వర్తించదన్నట్లుగా సచివాలయంలోని సెక్షన్ స్థాయి నుంచి అదనపు కార్యదర్శి వరకు అధికారులు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి వద్ద కేవలం రెండు ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే, దిగువ స్థాయిలో అంటే, అసిస్టెంట్ సెక్షన్ అధికారి(ఏఎస్‌ఓ), సెక్షన్ అధికారి (ఎస్‌ఓ), అసిస్టెంట్ సెక్రటరీ(ఏఎస్), డిప్యూటీ సెక్రటరీ(డీఎస్), జాయింట్ సెక్రటరీ(జేఎస్), అదనపు కార్యదర్శిల స్థాయిలో అధికారులు 3,154 ఫైళ్లు పార్కింగ్ చేశారు. ఇవి కేవలం నాలుగు నెలల గణాంకాలే. అందులో అన్నీ ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన విధాన నిర్ణయాలకు సంబంధించినవే ఉన్నాయి. ఈ ఫైళ్లపై వెంటనే నిర్ణయం తీసుకోకుండా అధికారులు తమ లాగిన్‌లలో ఎందుకు పార్కింగ్‌లో ఉంచారు? అంటే, ఆ ఫైళ్లతో సంబంధం ఉన్న ప్రైవేటు వ్యక్తులు, రైతులు, ఉద్యోగులు వచ్చి కలవాలని ఆపారా? లేక కారణాలేమిటి? పదో, వందో కాదు..ఏకంగా వేలాది ఫైళ్లు ఎందుకు ఆపారు? ఐటీ కార్యదర్శి గణాంకాల ప్రకారం, ఇందులో రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల విజిలెన్స్, ఏసీబీ, సర్వీసు ఫైళ్లు వేల సంఖ్యలో ఉన్నాయి. అంటే, ఆ ఫైళ్లతో సంబంధం ఉన్నవారు వచ్చి కలిస్తే తప్ప వాటిని ఈ-ఆఫీస్ లాగిన్ నుంచి బయటకు తీయరా? పరిష్కరించరా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సీఎం హెచ్చరిస్తున్నా...

కార్యదర్శుల స్థాయిలో ఫైళ్ల పరిష్కారంపై సమీక్ష జరగాలని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. దీని ప్రకారం అధికారులు తమ శాఖ పరిధిలో పెండింగ్ ఫైళ్లపై దృష్టిపెట్టాలి. ఏ ఫైల్ ఎందుకు ఆపారు? ఎంతకాలం పెండింగ్‌లో ఉందో ఆరాతీస్తే రెవెన్యూలో వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉండేవి కావని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా, అసలు రెవెన్యూశాఖ రోజువారీగా ఫైళ్లు చూడనంతగా ఇతర బిజీ పనులు ఏం చేస్తోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతస్థాయిలోనే ఒక ఫైల్‌ను ఓపెన్ చేయడానికి మూడు వారాల సమయం తీసుకుంటే.. ఇక జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పరిస్థితి ఏమిటనేది ఊహించుకోవచ్చు. ఇదిలా ఉంటే, కొన్ని వేల ఫైళ్లను రెవెన్యూ శాఖ అధికారులు ఈ-ఆఫీస్ పార్కింగ్‌లో ఉంచారు. ఏ నిర్ణయం తీసుకోకుండా, తిరస్కరించకుండా తమ లాగిన్‌లోనే ఉంచుకోవాడాన్ని పార్కింగ్ అని పిలుస్తున్నారు.

కీలక శాఖలదీ ఇదే పరిస్థితి

ప్రజలకు ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తక్షణమే స్పందించాల్సిన శాఖల్లో రెవెన్యూతో పాటు పోలీసు, విపత్తుల నిర్వహణ విభాగం, ఇంధన (విద్యుత్) శాఖ, ఇంకా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఉన్నాయి. వీటిల్లోనూ సచివాలయ స్థాయిలో వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఇంధన శాఖకు స్పెషల్ సీఎస్‌గా ఉన్నారు. సీఎస్ కార్యాలయానికి వచ్చిన ఫైళ్లను ఒక్క రోజులోనే సెటిల్ చేస్తూ సీఎస్ ముందు వరసలో ఉంటే, ఆయన నేతృత్వంలోని ఇంధన శాఖలో సగటున ఒక ఫైల్ చూసేందుకు 23 రోజుల 16:10 గంటల సమయం తీసుకుంటున్నారని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. విద్యుత్ సరఫరా, నిర్వహణ, కొనుగోళ్లు, కొత్త ప్రాజెక్టులు, ఉద్యోగుల వ్యవహారాలు ఇందులో అనేకం ఉంటాయి. ఈ శాఖలో 301 ఫైళ్లు సచివాలయ స్థాయిలో పార్కింగ్ చేసి ఉంచారు. శాంతి భద్రతలు, ప్రజా రక్షణలో హోంశాఖది కీలకపాత్ర. సచివాలయ స్థాయిలో ఈ శాఖకు వచ్చే ఒక ఫైలు చూసేందుకు సగటున 13 రోజుల 10:18 గంటల సమయం పడుతోంది. ఇందులోనూ 326 ఫైళ్లు పార్కింగ్‌లో ఉంచారు. గ్రామాలతో ముడిపడిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 2012 ఫైళ్లు పార్కింగ్‌లో ఉంచారు. ఒక ఫైలు చూసేందుకు సగటున 24 రోజుల 20:54 గంటల సమయం తీసుకుంటున్న ఘనత ఈ శాఖదే. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు తక్షణమే స్పందించాల్సింది విపత్తుల నిర్వహణ శాఖ. సచివాలయ స్థాయిలో సగటున ఒక ఫైల్ తెరచి చూసేందుకు ఆ శాఖ 10 రోజుల 17:46 గంటల సమయం తీసుకుంటోంది. ఇదీ ఆ శాఖ స్పందనా వేగం. వైద్య, ఆరోగ్యశాఖ అనేది అత్యవసరమైన విభాగం. సచివాలయంలో ఈ శాఖకు ఒక ఈ-ఫైల్ వెళ్తే దాన్ని తెరిచి చూసేందుకు సగటున 11 రోజుల 4:05 గంటల సమయం తీసుకుంటున్నారు. వ్యవసాయ శాఖ రైతాంగానికి అత్యంత కీలకమైనది. ఆ శాఖకు ఫైలు వెళ్తే దాన్ని ఓపెన్ చేయడానికి సగటున 18 రోజుల 1:27 గంటల సమయం తీసుకుంటున్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన నిర్ణయాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలి. కానీ, సచివాలయ స్థాయిలో ఉన్నత విద్యాశాఖకు వచ్చే ఫైలును ఈ-ఆఫీసులో చూసేందుకు 15 రోజుల 19:41 గంటలు, పాఠశాల విద్యలో 16 రోజుల 12:37 గంటల సమయం తీసుకుంటున్నారు.

అట్టడుగున పరిశ్రమల శాఖ

రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతి సాధించేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తోంది. కానీ, ఈ శాఖకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారం సచివాలయం స్థాయిలో నత్త కంటే వెనకబడిపోయింది. ఈ-ఆఫీస్ ఫైల్‌ను చూసేందుకు గరిష్టంగా 27 రోజుల, 18:18 గంటల సమయం తీసుకుంటున్నారు. 1484 ఫైళ్లను పార్కింగ్‌లో ఉంచారు.



సభలో ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మార్గదర్శకుడు వాజపేయి

» వాజపేయి-చంద్రబాబు నేతృత్వంలో దేశాభివృద్ధి
» మధ్యప్రదేశ్ సీఎం డాక్టర్ మోహన్ యాదవ్ ప్రశంస
» శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో సుపరిపాలన యాత్ర

ధర్మవరం, డిసెంబరు 11(ఆంధ్రజోతి): భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి అటల్ బిహారీ వాజపేయి అని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ అన్నారు. నేటి యువతకు ఆయన మార్గదర్శకుడని కొనియాడారు. ప్రధాని మోదీ సుపరిపాలనతో అన్ని దేశాలు భారత్‌వైపే చూస్తున్నాయని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో 'అటల్.. మోదీ సుపరిపాలన యాత్ర'ను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు కాలేజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని వాజపేయి కాంస్య విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మోహన్ యాదవ్ ప్రసంగించారు. "వాజపేయి ప్రధానమంత్రిగా దేశాభివృద్ధికి పాటుపడి, ప్రజల జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు. వాజపేయి, చంద్రబాబు మధ్య మంచి స్నేహబంధం ఉండేది. వారిద్దరూ అన్ని పార్టీలతో సమన్వయం చేసుకుని దేశాభివృద్ధికి పాటుపడ్డారు. ఇప్పుడు రాష్ట్రంలో నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది. ఏపీ ప్రజలు దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. చంద్రబాబు అంటేనే అభివృద్ధి. దేశాభివృద్ధిలో ఏపీది ప్రధాన భూమిక. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఐటీ, పరిశ్రమలు, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి, ఉద్యోగ కల్పనలో పరుగులు పెడుతోంది. ఇందుకు మోదీ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఏపీ, మధ్యప్రదేశ్ అభివృద్ధిలో దేశానికి మోడల్‌గా ఉంటాయి" అని పేర్కొన్నారు. రైతులకు క్రెడిట్ కార్డులను అందించడం ద్వారా దేశంలో రైతు ఆత్మహత్యలు ఆగేలా చేసింది వాజపేయి అని మాధవ్ అన్నారు. పనికి ఆహార పథకం పనిదినాలను పెంచారని, సెల్‌ఫోన్, టెలీఫోన్ విప్లవాన్ని తీసుకువచ్చారని, ప్రతి ఇంటికీ గ్యాస్‌కనెక్షన్ అందించారని చెప్పారు. సుపరిపాలన బస్సు యాత్ర జిల్లాల్లో నిర్వహించి, ఈనెల 25న అమరావతిలో వాజపేయి శత జయంతి సందర్భంగా బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు.

వాజపేయితోనే కనెక్టివిటీ విప్లవం: సత్యకుమార్

దేశంలో మొట్టమొదట కనెక్టివిటీ విప్లవాన్ని తీసుకువచ్చిన నాయకుడు వాజపేయి అని మంత్రి సత్యకుమార్ అన్నారు. దేశంలో గ్రామీణ రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ, రూ. 60 వేల కోట్లతో 8 లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించారని తెలపారు. స్వర్ణ చతుర్భుజితో జాతీయ రహదారులు నిర్మించారని చెప్పారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్రంలో తొలి విగ్రహాన్ని ధర్మవరంలో ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, 3 పార్టీల నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక 'పరకామణి'పై సమగ్ర దర్యాప్తు!

» హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి సీఐడీ

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో హైకోర్టు ఆదేశాలతో పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగనుంది. ఈ వ్యవహారంలో బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐడీని ధర్మాసనం ఆదేశించిన సంగతి తెలిసిందే. 2023 ఏప్రిల్ 29న హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్‌పై అప్పట్లో పరకామణి ఏవీఎస్‌వోగా ఉన్న సతీశ్ కుమార్ తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత నిందితుడు తీవ్ర పశ్చాత్తాపానికి గురయ్యారని, ప్రాయశ్చిత్తంగా తన ఆస్తులు రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటూ టీటీడీ అధికారులు ప్రచారం చేశారు. అదే ఏడాది మే నెలలో రవికుమార్, అతని భార్య రమ్య కలిసి తిరుపతి, చంద్రగిరి, చెన్నైలో ఉన్న రూ.14.42 కోట్ల ప్రభుత్వ విలువ కలిగిన ఆస్తులను టీటీడీ పేరిట రిజిస్టర్ చేశారు. వీటిలో చంద్రగిరిలో 10.26 ఎకరాల మామిడి తోట, తిరుపతి ఉపాధ్యాయనగర్‌లో 150 అంకణాల ఖాళీ స్థలం, తిరుపతి పెద్దకాపులే అవుట్‌లోని అశోకా అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్, తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లిలోని పసుపర్తి అపార్టుమెంట్‌లో 13 ఫ్లాట్లతో పాటు చెన్నైలో గెస్ట్ హౌస్ ఉన్నాయి. ఆ తర్వాత అదే ఏడాది సెప్టెంబరు 9న తిరుమల వన్‌టౌన్ పోలీసులు రవికుమార్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అప్పటి ఏవీఎస్‌వో సతీశ్ కుమారే నిందితుడితో రాజీ పడ్డారు. ప్రభుత్వం, టీటీడీ బోర్డు అనుమతి లేకుండానే ఈ తతంగం నడిచింది. ఆ తర్వాత కేసును మూసివేశారు.

హైకోర్టు జోక్యంతో కదలిన డొంక

పరకామణి చోరీ కేసును నిబంధనలకు విరుద్ధంగా రాజీ చేసుకున్నారని, రవికుమార్ ఆస్తులను అప్పటి అధికార పార్టీ ప్రముఖులు, టీటీడీకి సంబంధించిన కీలక వ్యక్తులు, పోలీసు అధికారులు రాయించుకున్నారని, అందుకే కేసు రాజీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయంటూ తిరుపతికి చెందిన మాచర్ల శ్రీనివాసులు పిల్ దాఖలు చేశారు. హైకోర్టు జోక్యంతో ఈ కేసులో డొంక కదిలింది. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి ఈ నెల 2న నివేదిక అందజేయాలని సీఐడీ డీజీని ఆదేశించింది. దాంతో గత నెల 4నుంచి 30వరకూ సీఐడీ డీజీ వేగంగా విచారణ జరిపారు. ఈ నెల 1న హైకోర్టులో నివేదిక సమర్పించారు. ఆ వేదికను పరిశీలించిన హైకోర్టు దర్యాప్తు కొనసాగించాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో సీఐడీ రంగంలోకి దిగనుంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

పరకామణి చోరీ కేసు నిందితుడి నుంచి ఆస్తులు స్వీకరించే విషయంలోనూ టీటీడీ నిబంధనలు పాటించలేదు.

- ఆస్తులు స్వీకరించే అంశాన్ని పాలకమండలి సమావేశం అజెండాలో చేర్చినపుడు కేసులో రవికుమార్ నిందితుడని పేర్కొనలేదు.
- నిందితుడి నుంచి ఆస్తులు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోలేదు.
- ఆస్తుల స్వీకరణపై అభ్యంతరాలను తెలుసుకునేందుకు పత్రికల్లో పబ్లిక్ నోటీసు ఇవ్వలేదు. పైగా పబ్లిక్ నోటీసు ఇవ్వకుండా మినహాయింపు ఇస్తూ బోర్డు తీర్మానం కూడా చేశారు.
- బోర్డు సమావేశంలో చర్చించడానికి ముందుగానే కొన్ని ఆస్తులను టీటీడీ భౌతికంగా స్వాధీనం చేసుకుంది.



అప్పట్లో చైర్మన్‌దే హవా.. అందుకే ఆయనకు చెప్పా

» మూడో రోజు సిట్ విచారణలో మాజీ జీఎం సుబ్రమణ్యం
» నేటితో ముగియనున్న కల్తీ నెయ్యి కేసు నిందితుల కస్టడీ

తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేసిన సమయంలో టీటీడీలో చైర్మన్ హవానే నడిచిందని, అందుకే నెయ్యి కల్తీ అయిందన్న మైసూరు ల్యాబ్ రిపోర్టు గురించి ఆయనకే సమాచారమిచ్చానని ఈ కేసులో నిందితుడైన ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం సుబ్రమణ్యం సిట్ అధికారులకు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కల్తీనెయ్యి కేసులో నిందితులు సుబ్రమణ్యం, అజయ్ కుమార్ సుగంధ్‌ను నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి కోర్టు అనుమతితో నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు.. మూడో రోజైన గురువారం వివిధ కోణాల్లో వేర్వేరుగా ప్రశ్నించారు. కల్తీ నెయ్యి సరఫరా వెనుక ఎంతమంది అధికారుల పాత్ర ఉంది? వారు ఎవరెవరో చెప్పాలని సిట్ ప్రశ్నించగా.. తనకేమీ తెలియదని సుబ్రమణ్యం చెప్పినట్టు సమాచారం. కల్తీ నెయ్యి సరఫరాలో తన పాత్ర ఏమీ లేదని, తాను జీఎంగా చేరక ముందు నుంచీ ఏయే డెయిరీలు నెయ్యి సరఫరా చేస్తున్నాయో అవే సంస్థలే తాను పనిచేసినప్పుడు కూడా సరఫరా చేశాయని చెప్పినట్టు తెలిసింది. దేవుడి ప్రసాదమైన లడ్డూ తయారీకి వినియోగిస్తారని తెలిసీ కల్తీ నెయ్యిని ఎలా అనుమతించారని, పాపభీతి లేదా అని సిట్ ప్రశ్నించినట్టు సమాచారం. తనకు దేవుడంటే భక్తి, భయం రెండూ ఉన్నాయని, కల్తీ నెయ్యి వ్యవహారంతో తనకు సంబంధం లేదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. అలాంటప్పుడు రూ.3.50 లక్షలు ఎవరి నుంచీ తీసుకున్నారు..? ఎందుకు తీసుకున్నారు..? ఆ డబ్బు ఎక్కడ డిపాజిట్ చేశారు..? అని సిట్ ప్రశ్నించగా సమాధానమివ్వలేదని తెలిసింది. మరో నిందితుడు సుగంధ్ వరుసగా మూడో రోజు కూడా పెద్దగా నోరు విప్పలేదని తెలిసింది.

నాణ్యమైన 'పట్టు' కోసం టీటీడీ ప్రయత్నాలు

» స్టాక్ పూర్తికాకముందే వస్త్రాలు కొనేందుకు చర్యలు
» రూ.400కే సరఫరా చేసేందుకు కొన్ని సుముఖత

తిరుమల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు కప్పే పట్టువస్త్రాలు నాణ్యమైనవి కొనుగోలు చేయడంపై టీటీడీ దృష్టిసారించింది. తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. గత పదేళ్లుగా వీఆర్‌ఎస్ ఎక్స్‌పోర్ట్సు సంస్థ, దాని అనుబంధ సంస్థలు సరఫరా చేస్తున్న పట్టువస్త్రాలు పట్టువి కాదని, పాలిస్టర్ వస్త్రాలను అధిక ధరకు విక్రయిస్తున్నట్టు టీటీడీ బోర్డు, విజిలెన్స్ విభాగాలు తేల్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రూ.1,389 చొప్పున 15 వేల వస్త్రాల కొనుగోలుకు ఆ సంస్థకు ఇచ్చిన కాంట్రాక్ట్‌ను అక్టోబరులో టీటీడీ రద్దుచేసింది. సాధారణంగా ప్రతిరోజు వీఐపీ బ్రేక్‌తో పాటు వేదాశీర్వచనం టికెట్ కొనుగోలు చేసే భక్తులకు ఈ పట్టువస్త్రాలను కప్పడం ఆనవాయితీ. నిత్యం 80 నుంచి 100 వస్త్రాలను వినియోగిస్తారు. సరఫరా సంస్థ కాంట్రాక్ట్‌ను రద్దు చేయడంతో ఇప్పటికే కొన్న స్టాక్ నుంచే సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి లోటు లేకపోయినప్పటికీ త్వరలో కొత్తవి కొనకపోతే లోటు ఏర్పడే పరిస్థితి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో నాణ్యమైన పట్టువస్త్రాల కొనుగోలు అంశంపై టీటీడీ దృష్టిసారించింది. టెండర్ నిబంధనల మేరకు తక్కువ ధరకు సరఫరా చేసే పలు సంస్థలతో టీటీడీ ఇప్పటికే సంప్రదింపులు చేసినట్టు సమాచారం. మంగళగిరి, గుంటూరు వంటి వివిధ ప్రాంతాల్లోని నాణ్యమైన పట్టువస్త్రాలను టీటీడీ అవసరాలకు తగ్గట్టు సరఫరా చేసే సంస్థలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో టీటీడీ పరిశీలిస్తోంది. రూ.400 ధరకే నాణ్యమైన పట్టువస్త్రాలు సరఫరా చేసేందుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చినట్టు తెలిసింది. వీలైనంత త్వరగా మేలురకం వస్త్రాలను అధిక మొత్తంలో కొనుగోలు చేసేలా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

వెనక్కి కాదు.. ముందుకే!

(మొదటి పేజీ తరువాయి)

పొందిందని, ఇక కేబినెట్ ఆమోదం, ఆపై పార్లమెంటులో ఆమోద ముద్రపడటమే తరువాయి అని సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదించే అవకాశమున్నట్లు సమాచారం. 'కేంద్ర న్యాయ శాఖ కొన్ని వివరణలు కోరింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సవివరమైన నివేదిక సమర్పించింది. ప్రస్తుతం రాజధాని అంశం హోం మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉంది. పార్లమెంటు ఆమోదం అనంతరం దీనిపై హోంశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. అమరావతిలో కీలకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలను నెలకొల్పేలా, కొన్నింటిని పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తున్నారు. కొన్ని మీడియా వర్గాలు ఈ ప్రయత్నాలను, అమరావతిలో జరుగుతున్న పనులను విస్మరించి... అమరావతిలో ఏమీ జరగడం లేదన్నట్టుగా చూపేందుకు ప్రయత్నిస్తున్నాయి. సీఆర్‌డీఏ కార్యాలయం కార్యకలాపాలు అమరావతిలో ప్రారంభమయ్యాయి. 70కిపైగా సంస్థలు ఇప్పటికే నిర్మాణ పనులు చేపట్టాయి. 10వేల మంది కార్మికులు రాజధాని పనులు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు అమరావతిలో 24గంటలూ పనిచేస్తున్నారు" అని ప్రభుత్వం తెలిపింది.

తప్పుడు రాతలతో రాక్షసానందం: పెమ్మసాని

రాక్షసానందం పొందేందుకే వైఎస్ జగన్ అమరావతి గురించి తన పత్రికలో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. "అమరావతిని శాశ్వత రాజధానిని చేసే బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో గానీ, వచ్చే సమావేశాల్లో గానీ ప్రవేశపెడతాం. కొన్ని సాంకేతిక అంశాలపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. 2014 నుంచి రాజధానిగా గుర్తించాలా? 2024 నుంచి గుర్తించాలా అనే అంశమే కీలకం. సీఎం చంద్రబాబు ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఒక నెల ఆలస్యమైనా అమరావతికి కూటమి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ తీసుకొస్తుంది" అని పెమ్మసాని తేల్చిచెప్పారు. అమరావతికి నిధులు ఇవ్వొద్దని జగన్, ఆయన మనుషులు వరల్డ్ బ్యాంకుకు ఉత్తరాలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. 'అమరావతి' బిల్లు ఆపాలని ఒత్తిడి కూడా తీసుకొస్తారనే విషయం ప్రజలు గ్రహించాలన్నారు.

ఏపీలో 'కూటమి' భేష్!


(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ అనెక్స్‌లో ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15మంది ఎంపీలతో అరగంట ముచ్చటించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... తెలంగాణలో పార్టీ బలహీనంగా ఉందని ఆ రాష్ట్ర ఎంపీలకు చురకలంటిస్తూ... ఏపీలో ప్రభుత్వ పనితీరును ప్రధాని ప్రశంసించారు. "చంద్రబాబు పనితీరు బాగుంది. రాష్ట్ర పరిపాలన, అభివృద్ధిపై నాకు మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోంది. పెట్టుబడులు ఎక్కువగా ఏపీవైపు వెళ్తున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశముంది. ఇది మంచి పరిణామం' అని మోదీ పేర్కొన్నట్లు తెలిసింది. జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు బీజేపీ కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. పార్టీ పరంగా చేస్తున్న కార్యక్రమాలు, ప్రజల స్పందన గురించి కూడా ఎంపీలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో గతంలోకంటే బీజేపీ బలపడుతోందని, ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ప్రధానికి చెప్పినట్లు సమాచారం.

తెలంగాణలో బలహీనంగా బీజేపీ

తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉన్నప్పటికీ పార్టీ నేతలు మాత్రం శక్తిమంతంగా పనిచేయడం లేదని, 8 మంది ఎంపీలున్నా రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని మోదీ తెలంగాణ ఎంపీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదిలో తెలంగాణలోనే బీజేపీ బలహీనంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


SOUTH INDIA shopping mall
ఓల్డ్ వీనస్ టాకీస్, బోస్ రోడ్, తెనాలి
ఇప్పుడు తెనాలిలో
ఉ॥ గం. 10:30 లకు
నేడే గొప్ప ప్రారంభం
ప్రముఖ సినీతార కుమారి మీనాక్షి చౌదరి గారిచే (సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్)
షోరూం ప్రారంభోత్సవానికి ఇదే మా ఆత్మీయ ఆహ్వానం...
ముఖ్య అతిథులు
Sri. Dr. Pemmasani Chandra Sekhar Garu
Minister of State in the Ministry of Communications & Minister of State in the Ministry of Rural Development, Govt of India.
Sri. Nadendla Manohar Garu
Minister of Civil Supplies, Food & Consumer Affairs, Govt of A.P.
Sri. Alapati Rajendra Prasad Garu
Member of Legislative Council, A.P.
Sri. Pasupuleti Trimurthi Garu
19th Ward Councilor, TDP floor leader.
ప్రారంభోత్సవ ఆఫర్
కాస్ట్ to కాస్ట్ సేల్
అన్ని రకాల వస్త్రాలపై
PATTU SAREES
TISSUE PATTU BUY 3 ₹2999
MEENA PATTU BUY 3 ₹3999
3 FINGERS PATTU BUY 3 ₹4999
BUY 1 ALAMKARI SAREE @3995 & GET 2ND SAREE @ ₹39
BUY 1 KALAMKARI SAREE @4995 & GET 2ND SAREE @ ₹49
BUY 1 VASUDHRA SAREE @350 & GET 2ND SAREE @ ₹9
BUY 1 MANGLAM PATTU SAREE @650 & GET 2ND SAREE @ ₹9
BUY 1 MANGAL SUTRA SAREE @650 & GET 2ND SAREE @ ₹9
SOUTH INDIA shopping mall
*Conditions apply
SAREES
2895 ₹1950 KANCHI BROKET GET VADDANAM FREE
BUY 3 ₹598 LINEN COTTON
BUY 3 ₹550 TURKEY SILK
325 ₹119 KAVERI PRINT
450 ₹295 SPRING SILK
795 ₹350 SOUTH SILK
BUY 5 ₹300 VENKATGIRI PRINT
850 ₹395 DEEPIKA WORK SAREES
895 ₹450 BANGALORE SILK
950 ₹495 SRI VALLI SILKS
1395 ₹650 CHINNON PATTU
BUY 3 ₹1199 CHANDRI PRINT
BUY 3 @ ₹895 BANARAS ORGANJA SAREES
BANARAS FANCY SAREES
BUY 3 @ ₹1995 BANARAS ORGANJA SAREES
BUY 3 ₹2495 KOLKATA DESIGNER SAREE
BUY 3 ₹2999 KOLKATA DESIGNER SAREE
BUY 3 ₹2999 BANARAS CRUSH SAREES
BUY 3 ₹2999 BANARAS ORGANJA STONE WORK
BUY 3 ₹4995 KOLKATA DESIGNER SAREE
SAREES FLAT 50% OFF
50% OFF 398 ₹199 NAVYA TISSUE
50% OFF 550 ₹275 RICCO PATTU
50% OFF 596 ₹298 VISTARA PRINT
50% OFF 598 ₹299 DOLA PRINT
50% OFF 650 ₹325 VISCOS SILK
50% OFF 698 ₹349 GATTU SILK
50% OFF 798 ₹399 TUSSER SILK
50% OFF 950 ₹475 DHARMAVARAM
50% OFF 1198 ₹599 TISSUE PATTU
50% OFF 1198 ₹599 MYSORE SILK
50% OFF 1498 ₹749 MAHESHARI PATTU
50% OFF 1550 ₹775 VARANASI BROKET SAREE
WOMENS WEAR
BUY 4 ₹500 NIGHTY
BUY 2 ₹799 COTTON DRESS MATERIALS
BUY 3 ₹999 PALAZZO SET
BUY 3 ₹1199 NIGHT DRESS
BUY 2 ₹1398 PATIYALA SUIT
BUY 2 ₹1399 LEHANGAS
BUY 3 ₹500 LEGGINGS
BUY 5 ₹500 DUPATAS
BUY 3 ₹555 PRINTED PLAZOS
BUY 5 ₹500 PRINTED PLAZOS
299 ₹199 ONE PIECE MIDDY
FLAT 50% OFF KURTIS & WOMENS PANTS ON SELECTED ITEMS
HANDLOOMS
1 PC ₹99 DOOR CURTAINS
4 PCS ₹499 SINGLE BEDSHEETS SET
2 PCS ₹168 PILLOWS
4 PCS ₹999 DOUBLE BEDSHEETS SET
4 PCS ₹199 COTTON TOWELS
BUY 1@ 295 GET 1 FREE BLANKETS
MENS WEAR
3 PCS ₹500 T-SHIRTS
3 PCS ₹999 CASUAL SHIRTS
3 PCS ₹999 JEANS
3 PCS ₹999 COTTON TROUSERS
3 PCS ₹999 FORMAL TROUSERS
ADAM PARKER 15% OFF
COOL COLORS WALKER
PURCHASE ANY 2 & GET STYLISH DUFFLE BAG@ 199
PURCHASE ANY 3 & GET STYLISH DUFFLE BAG@ FREE
TWILLS 10% OFF
REPUBLICAN 50% OFF
4 PCS ₹500 GIRLS SHORTS & PYJAMA
6 PCS ₹550 GIRLS T-SHIRTS
4 PCS ₹600 GIRLS TRACK PANT 3/4
4 PCS ₹550 BOYS SHORTS
4 PCS ₹595 BOYS T-SHIRTS
BOYS PANTS FLAT 50% OFF
buy 1 @ 245 buy 3 @ 695 GIRLS COTTON FROCKS
4 PCS ₹600 BOYS SHORTS
FLAT 50% OFF BOYS SHIRTS
BOYS T-SHIRTS & NICKER SET
buy 1 @ 295 buy 3 @ 745
buy 1 @ 345 buy 3 @ 895 GIRLS COTTON FROCKS
KIDS WEAR
SCAN FOR THE LOCATION
Raymond LINENCLUB DIGJAM Siyaram's ARVIND
ALL LEADING BRANDS AVAILABLE ON SUITING & SHIRTING
1800 570 0999 CALL US
Shop Online 24x7 @ www.SISMO.in Follow us on: SouthIndiaShoppingMalls SouthIndiaShopping